04-06Pg1exHMNWJQE.qxd:04-06Pg1exHMNWJQE.qxd 1/1/02 6:43 AM Page 1

సామెత
గత వారసత్వాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 124 పేజీలు: 16 వెల: 6.50

**రూ. 10వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి** 5లో

**మమతా బెనర్జీ షాక్.. 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు**

# ఆరోగ్యాంధ్ర కోసం 'యోగాంధ్ర'

రాష్ట్రంలో 10 లక్షల మంది యోగా సాధకులు

7 నుంచి 21 దాకా 14 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

యోగా యజ్ఞంలో కోటిమంది భాగస్వామ్యం

హైదరాబాద్‌లో పవన్ సభను అడ్డుకోవడం సరికాదు: సిఎం చంద్రబాబు



బుధవారం సచివాలయంలో యోగాంధ్ర పోస్టరును ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర 2026కు ప్రజా చైతన్యం, ప్రజా సహకారం ఎంతో అవసరమని సిఎం చంద్రబాబు తెలిపారు. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఉత్తమ సాధనమన్నారు. పాఠశాల నుంచీ స్వర్ణ వార్డు వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అమరావతి అందాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి చాటుతామని వివరించారు. రాష్ట్రంలో 10లక్షల మంది యోగా సాధకుల్ని తయారు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 21 వ్యాధులకు యోగాసనాల వీడియోలను ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించారన్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. సందేహాలకు సంబంధించి 8142404888 కాల్ సెంటర్ ద్వారా సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. సంజీవిని పథకంలో యోగాను అనుసంధానం చేస్తామన్నారు. ఈ ఏడాది "యోగాంధ్ర ఫర్ హెల్తీ ఏజింగ్" థీమ్‌తో కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ నెల 7 నుంచి 21 వరకూ 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన కార్యక్రమం అమరావతి వేదికగా కృష్ణానది ఒడ్డున పశ్చిమ బైపాస్‌ను 25 వేల మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు.అంతర్భాగంగా చంద్రబాబు మీడియా ముఖాముఖిలో యోగా నెలగా జూన్ మాసం: యోగాంధ్ర 2026కు రూ. 10 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. నూనె, ఉప్పు, చక్కెర వంటివి వీలైనంత తక్కువ మోతాదు వాడితే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు.
డయాబెటిస్ అన్ని రోగాలకు గేట్‌వేగా మారుతున్నందున దీనిపై ప్రజల్ని చైతన్యపరుస్తామన్నారు. జూన్‌నెలను యోగానెలగా ప్రకటించుకుని ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యండబ్బులు ఆదాకు యోగా మంచి సాధనం అని స్పష్టం చేశారు. యోగాతో పాటు ప్రకృతి సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో 20లక్షల మంది రైతులు చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరాల్లో 50లక్షల మంది రైతులకు విస్తరిస్తారని వివరించారు. యోగాంధ్ర 2026పై మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో యోగాపై యోగాసాధకులు చేసిన >>2



## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

### భగ్గుమన్న రెస్టారెంట్, 21 మంది సజీవ దహనం

### మృతులలో 10 మంది విదేశీయులు

**న్యూఢిల్లీ, జూన్ 3:** రాజధాని నగరంలోని మాల్వియా నగర్‌లో ఉన్న రెస్టారెంట్ బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందారు.మరో 40 మందికిపైగా తీవ్ర గాయాలపాలయినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రాథమిక దర్యాప్తులో ఈ ప్రమాదానికి సంబంధించి ఆసక్తి కర అంశాలు వెలుగులోకివచ్చాయి. ఫ్లోరిష్‌స్టే హోటల్‌లోపర్మిషన్ కేవలం ఆరురూమ్‌లకు మాత్రమే >>2

## కన్నడ ముఖ్యమంత్రిగా డికె పదవీ ప్రమాణం

ఆయనతోపాటు 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్‌లోకి 5లో

యతీంద్ర, యుటిఖాదర్‌లకు కూడా ఛాన్స్



## రాష్ట్రానికి ప్రత్యేక విద్యుత్ బస్సులు

### 5,500 సర్వీసులు త్వరలో రోడ్లపైకి

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఎపికి ప్రత్యేక విద్యుత్ బస్సులను కేటాయించింది. ప్రధానమంత్రి ఇ-బస్సు పథకంలో భాగంగా రాష్ట్రానికి ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఉన్న డిజల్ బస్సుల్లో కొన్ని కాలంచెల్లాయి. వీటిస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ఎపిఎస్ఆర్టీసీ ప్రవేశపెట్టేందుకు >>2






## టెట్ తప్పనిసరి

### సర్వీసులో ఉన్న టీచర్లకూ యేడాదికి రెండు సార్లు పరీక్ష

### ఉత్తీర్ణత గడువు 2028 ఆగస్టు 31 దాకా పొడిగింపు

### సుప్రీం కోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటి) తప్పనిసరి అని సుప్రీంకోర్టు 65కు పైగా సమీక్షా పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.అయితే, పిల్లల ప్రాథమిక విద్యలో నిరంతరాయతను నిర్ధారించాల్సిన ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఇకపై ఎటువంటి పొడిగింపులు ఉండవని పేర్కొంటూ, పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి గడువును ఆగస్టు 31, 2028వరకు పొడిగించడం ద్వారా కోర్టు పాక్షిక ఉపశమనం కల్పించింది. ఉపాధ్యాయులు టెట్ (టిఇటి) అర్హతను పొందడానికి అసలు గడువు ఆగస్టు31,2027 కాగా, దానిని ఇప్పుడు ఆగస్టు 31, 2028 వరకు పొడిగించారు. అర్హులైన ఉపాధ్యాయులకు చట్టబద్ధ >>2

# ఎఐ ఇంజినీర్ల వేదిక ఎపి

మాస్కోలో రష్యా స్బేర్‌బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌తో మంత్రి లోకేష్ భేటీ

భారత్‌లో గిగాచాట్ ఎఐ, బ్యాంకింగ్ భద్రత టెక్నాలజీపై కీలక ప్రతిపాదనలు

విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు ప్రత్యేక రుణాలు అందించాలని విజ్ఞప్తి


మాస్కోలో బుధవారం రష్యాకు చెందిన స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు వేదికగా సిద్ధమవుతుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.రష్యా పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేష్ ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్,టెక్నాలజీ, స్మార్ట్‌సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన 'గిగాచాట్ ఎల్ఎల్ఎం'ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ >>2



## భారత్‌పై 12.5% అదనపు సుంకాలు

### ఊహించని షాక్ ఇచ్చిన అమెరికా

**వాషింగ్టన్,జూన్ 3:** భారత్, అమెరికాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై న్యూఢిల్లీలో కీలకమైన ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్న తరుణంలో అమెరికా ఊహించని షాక్ఇచ్చింది. భారత్‌లో అన్యాయమైన వాణిజ్య పద్ధతులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం భారత్‌ను దోషులజాబితాలో చేర్చింది. ఈ అన్వేషణల ఆధారంగా భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే వివిధ రకాల దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతంవరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టిఆర్ ప్రతిపాదించింది. అమెరికా ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ >>2

# ఇంకా ప్రాంతీయ విద్వేషాలా?

● అది దేశ సమగ్రతకు భంగం కలిగించడమే ● కులదూషణలకు స్వస్తిచెప్పేందుకు సేనాగళం పేరిట కమిటీ ● తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం ● కెటిఆర్ తప్పుగా మాట్లాడి ఉండకపోవచ్చు ● పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాంతీయ విభేధాలతో రాజకీయాలు చేయడం అంటే దేశ సమగ్రతకు భంగం కలిగించడమేనని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అణచివేయగలిగే శక్తి ఎవ్వరికి లేదన్నారు.తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం. ఎవరైనా అక్కడకు వెళ్లవచ్చు, ఆస్పత్రిలో చూపించుకోవచ్చు. హద్దులకు ఫెన్సింగ్‌లు వేస్తారేమో కానీ, మనుషుల మనసులకు వేయలేరు కదా! అని స్పష్టం చేశారు. అమరావతిలో పవన్ బుధవారం పర్యటించారు.శాఖమూరులో అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం వేరని, కానీ తెలుగువారి కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఎప్పుడూ వేరే రాష్ట్రంవారు రాకూడదని చెప్పలేదని గుర్తుచేశారు. తెలంగాణలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, ఎపిలో తెలంగాణ కాంట్రాక్టర్లు పనులు చేసుకుంటున్నప్పుడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకని పవన్ ప్రశ్నించారు. పుష్కర కాలం తర్వాత కూడా ఇంత ద్వేషం ఉంటుందని తాను అనుకోలేదన్నారు. 'హైదరాబాద్ నా ఇల్లు, నా పార్టీ అక్కడే ఆవిర్భవించింది. అక్కడికి వెళ్లడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణలో పుట్టిన భూమి పుత్రులు సభలు పెట్టుకుంటే తప్పేంటి?'అని నిలదీశారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్‌తో తనకు సోదర సమాన బంధం ఉందని, ఆయన తప్పుగా మాట్లాడి ఉండరని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వ్యవహారంలో సిఎం రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నేతలే పనిగట్టుకుని ఇలాంటి విద్వేషాలు రేపుతున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగినా ప్రయోజనం ఏముందని, బూర్గుల రామకృష్ణారావు, పివి నరసింహారావు వంటి మహనీయుల త్యాగాలను గుర్తించాలని హితవు పలికారు. ఇలాంటి ప్రాంతీయ విద్వేషాలకు ముగింపు పలకడమే తన తపన అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో >>2



బుధవారం శాఖమూరులో మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

## లేగదూడలపై పులి పంజా

### పోలవరం జిల్లాలో 13 ఆవుదూడలు హతం

**పోలవరం జిల్లా ప్రతినిధి మే 3 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగవరం గ్రాములో బుధవారం తెల్లవారుజామున పశువుల పాకపై రాయల్ బెంగాల్ టైగర్ మెరుపు దాడి చేసి పంజా విసిరింది. పెద్ద పులి దాడిలో మొత్తం 13 లేగ దూడలు మృతి చెందాయి. ప్రాణాలు కోల్పోయిన దూడలకోసం తల్లి ఆవుల అక్రందన చూరులను సైతం కంట తడి పెట్టిస్తుంది.పెద్ద పులి వరుస దాడులతో గిరిజన గ్రామాల్లో అలజడి మొదలైంది. పులిని కట్టడి చేయటానికి రిస్క్యూ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. మైదాన ప్రాంతంలో పట్టుకున్న పులిని పాపికొండల అభయారణ్యంలో సుర >>2

## కల్తీ నెయ్యి కేసులో సోదాల కలకలం

### దేశంలోని 15 ప్రాంతాల్లో ఇడి అధికారులు తనిఖీలు, రూ. 60 లక్షల నగదు స్వాధీనం

**తిరుమల,జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడాల్సిన కీలక పెద్దలు లోపాలను అవకాశంగా మార్చుకుని నెయ్యిటెండర్లు మార్చి కల్తీనెయ్యి సరఫరా చేసుకున్నారనే ప్రధాన వివాదంలో తాజాగా ఇడి అధికారులు కీలక వ్యక్తులపై దాడులు చేయడం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి కేసులో సిబిఐ సిట్ అధికారులు, ఏకసభ్యకమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా త్రిసభ్య కమిటీ వస్తుందనే హాట్‌టాపిక్‌గా మారినా తాజాగా బుధవారం ఏకకాలంలో దేశవ్యాప్తంగా కీలకమైన వ్యక్తులపై ఇడి దాడులు చేయడం మాత్రం ఆందోళనకలిగిస్తోంది. బుధవారం తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇడి జరిపిన విస్తృత సోదాల్లో ఎవరెవరికి ఏమేరకు వాటాలు అందాయనేది బయటకురానుంది. లడ్డూల కల్తీ నెయ్యి కేసులో దేశంలోని 15ప్రాంతాల్లో ఇడి అధికారుల సోదాలు చేయడం ప్రధానసూత్రధారుల్లో గుబులు రేకెత్తిస్తోంది. ఈ కేసులో నిందితులు పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేష్ చావ్డా, అపూర్వ చావ్డా,సుచీంద్ర శాంతారామ్ లాంకే, అజయ్‌కుమార్ సుగంధ్, మహేష్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసి 60 లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరీ కేసుల్లో ఉన్న వారివద్ద అంత భారీమొత్తంలో ఇప్పుడు లభించడం మాత్రం చర్చనీయాంశంగా మారింది, 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి వైసిపి బోర్డు ఛైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి ఏకంగా టెండర్ల నిబంధనలే మార్పుచేసి ,అర్హత లేని డెయిరీలకు నెయ్యిసరఫరా చేయడం అప్పగించారనేది 2024లోనే గుప్పుమంది. సుమారు 70 లక్షలకిలోల కల్తీ నెయ్యి టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300 కోట్ల రూపా యలుపైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ఇప్పటికే సిబిఐ సిట్, ఏకసభ్య కమిటీలు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించాయి. ఇప్పుడు కల్తీనెయ్యి వినియోగం, సరఫరాలో గత మాజీ ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి పాత్ర ఉందనేది ఏకసభ్యకమిటీ నిగ్గుతేల్చింది.

04-06pg2exHMNWJQE.qxd:04-06pg2exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1





బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన ఓఎన్‌జిసి చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్

## సిఎం చంద్రబాబుతో ఓఎన్‌జిసి చైర్మన్ భేటీ

**విజయవాడ, జూన్3, ప్రభాతవార్త ప్రతినిధి:** ఓఎన్‌జీసి చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చిన ఆయన రాష్ట్రంలో ఓఎన్‌జిసి చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా గోదావరి డెల్టా బేసిన్‌లో సహజవాయువు, చమురు అన్వేషణ, పెట్రోకెమికల్ పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇంధన రంగం అభివృద్ధికి ఓఎన్‌జిసి చేస్తున్న కృషిని, తదుపరి విస్తరణ ప్రణాళికల గురించి అరుణ్ కుమార్ సింగ్ సిఎంకు వివరించారు. ఓఎన్‌జీసి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి సమకూరే ఆదాయం, ఉపాధి అవకాశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై సిఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జిసి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని, తద్వారా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఇంధన భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ఓఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులను ఆయా గ్రామాల్లో ఖర్చు పెట్టాలని సిఎం సూచించారు. చమురు సహజవాయువు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జిసి చైర్మన్ కాకినాడ, గుంటూరులో కేన్సర్ చికిత్సల్లో వినియోగించే అధునాతన యంత్రాలను అన్నిరకాలుగా సమకూరుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పెట్టుబడుల మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఓఎన్‌జీసి అధికారుల బృందం హాజరయ్యారు.

## టెట్ తప్పనిసరి

>> మైన అవసరాన్ని పూర్తి చేయడానికి సహేతుకమైన అవకాశాన్ని కల్పించేందుకు, వరుస పరీక్షల మధ్య సుమారు ఆరు నెలల వ్యవధి ఉండేలా, ప్రాధాన్యంగా సంవత్సరానికి రెండుసార్లు టెట్‌ని క్రమానుగతంగా నిర్వహించాలని రాష్ట్రాలు, సంబంధిత అధికారులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. 'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, 2025 ఎస్సీసి ఆన్‌లైన్ ఎస్సీ 1912' కేసులో ఇచ్చిన తీర్పులోని ఒక భాగాన్ని సమీక్షించాలని కోరుతూ వివిధ రాష్ట్రాలు, ఉపాధ్యాయ సంఘాలు, సంస్థలు, వ్యక్తిగత ఉపాధ్యాయులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టి ఈ మేరకు తీర్పునిచ్చింది. సమీక్ష పిటిషన్ల బ్యాచ్‌లో, పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (ఆర్‌టిఇ చట్టం)కు ముందు నియమితులై, 5 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు మిగిలి ఉన్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు, 1 సెప్టెంబర్ 2025 నుండి 2 సంవత్సరాల లోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటి)లో అర్హత సాధించాలని, అలా చేయని పక్షంలో వారు సర్వీసులో కొనసాగడానికి అనర్హులవుతారని నిర్దేశిస్తూ దాఖలైన పిటిషన్లపై, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం, 'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్' కేసులో ఇచ్చిన తమ తీర్పులోని సరైనతను పునరుద్ఘాటించింది. ఆర్‌టిఇ చట్టంలోని సెక్షన్ 23 ఎల్లప్పుడూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను నిర్దేశిత అర్హతలను పొందడాన్ని ఉద్దేశించిందని, ఆర్టికల్ 21ఎ కింద న్యాయమైన విద్యకు రాజ్యాంగం కల్పించిన హామీలో భాగంగా టిఇటి ఒక తప్పనిసరి అర్హత అవసరం అని పేర్కొంది. "గతానికి వర్తింప జేయడం, ఎన్‌సిటిఇ చట్టంలో వైరుధ్యం, సేవా నిబంధనలలో అనుమతిలేని మార్పులు వంటి ఆరోపణలతో సహా సమీక్షలో పేర్కొన్న అన్ని కారణాలను కోర్టు తిరస్కరించింది. అయితే, ఆర్టికల్ 142 కింద ఆచరణాత్మక విధానాన్ని అవలంబిస్తూ, టిఇటి అర్హతను పొందేందుకు పాటించాల్సిన గడువును 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాలకు పొడిగించి, 31 ఆగస్టు 2028కి తుది గడువుగా నిర్ణయించింది.

## సిఐ చిన్నమల్లయ్యను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు

**విజయవాడ,జూన్3, ప్రభాతవార్తప్రతినిధి:** పల్నాడు జిల్లా సిఐ చిన్నమల్లయ్యను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. సిఐ చిన్నమల్లయ్యను శాశ్వతంగాతొలగిస్తూ డిజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నమల్లయ్య అత్యాచారం చేశాడని వినుకొండలో మహిళ ఫిర్యాదుతో సిఐ చిన్నమల్లయ్యపై అత్యాచారం కేసు నమోదు కావడం గమనార్హం. కేసునమోదు తర్వాత సిఐ చిన్నమల్లయ్య అజ్ఞాతం లోకి వెళ్లారు. అత్యాచారం కేసులో సిఐ చిన్నమల్లయ్యకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. దాంతో చిన్నమల్లయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## ప్రణయ్ ప్రకాశ్‌ను ఎసిబి కోర్టులో హాజరుపరిచిన సిట్

**విజయవాడ, జూన్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో ప్రణయ్ ప్రకాశ్‌ను సిట్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ ముగియ దంతో ప్రణయ్ ప్రకాశ్‌ను అధికారులు కోర్టులో హాజరుపరిచారు. మద్యం కుంభకోణం కేసులో ఏ52 నిందితుడిగా ప్రణయ్ ప్రకాశ్ ఉన్నారు. ఈ నెల 17వ తేదీకి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు ప్రణయ్ ప్రకాశ్‌ను గుంటూరు జైలుకు అధికారులు తరలించారు.

## టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్టు: మంత్రి నిమ్మల

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు ను టూరిజం హబ్ గా రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అందుకు తగ్గట్టే లేఅవుట్ ప్లాన్ డిజైన్ తయారు చేస్తున్నట్లు 9,900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే కూడా పూర్తి చేశామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్టును ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రికి జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

# ఆరోగ్యాంధ్ర కోసం 'యోగాంధ్ర'

>> ఓ వీడియో, పోస్టర్లను సిఎం విడుదల చేశారు

**'తెలంగాణలో కొందరు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు'**

తెలంగాణలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యక్రమం అడ్డుకోవడం సరికాదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి ప్రజల్లో చైతన్యం తీసుకురావటం తప్ప మరోమార్గం లేదన్నారు. ప్రజలకు మంచి చేయటంలో పోటీ పడాలి తప్ప ప్రజల మధ్య విభేదాలు తేవటం సరికాదని హితవు పలికారు. విభజన జరిగి 12 ఏళ్ల సమయం గడిచిపోయిందన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారన్నది అందరికీ తెలుసునని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ అభివృద్ధిని లాజికల్‌గా తీసుకెళ్లాలన్నారు. అనవసరంగా వివాదాలు సృష్టించటం ఎవరికీ మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. తానూ ఇటీవల తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారం చేసొచ్చానని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయాం. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టలేరు.ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. తెలంగాణలోని కొందరు నాయకులు అనవసర అంశాలు మాట్లాడుతున్నారు.నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసి వచ్చాను.తమిళనాడుకు కర్నాటకతో పాటు ఆలిండియా నేతలతో పాటు అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డికె శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పాటు బిఆర్ఎస్ ఉంది. బిఆర్ఎస్ నేషనల్ పార్టీ అని ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెట్టారు. విస్తరిస్తాం అన్నారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది కరెక్ట్ కాదు. అమెరికాలో, ఆస్ట్రేలియాలో, యూకేలో తెలుగువాళ్లు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు.ప్రపంచంలో అన్ని దేశాల్లో మన వాళ్లు పదవులు చేపడుతున్నారు. అక్కడ ఉండే రాజ్యాంగం ప్రకారం పని చేస్తున్నారు.ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో... వాళ్లు ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతున్నారు. అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. గొడ్డలి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలు బహిష్కరించాలి.అసత్యాన్ని పదేపదే చెబితే ప్రజలు విశ్వసిస్తారని కొందరు అనుకుంటున్నారు.డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నియామకానికి టీడీపీ ఓ బ్రాండ్.ఎన్నికల్లో ప్రకటించి అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేసి అత్యంత కట్టుదిట్టంగా నియామకాలు చేపట్టాం.స్పోర్ట్ కోటాలో అక్రమాలు అంటున్నారు. కానీ వారికి క్రీడల్లో ఏమేమి ఉన్నాయో కూడా తెలీకుండా మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి చేసిన కేటగిరీల ఆధారంగా ఈ ఉద్యోగాలు వచ్చాయి. వాళ్ల పేటిఎం బ్యాచ్‌ల ద్వారా లేని పోని దుష్ప్రచారం చేస్తున్నారు అని చంద్రబాబు విమర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, యోగా నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణగారు, అధికారులు పాల్గొన్నారు.

**ఒక అసత్యాన్ని పదేపదే చెబితే నమ్మేస్తారని అనుకుంటున్నారు**

ఒక అసత్యాన్ని పదేపదే చెబితే నమ్మేస్తారని అనుకుంటున్నారని సిఎం చంద్రబాబు అన్నారు. మెగా డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించామన్నారు. నోరు ఉందని, ఉందని, ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. క్రీడలు, వాటి సంఘాల గురించి తెలియకుండానే మాట్లాడుతున్నారన్నారు. గాలికబుర్లు, బురద చల్లితే ఎవరూ నమ్మరన్నారు. రవిశంకర్, దాజీ పిల్లలకు కొన్ని కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. వెయ్యి రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్ట్ తెస్తున్నామని పేర్కొన్నారు.

# ఎఐ ఇంజనీర్ల వేదిక ఎపి

>> ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన స్కూల్ కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి,రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయిరూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు.మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

**ప్రముఖ రష్యన్ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్‌తో లోకేష్ సమావేశం**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ కాకినాడ పిసిపిఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్తుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఎపిలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పివిల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.

## ప్రత్యేక విద్యుత్ బస్సులు

>> సిద్ధమవుతోంది. పర్యావరణాన్ని రక్షించేందుకు ఏకంగా 5,500 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ తీసుకురానుండగా.. 500 సిఎన్‌జీ బస్సులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దశలవారీగా ఈ బస్సులు రోడ్డెక్కనున్నాయి. 750 బస్సుల్లో 300 బస్సులు జులై నుంచి పరుగులు పెట్టనున్నాయి.2027 మార్చి నాటికి..450 బస్సులు ఆగస్టులో రోడ్లపైకి రానున్నాయి. తిరుపతి, కర్నూలు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, అమరావతి, గుంటూరు, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి నగరాల్లో ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు సర్వీసులు అందించనున్నాయి. కాలం చెల్లిన పల్లెవెలుగు, సిటీబస్సులు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం 1450 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకోవాలని ప్లాన్ చేసింది. జులై నాటికి వీటికి టెండర్లను ఆహ్వానించనున్నారు. అనంతరం 2027 మార్చి నాటికి వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నారు. పూర్వోదయ అనే పథకం కింద కేంద్రం రాష్ట్రాలకు విద్యుత్ బస్సులను కేటాయిస్తోంది. అందులో భాగంగా ఏపీకి వెయ్యి బస్సులను కేటాయించింది. ఇక పిఎం ఈ డ్రైవ్ పథకం కింద మరో 2 వేల బస్సుల మంజూరు కోసం కేంద్రానికి ఎపిఎస్‌ఆర్టీసీ ప్రతిపాదనలు పంపింది. అలాగే 500 సిఎన్‌జి బస్సులు కూడా తీసుకోవాలని చూస్తోంది. సిఎన్‌జి ఎక్కువగా అందుబాటులో ఉండే నగరాల్లో వీటిని నడపనుంది. ప్రస్తుతం ఉన్న రంగులతోనే ఈ బస్సులు ఉండనున్నాయి. దీంతో ప్రయాణికులకు గందరగోళానికి గురి కాకుండా ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. ఇక సిఎన్‌జి బస్సుల కోసం సిఎన్‌జి కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది.

## 5, 8 తేదీల్లో సిఎం విశాఖ పర్యటన

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ నెల 5, 8 తేదీల్లో విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. 5న సముద్ర ఆహార ఎగుమతులపై నేషనల్ కాన్ఫరెన్స్ కేంద్ర మంత్రులతో కలిసి పాల్గొననున్న సిఎం చంద్రబాబు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై సమీక్ష చేయనున్న సిఎం. ఈ నెల 8న ఎపిఐసి టెక్నాలజీస్ సెమీ కండక్టర్ యూనిట్‌కు భూమిపూజ చేస్తారు.

## భారత్‌పై 12.5% అదనపు సుంకాలు

>> 301 కింద నిర్వహించిన 60 సుదీర్ఘ దర్యాప్తుల ఫలితాలను యూఎస్‌టిఆర్ విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 54 ఆర్థిక వ్యవస్థలలో బలవంతపు శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను సమర్థవంతంగా నిషేధించడానికి లేదా నిరోధించడానికి తగినంత కఠినమైన చర్యలు లేవని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ 54 దేశాల జాబితాలోనే భారతదేశాన్ని కూడా చేర్చడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జామీసన్ గ్రీం ఈ విషయమై మాట్లాడుతూ మా అత్యంత ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములు బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడం అంగీకరించలేనిది. దీనివల్ల అమెరికా కార్మికులు ప్రపంచవ్యాప్తంగా అసమానమైన, అన్యాయమైన వాతావరణంలో పోటీ పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూఎస్‌టిఆర్ నోటిఫికేషన్ ప్రకారం బలవంతపు శ్రమకు సంబంధించిన దిగుమ తులపై ఇప్పటికే పాక్షిక ఆంక్షలు విధించిన లేదా పరస్పర వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆ నిబంధనలను అమలు చేయడానికి అంగీకరించిన దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్ పడుతుంది. ఈ ప్రమాణాలను అస్సలు పాటించని భారతదేశం, చైనా, జపాన్, సౌత్ కొరియా, బ్రెజిల్ వంటి దేశాల దిగుమతులపై గరిష్టంగా 12.5 శాతం అదనపు సుంకం విధించనున్నారు.

## వారం - వర్జ్యం

04-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
చవితి రా. 11.29
ఉత్తరాషాఢ రా. 3.41
వర్జ్యం : ఉ.9.53-ఉ.11.40
దు.ఉ.9.54-ఉ.10.46,
2) మ.3.08-4.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సంతానము మీ అభిప్రాయములతో ఏకీభవించక పోవచ్చు. రహస్య పెట్టుబడి పెట్టిన వ్యవహారాలు చిక్కుల్లో పడతాయి.

**వృషభం:** ఏ కార్యక్రమమును చేపట్టినా ఆలోచించి, నిర్ణయములను తీసుకొనుట మంచిది. ఆర్థిక సంస్థలనుండి ఋణాలు తీసుకుంటారు.

**మిథునం:** గృహ నిర్మాణాలు వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు సాగిస్తారు. ఆర్థిక భారం పెరుగుతుంది.ఆస్తి వివాదాలు.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు తగిన సమయం. వస్త్రలాభం కలదు.

**సింహం:**కోర్టు వివాదాలు పరిష్కారమవుతాయి. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ఆటంకాలు తొలగుతాయి.

**కన్య :**ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరముగా వుండండి.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** ఇతరులకు సైతం మీరు సహాయం అందిస్తారు. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. వస్త్రలాభం కలదు.

**మకరం:**ఆర్థికపరమైన లావాదేవీలలో ఆటుపోట్లు తొలగుతాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.బంధువులను కలుస్తారు.

**కుంభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**మీనం:** విదేశీ పర్యటనల అవకాశాలు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకోండి. పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం ధర్మశాలలోని నివాసంలో దలైలామాకు గ్రామీ అవార్డును అమ్జద్ అలీ ఖాన్ ప్రదానం చేస్తున్న దృశ్యం

# ఘోర అగ్నిప్రమాదం

>> ఉన్నది. కానీ ఆ స్టే ఇన్‌లో 24 రూమ్‌లకు బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. లైసెన్సు జారీ అంశంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగాయా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనగా ఇది నమోదు అయ్యింది. బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఆరు రూమ్‌లకు ఢిల్లీ టూరిజం శాఖ పర్మిషన్ ఇచ్చింది. కానీ అక్రమంగా ఆ హోటల్ గదిలో 24 రూమ్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఆ హోటల్‌కు 24 రూమ్‌లు ఉన్నట్లు రిజర్వేషన్ చూపిస్తున్నది. అయిదు అంతస్తుల ఆ బిల్డింగ్ ప్రమాదంలో 40 మందిని రక్షించారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించి ఉంటాయని తొలుత అనుమానించారు. కానీ బీ అండ్ బీ ఈటరీ బిల్డింగ్ నుంచే మంటలు వ్యాప్తి చెందినట్లు అంచనాకు వచ్చారు. 21 మంది మృతుల్లో పది మంది విదేశీయులు ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో ఎక్కువ శాతం మంది సెంట్రల్ ఏషియా, ఆఫ్రికా దేశస్థులు ఉన్నారు. గాయపడ్డ వారి సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బిల్డింగ్‌లో ఓ బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, అయిదు అంతస్తులు ఉన్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ చెబుతోంది. ఉదయం 9.30 నిమిషాల సమయంలో బిల్డింగ్‌లో మంటలు, పొగ అలుముకున్నట్లు తెలిసింది. బీ అండ్ బీలో స్టే చేస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారే ఎక్కువగా బీ అండ్ బీలో బస చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి మోకాలి మార్పిడి గురించి అయిదు రోజుల క్రితం ఓ ఫ్యామిలీ ఆ హోటల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తున్నారు. బిల్డింగ్‌లో ఎటువంటి వెంటిలేషన్ లేదని, కిటికీలు లేవని, బాత్రూమ్‌ల్లో కూడా కిటికీలు లేవని ఓ వ్యక్తి ఆరోపించాడు. ఆ బిల్డింగ్‌కు ఒకే ఎగ్జిట్ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మికాసా ఇన్‌కు చెందిన రెస్టారెంట్‌లో మొదలైన మంటలు ఆ తర్వాత పైకి వ్యాపించాయి. ఆ బిల్డింగ్ అయిదు అంతస్తులు ఉన్నది. మంటలు, పొగ దట్టంగా కమ్ముకున్న సమయంలో ఓ మహిళ ఆ హోటల్ పైనుంచి కిందకు దూకింది. ఆ బిల్డింగ్ నుంచి ఇద్దరు మహిళలు దూకినట్లు తెలుస్తోంది. ఆ మహిళలను స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. బిల్డింగ్ వద్ద మాట్రిసెస్ ఏర్పాటు చేశారు. ఆ పరుపు బెడ్‌లపై ఓ మహిళ దూకిన విజువల్స్ చిక్కాయి. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది.

# ఇంకా ప్రాంతీయ విద్వేషాలా?

>> బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. కులదూషణలకు స్వస్తి చెప్పాలని సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారి తీసిందన్నారు. వైఎస్సార్సీ వచ్చాక రాజకీయాల్లో కులదూషణలు మరింత పెరిగాయని గుర్తుచేశారు. ఎవరైనా తప్పుచేస్తే ఆ వ్యక్తిని నిందించాలి తప్ప అతడి కులాన్ని కాదని పవన్ హితవు పలికారు. సమాజంలో ఏదైనా తప్పు జరిగితే, అది చేసిన వ్యక్తిని మాత్రమే దోషిగాభావించాలి. అతని కులానికి, ప్రాంతానికి ఆపాదించకూడదు. రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కుల దూషణలు, విద్వేషాలు బాగా ఎక్కువయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ సమయంలో ఇవి తారస్థాయికి చేరుకున్నాయి. ఒక వ్యక్తి చేసే తప్పునుగానీ, నేరాన్నిగానీ మొత్తం కులానికి ఆపాదించి, అందరి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం అధికం అయింది. దీనివల్ల ప్రజలు మధ్య విద్వేషాలు, వైషమ్యాలు ఎక్కువ అవుతున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే సమాజం విచ్ఛిన్నం ఖాయం. దీనికి ఎక్కడో దగ్గర చెక్ పెట్టాలనే ఉన్నతమైన ఆలోచనతో జనసేన పార్టీ సేనా గళం పేరుతో అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులతో ఓ ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సేవాగళం కులాలకు, ప్రాంతాలకి అతీతంగా ఎవరు తప్పు చేసినా ఎత్తి చూపుతుందన్నారు.

**గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టం, కెటిఆర్ నాకు మిత్రుడు**

గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టమని పవన్ కల్యాణ్ అన్నారు. పాలసీలపై కెటిఆర్ మాట్లాడి ఉండవచ్చు, ఆయన నాకు మిత్రుడని పవన్ వివరించారు. విభజన రాజకీయాలకు స్వస్తి పలకాలి, ఎవరికీ మంచిది కాదన్నారు. కెటిఆర్, నేను అనేక విషయాలు మాట్లాడుకుంటాం, విభేదాలు ఏమీ లేవని పవన్ తేల్చిచెప్పారు. తెలంగాణా,ఆంధ్ర పౌర సంబంధాలు భంగం కలిగించడం మంచిది కాదన్నారు.

**మూడు రాజధానులు అయిపోయాయి... ఇప్పుడు మూడు జిల్లాల రాజధానా!**

అమరావతి ఉద్యమ సమయంలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేలా ఒక భావన కలపాలనే ఉద్దేశంతోనే జై ఆంధ్ర నినాదం ఇవ్వాలని కోరాను. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అంటూ పాలన సాగించింది. ఇప్పుడు అధికారంపోయాక మూడుజిల్లాలను కలుపుతూ ఏదో పేరుతో రాజధాని అంటున్నారు. 2014లో అమరావతి అనే రాజధాని నిర్ణయం తీసుకున్నారు. దానికి కట్టుబడి ముందుకు వెళ్లాలి. ప్రతిసారీ ఇష్టానుసారం రాజధాని మార్చుకునేలా మాట్లాడటం సరికాదు. ఇక్కడ రైతులు 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారు. ఇక్కడ రాజధాని అభివృద్ధి చేయాలి. ప్రతిసారీ అమరావతి విషయంలో వైసీపీ ద్వంద్వ విధానాలతో ప్రజల్లోనూ, పారిశ్రామికవేత్తల్లోనూ కావాలనే అయోమయం నెలకొల్పుతోంది. జనసేన నూతనంగా ఏర్పాటు చేస్తున్న సేనా గళం అందరినీ కలపాలనే బృహత్తర ఆశయంతో ముందుకు సాగుతుంది' అన్నారు.

# లేగదూడలపై పులి పంజా

>> క్షి త ప్రాంతంలో వదలటంతో అడవి నుండి బయటకు వస్తున్న పులి సమీపంలో ఉన్న గిరిజన గ్రామాల్లో పశువులపై దాడి చేసి హతమారుస్తుంది.పులి దాడులతో పశువులతో పాటు తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆకలేసి నప్పుడు మాత్రమే ఆవులను చంపి తినేది. కేవలము రెండు మూడు రోజులకు మాత్రమే ఒక పశువును చంపేది. నాలుగు నెలల పాటు ఇదే పందాను అనుసరించిన పెద్దపులి తన పందా మార్చింది. గత నెల రోజులుగా పశువులపై దాడి చేసి మూకుమ్మడిగా చంపి వేస్తోంది. తమ పశు సంపదను పెద్దపులి చంపి వేస్తుంటే అటవీ శాఖ అధికారులు కంటి తుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల విలువ వేలరూపాయలు ఉంటే కేవలం కొద్ది మాత్రమే పరిహారము చెల్లిస్తు న్నారని ఆదివాసులు ఆరోపిస్తున్నారు. గతంలోనే పెద్దపులి మేడకు అటవీ అధికారులు జి పి ఎస్ ట్రాకర్‌అమర్చారు. దీంతో ఎంత దట్టమైన అడవిలో ఉన్నప్పటికీ పులి కదలికలు అధికారులకు సులువుగా తెలిసిపోతున్నాయి.

పులిని బంధించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సైతం రంగంలోకి దింపామని అటవీ అధికారులు రోజు చెప్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి అటవీ అధికారులు పులి వెనుకే ప్రయాణం సాగిస్తున్నారు. పులి ఉనికిని చెబుతూ ప్రజలను అప్రమత్తం చేయటం మినహా గత నాలుగు నెలలుగా చేసింది ఏమీ లేదని ఆదివాసీలు పెదవి విరుస్తున్నారు. మైదాన ప్రాంతంలో స్వల్ప కాలంలోనే పులిని బంధించగలిగిన అటవీ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పులిని బంధించడంలో ఎందుకు విఫలమవుతున్నారు అనేది వేలడాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. పులిని బంధించేందుకు ఈ నాలుగు నెలల కాలంలో ప్రభుత్వానికి కొన్ని లక్షల రూపాయల ఖర్చయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లభించలేదు. పులి వైఖరిలో వచ్చిన మార్పుతో రాబోయే రోజుల్లో మనుషులపై దాడి చేస్తే పరిస్థితి ఏంటా?అని ఇక్కడ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. త్వరలోనే పులి మనుషులపై దాడి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం పులిని సురక్షి తంగా వెంటనే బందించమని అటవీ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 14న ఈ పులిని మైదాన ప్రాంతంలో నుండి తీసుకువచ్చి పాపికొండల సమీపంలో వదిలిపెట్టారు. అప్పటినుండి ఈబెంగాల్ టైగర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అటు మైదాన ప్రాంతం ఇటు ఏజెన్సీ ప్రాంతాన్ని కలియ తిరుగుతూ షికారు చేస్తోంది. పులి దాడులలో పశుసంపదను కోల్పోతున్న రైతులు ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఎంతోకొంత పరిహారం చెల్లించి చేతులు దులుపుకొని ముందుకు సాగిపోవడం తప్ప అటవీ అధికారులు చేసిందేమీ కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.బుధవారం గంగావరం గ్రామాన్ని సందర్శించిన అటవీశాఖ అధికారులు పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, మత్తుమందు ప్రయోగానికి అనువైన అవకాశాన్ని గుర్తించేందుకు 6 ర్యాపిడ్ రెస్క్యూ టీమ్‌లు,5 ప్రజా అవగాహన బృందాలు, 4 ట్రాంక్విలైజింగ్‌బృందాలు, 2 డ్రోన్ బృందాలు, 1 కేజ్ బృందం, 1 వన్యప్రాణి అంబులెన్స్ బృందం మరియు ఫ్రంట్‌లైన్ సిబ్బందితో కూడిన 19 హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేస్తు న్నాయని,అన్ని బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తున్నాయని, పులిని త్వరితగతిన బంధించేందుకు అటవీ శాఖ 200 మందికి పైగా అధికారులు, సిబ్బందిని మోహరించి యుద్ధప్రాతిపదికన చర్యలు చెపట్టింది.

4-6Pg3exHMNWJQEP.qxd:4-6Pg3exHMNWJQEP.qxd 1/1/02 7:01 AM Page 1



# ఎపి ప్రకృతి సాగుకు ఫుడ్ ప్లానెట్ ప్రైజ్

**• అవార్డు లభించడం రాష్ట్రానికి గర్వకారణం: మంత్రి అచ్చెన్నాయుడు**

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026" పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఎపిసిఎన్ఎఫ్)కు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026 రాష్ట్రానికి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.



ప్రతిష్ఠాత్మక ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026 పురస్కారం అందుకుంటున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వహణ అధికారి తల్లం విజయ్ కుమార్

రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల సేవలు అభినందనీయమని తెలిపారు. కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎపిసిఎన్ఎఫ్ నిరూపించిందని తెలిపారు.

# హెల్త్ టూరిజం హబ్‌గా ఎపి

**• ఇంటి దగ్గరకే వైద్య సేవలు అందించేలా 'సంజీవని' • కార్పోరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణకు ప్రత్యేక సెల్ • లలితా పివిఎస్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు**

**గుంటూరు, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** హెల్తీ సిటిజన్స్ వెల్తీ నేషన్ నిర్మించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని సిఎం తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరులోని లలితా పివిఎస్ హాస్పిటల్‌ను ప్రారంభించి, పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలితా ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన ఆస్తి ఉండదని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులని అన్నారు. వేల కోట్ల రూపాయలున్నా, భవంతులు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదని తెలిపారు. ప్రభుత్వం త్వరలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుందని ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టును చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నామని అన్నారు అత్యుత్తమ వైద్య విధానాలను ప్రజల ఇళ్ల దగ్గరకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని పని చేస్తుందని అన్నారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నామని.. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తామని తెలిపారు. త్వరలో యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నామని.. ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



### అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందిస్తాం

ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు అందించినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు సరైన ఆహార నియమాలు పాటించాలని, అప్పుడే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని సిఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ మెడిసిన్, కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నాడు హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశామని ఏపీని అదేస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. బెస్ట్ హాస్పటల్స్ ను రాష్ట్రానికి రప్పిస్తున్నామని, టెక్నాలజీతో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. హైదరాబాద్ తరహాలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు మెరుగైన చికిత్స కోసం అమరావతికి వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని అన్నారు. లలితా హాస్పటల్స్ ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన యజమాన్యాన్ని అభినందిస్తున్నానని అన్నారు. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్ ఉందని గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనమని, ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి. అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ ఏర్పడుతుందని అన్నారు. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

### పేదల ఆరోగ్యం విషయంలో రాజీ లేదు

లలిత హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవా నిరతితో, మానవతాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. హృదయ సంబంధిత వ్యాధులతో ఏటా 32 శాతం మంది మరణిస్తున్న నేపథ్యంలో, ఆయా వ్యాధులను గుర్తించే ఖరీదైన ఆధునిక పరికరాలను లలిత హాస్పిటల్స్ లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో వినూత్న విధానాలతో పేద ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ఆహారపు అలవాట్లు మార్చేందుకు, ఒత్తిడి లేని ఆధునిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. సంజీవిని పథకం ద్వారా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజలకు ఉచితంగా నిర్వహిస్తున్నా మన్నారు. రోజు రోజుకి క్యాన్సర్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా క్యాన్సర్ పరీక్షలను సైతం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గుండెజబ్బులతో బాధపడే రోగులకు 45 వేల రూపాయలు ఖరీదు చేసే ఇంజక్షన్ ను ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల మందికి పైగా ఉచితంగా అందించామన్నారు.

# ఇకపై 150ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలు

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ తీసుకున్న సరికొత్త నిర్ణయం ఇప్పుడు మద్యం ప్రియుల మధ్య హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో ఇకపై సరికొత్త పరిమాణాల్లో 150ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం కాకుండా, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త సైజుల్లో మద్యం సీసాలను తయారు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ పలు ప్రముఖ లిక్కర్ తయారీ కంపెనీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కంపెనీల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించిన ఎక్సైజ్ శాఖ, పాత నిబంధనలను సవరిస్తూ తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన ఉత్తర్వులలో భాగంగా, కొత్త పరిమాణాల్లో వచ్చే మద్యం బాటిళ్లకు సంబంధించి ఒక కేసులో (బాక్స్) కచ్చితంగా ఎన్ని సీసాలు ఉండాలి అనే ప్యాకింగ్ నిబంధనలను కూడా ఎక్సైజ్ శాఖ స్పష్టంగా ఖరారు చేసింది. అయితే, కొత్త సైజుల్లో మద్యం వస్తున్నప్పటికీ ధరల విషయంలో ఎలాంటి అదనపు మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో అమల్లో ఉన్న ధరల విధానమే ఈ కొత్త పరిమాణంలోని సీసాలకు కూడా వర్తించనుంది. కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 90 ఎంఎల్ 180 ఎంఎల్ 375 ఎంఎల్ 750ఎంఎల్ లీటర్ బాటిల్స్ విక్రయాలు సాగుతున్నాయి. వీటికి తోడుగా త్వరలోనే ఈ జాబితాలోకి 150 ఎంఎల్, ఎంఎల్ 200 ఎంఎల్ సీసాలు కూడా అధికారికంగా చేరనున్నాయి.



## సాగర్ కాలువల పనులకు రూ.42.19 కోట్లు

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం నాగార్జున సాగర్ కాలువల పరిధిలో 2026-27 సంవత్సరానికి చేపట్టనున్న 578 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు రూ.42.19 కోట్లు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులతో సాగర్ కాలువల పరిధిలో కాలువల బలోపేతం, డీసిల్టింగ్, నీటి నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, గేట్లు, షట్టర్ల మరమ్మతులు, బ్యాంకుల పటిష్టీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా సాగర్ కాలువల ద్వారా సాగునీటి సరఫరా మరింత సమర్థవంతంగా జరిగి రైతులకు ప్రయోజనం కలగనుంది.

## హాస్టళ్లను, గురుకులాలను సిద్ధం చేయండి

**రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం**



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** నూతన విద్యా సంవత్సరం వచ్చే నెల 12 నుంచి పారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లను, గురుకులాల భవనాలను సిద్ధం చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదని స్పష్టంచేశారు. హాస్టళ్లు, తరగతి, విశ్రాంతి గదులను పరిశుభ్రం చేయాలని, పరిశుద్ధమైన నీరందించేలా చూడాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్లు, కిటికీలు, ద్వారాలకు దోమ తెరల ఏర్పాటు గురించి ఆరా తీశారు. బీసీ బిడ్డలు విద్యకు దూరంగా కాకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య, ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు అందజేయడంతో పాటు సకాలంలో డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి కల్పనకు ప్రాధాన్యమివ్వడం వల్ల గతంలో ఎన్నడూ లేనంతగా టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. బీసీ హాస్టళ్లలోనూ అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదన్నారు. ఈ నెల అయిదో తేదీన గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆ కాన్ఫరెన్స్ లో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సవిత సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.


## తిరుమల సమాచారం



### సూర్యప్రభపై సారంగపాణిగా కల్యాణ వేంకటేశ్వరుడు

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం స్వామి సారంగపాణి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. సూర్యకిరణాల తేజస్సును తలపించే ఈ వాహనసేవలో స్వామివారి అపూర్వ రాజసం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. కర్పూరహారతులతో మార్మోగిన నారాయణవనం స్వామివారి విహార మార్గమంతా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### త్వరలో తిరుమలకు మరిన్ని ఇవి బస్సులు



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలను పూర్తిస్థాయిలో పర్యావరణ హితంగా మార్చేందుకు, కాలుష్యనియంత్రణలో భాగంగా విద్యుత్‌తో నడిచే బస్సులను తీసుకువచ్చేందుకు ఆర్టీసి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ప్రభుత్వం కూడా తిరుమల ఘాట్‌లో పూర్తిగా విద్యుత్ బస్సులనే నడపాలని కూడా సూచించింది. ప్రస్తుతం 50 విద్యుత్ బస్సులు తిరుమల- తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య నడుస్తున్నాయి. ఈ బస్సుల వల్ల నిర్వహణ వ్యయం కూడా బాగా తగ్గడమేగాక ఘాట్‌లో పూర్తిగా కాలుష్యరహితంగా దోహదపడుతోంది. ఇప్పుడు త్వరలోనే ప్రధానమంత్రి ఇ బస్ సేవ పథకం క్రింద రాష్ట్రానికి విద్యుత్ బస్సులు రానున్నాయి. జులైలో అందుబాటులోకి సరికొత్త పర్యావరణ అనుకూల బస్సులు రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఈబస్ సేవ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 750 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా 300 బస్సులు ఈ ఏడాది జులై నెలలోనే రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో మరో 50 బస్సులు తిరుమలకు రానున్నాయనేది సమాచారం. దీనివల్ల పూర్తిగా ఘాట్‌లో పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు చాలావరకు నియంత్రించవచ్చునేది టిటిడి, రవాణా, ఆర్టీసి, పోలీస్ వర్గాలు ఆలోచన. పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులు రానున్న బ్రహ్మోత్సవాలకు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. తిరుమల ఘాట్ రోడ్డులో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 300 ప్రత్యేక ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందనేది ఆర్టీసి వర్గాల సమాచారం.

# లడ్డూల విక్రయాలు మేలో రికార్డు

**• రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూల తయారీ**

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం తరువాత భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టిటిడి లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో మొత్తం 1,21,35,528 లడ్డూలు విక్రయాలు జరిగాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 మే నెలలో 1.01 కోట్ల లడ్డూలు విక్రయమవ్వగా, 2025లో 1.10 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం 2026లో 1.21 కోట్లకు పైగా విక్రయాలు నమోదవడం విశేషం. శ్రీవారి ప్రసాదాల తయారీలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న టిటిడి రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 లక్షల నుండి 4.5 లక్షల వరకు లడ్డూలు తయారవుతుండగా, ప్రత్యేక సందర్భాల్లో ఉత్పత్తిని మరింత పెంచుతోంది.

**24 గంటలూ నిరంతరాయంగా సేవలు:** శ్రీవారి పోటులో రెండు షిఫ్టుల్లో సుమారు 700 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణులు భక్తి శ్రద్ధలతో 24 గంటలూ సేవలందిస్తూ లడ్డూ ప్రసాదాల తయారీలో పాల్గొంటున్నారు. తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో 56 కౌంటర్ల ద్వారా మూడు షిఫ్టుల్లో 24 గంటలూ లడ్డూల విక్రయం, పంపిణీ జరుగుతోంది. అదనపు లడ్డూల కొనుగోలు కోసం డిజిటల్ చెల్లింపులతో పనిచేసే కియోస్క్ యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. దర్శనం పొందిన ప్రతి భక్తునికి ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తున్నారు. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# క్యూకాంప్లెక్స్‌లో బాత్‌రూమ్‌ల కంపు

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** "కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందట" అనే చందంగా తిరుమల క్షేత్రంలో పారిశుద్ధ్యం నిర్వహణ రోజురోజుకూ అధ్వాన్నంగా తయారవుతోందని భక్తులు ఆవేదన వెలిబుస్తున్నారు. కొండపై పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, రెట్టింపుగా పరిశుభ్రత చేస్తున్నామని ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తున్న టిటిడి అధికారులు నిర్వహణలో అందుకు భిన్నంగా అధ్వాన్నంగా మారినా పర్యవేక్షణ లేకపోవడంతో మరింత దిగజారిందని చెబుతున్నారు. తిరుమల అంతటా కేవలం రోడ్లపై చెత్తలేకుండా ఊడ్చటం వరకే పరిమితమైన కార్మికులు తిరుమలలోని ప్రధాన ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, వాష్‌రూమ్‌ల తీరు కంపుకొడుతోందని భక్తులు వాపోతున్నారు.

పరిశుభ్రతలో కొన్ని ఏజెన్సీల కార్మికులు ఏదో మొక్కుబడిగా శుభ్రం చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీనికి తార్కాణంగా బుధవారం వేకువజామున చిత్తూరుకు చెందిన కొందరు భక్తులు ఆన్‌లైన్ లక్కీడిప్‌లో సుప్రభాతసేవ టిక్కెట్ రావడంతో దర్శనానికి వెళ్లారు. సుమారు 2గంటల ప్రాంతంలో వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లో వెళ్ళిన తరువాత మూత్రవిసర్జనకు వెళ్ళారు. అక్కడ వాష్‌రూమ్‌లు కంపుకొడుతూ అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. తిరుమలలో తెల్లవారుజామున 1.30 గంటల నుండి పలు రకాల సేవా దర్శనాలకు భక్తులను వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ లో అనుమతిస్తారు. అయితే అప్పటికే బాత్‌రూమ్‌లు దుర్వాసనతోబాటు అపరిశుభ్రంగా ఉండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆలయం వెలుపల మీడియాకు తెలిపారు. వైకుంఠమ్ 1, 2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలోని కంపార్టుమెంట్లలో వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్ల అధ్వాన్నంగా నిర్వహణ మారిందనడానికి ఇదో నిదర్శనం. ఇక తిరుమలలో చాలావరకు పిఎసిలు, పలు చోట్ల మరుగుదోడ్లు, వాష్‌రూమ్‌ల నిర్వహణ కూడా అధ్వాన్నంగా మారింది.



ఈ పరిశుభ్రతపై పర్యవేక్షణ కొరవడటంతో కార్మికులు ఏదో మొక్కుబడిగా విధులు నిర్వహించి వెళ్ళిపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారీగా 80వేల మంది వరకు భక్తులకు దర్శనం చేయిస్తున్నారు. వేకువజామున 1.30గంటల నుండి ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల భక్తులు వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ నుండే ఆలయంలోనికి వెళ్ళడం పరిపాటి. అలాంటిది పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైనా పట్టించుకునే వారేలేకపోవడం మాత్రం విచారకరం. చెత్తతొలగింపే గాక ప్రధానంగా వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ అద్వాన్నంగా మారిందని ఇప్పటికే భక్తుల నుండి కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు పారిశుద్ధ్యం నిర్వహణలో ఆచరణలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లోనే గాక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు వంటి రద్దీరోజుల్లో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోనికి చేరుకున్న భక్తుల సౌకర్యాలు, కష్టాలు వినేనాధుడే లేకపోవడం మరీ విశేషం.

ఎంతమంది విఐపిలు వచ్చారు, వారందరికీ ఏమేరకు సంతోషకరంగా దర్శనాలు చేయించామని భావిస్తున్న అధికారులు కనీస సౌకర్యాలపై పర్యవేక్షణ లేకపోవడం ఇందుకు ప్రధాన వైఫల్యమేనని భక్తులు వాపోతున్నారు. ఏదేని సమస్యలున్నా చెబుదామనుకుంటే పట్టించుకునే వారే దొరకరు. ఇదీ గత కొంతకాలంగా తిరుమలలో సామాన్య భక్తులు ఎదుర్కొంటున్న వెంకన్న దర్శన కష్టాలు. పైకి మాత్రం అధికారులు అంతా బాగానే ఉందని ప్రకటనలు చేస్తున్నా ప్రత్యక్షంగా భక్తులు పడతున్న ఇబ్బందులు మాత్రం వర్ణనాతీతంగా మారాయి. తిరుమలలో వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు ఉన్నాయి. ఒక్కో కంపార్టుమెంట్ సామర్థ్యం 400మంది భక్తులు నిరీక్షిస్తుంటారు. సరాసరి రోజుకు సాధారణ రోజుల్లో 80వేల మంది నుండి 90వేల మంది వరకు భక్తులకు స్వామివారి దర్శనం చేయిస్తున్నారు. ఇంతమంది భక్తులు గంటల తరబడి నిరీక్షించే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలో పరిస్థితి అధ్వాన్నంగా మారడం అధికారుల పనితీరును వెక్కిరిస్తోంది. గంటల తరబడి వేచిఉండే భక్తులను కలసి సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా సీనియర్ అధికారులతో కమిటీ ఉన్నా విఐపిల సేవలో తరించడానికి సరిపోతోంది.

## అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహించాం

**సచివాలయం, జూన్ 3 ప్రభాతవార్త:** డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100పోస్టులతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించాలని తెలిపారు. 8సంవత్సరలా నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9నెలల తర్వాత రాద్దాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటివరకు దాదాపు 2లక్షల మంది ఉపాధ్యాయులగా సేవలు అందిస్తున్నారని హోంమంత్రి గుర్తుచేశారు. వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు. అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ నిర్వహించిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.



వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు, సంతోషం అనేది వరమూ కాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

న- ఆర్.జి ఇంగర్సాల్

# శాంతికి మార్గమేది?

నా కోడి కుంపటి లేకుంటే తెల్లవారదులే అనుకుంటుండేది వెనుకటికో ఓ ముసలవ్వ. ఇప్పుడు శ్వేతాధినేత ట్రంప్ కూడా అదే ధోరణిలో మాట్లాడుతున్నాడు. ఇజ్రాయెల్ మిత్రత్వ కారణంగా ఇరాన్‌తో పోరుకు తలబడిన ఆయన ఇప్పుడు తలగోక్కుంటున్నాడు. ఇజ్రాయెల్ ప్రధాని నెతనాహ్యును వదిలిపెట్టనూ లేడు,తాజా యుద్ధం మీద ఎలాంటి నిర్ణయం తేల్చనూ లేడు. అలా అని సమర్థించే పరిస్థితీ లేదూ. అయినా ఊబిలో పడ్డ దున్న మాదిరి పెనుగులాడుతున్నాడు. పరిస్థితుల్లో ట్రంప్ మరింత వాచాలత ప్రదర్శిస్తున్నారు. జరిగిందేదో జరిగిపోయిందిలే అని ఊరుకునే మనస్తత్వంలోనూ లేడాయన. ఇరాన్‌తో సంధి చేసుకుంటే తనకు అవమానమని భావిస్తూ ఎప్పటికప్పుడు వగచడం తప్ప ఏం చేయలేని పరిస్థితిఆయనది.. నిర్యుద్ధ ప్రకటన జరిగే చర్చలను ముందుకు సాగకుండా ఉండటంతో ట్రంప్‌కు నెతన్యాహు నుంచి ఒత్తిడిలుండటమేనని ఇరాన్ భావన. అందుకే ఇక చర్చల్లేవ్! చర్చించుకోటాల్లేవ్! అనే మాటలు యథాలాపంగా వినపడుతున్నాయి. ఇరాన్ ఎప్పుడూ ఒక మాట మీదనే ఉంది. కానీ ట్రంప్ మాత్రమే జరుగుతున్న భీకర యుద్ధానికి, కాల్పుల విరమణ అమలులో ఉన్నట్లేనని రెండు విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో ఏ విషయమూ తెలనివ్వడం లేదు. ఎవరిది చిత్తచాంచల్యమో, భ్రాంతో ఇప్పుడిప్పుడే తేల్చలేని పరిస్థితి ఉంది. ఒకపక్క తీవ్ర స్థాయిలో శతఘ్నులు పేలుతున్నా ఇంకా కాల్పుల విరమణ అమల్లోనే ఉందంటూ సర్దుబాటు సమర్థింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి వంటి అంశాలపై ఎడతెగని చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోపక్క ఇజ్రాయెల్ లెబనాన్‌పై చేస్తున్న భారీ దాడుల విషయంలో ట్రంప్ ప్రతిపాదనలేమీ ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు వినడం లేదు. వారిద్దరి మధ్య కొంత 'మిత్రబేధం' ఏర్పడిందా! అని అనిపిస్తోంది. ఇజ్రాయెల్ మంకుపట్టు వీడకపోవడంతో అమెరికా ఆగ్రహం చెందింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చించిన అంశాలన్నిటినీ బహిర్గతం చేయడంలో కూడా అమెరికా అత్యుత్సాహం చూపిస్తోంది. అవి కూడా నిర్దిష్టంగా లేవు. రష్యా చమురును కొనుగోలు చేస్తూ వచ్చిన భారత్‌పై ఆంక్షలు పెట్టిన అమెరికా ఇప్పుడు స్వరం మార్చింది. రష్యా చమురు ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వస్తేనే పశ్చిమాసియా చమురు సంక్షోభానికి కొంతైనా పరిష్కారం చూపినవారమవుతామని ఇటీవల భారత్‌లో పర్యటించి వెళ్లిన అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానిస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న ఇరాన్ ఎలాంటి పరిస్థితుల్లోనూ అమెరికా, ఇజ్రాయెల్‌తో చర్చలే ఉండవన్న రీతిలో అమెరికాను హెచ్చరిస్తోంది. అసలు యుద్ధం జరుగుతోందా, కాల్పుల విరమణ ఉన్నట్లా? లేదా! యుద్ధం మిధ్యేనా ఇలాంటి సంగతులన్నీ ఆయా దేశ ప్రజల ఊహాగానాల్లోని అంశాలుగా ఉండిపోయాయి. లెబనాన్‌లోని హిజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ బీరుట్ మీద కూడా దాడులకు తెగబడటం ఇరాన్ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ పాకిస్థాన్‌తో చర్చలు మానేసింది. ఈ అంశాలను ఇరాన్ వార్తా సంస్థలు ధృవీకరించాయి. అమెరికాతో కాల్పుల విరమణ అంశంలో లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగు తున్న పోరుకు ఏ మాత్రం సంబంధం లేదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. ఎటువంటి రాజీ అయినా ఇజ్రాయెల్‌తో సంబంధమున్న అంశాలకూ వర్తిస్తుందని, ఇజ్రాయెల్ దాడులు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనేనని ఇరాన్ మండిపడుతోంది. లెబనాన్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ జరిపిన దాడులో 8 మంది చనిపోయారు. ఇరాన్,అమెరికాల మధ్య చర్చలతో తమ ప్రమేయమేమీ లేదన్నట్లు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్ తన యుద్ధతంత్రాన్ని ఆపే పరిస్థితిలో లేదు. ఇదే సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మీద చిర్రెత్తుకొచ్చి మాట్లాడారు.తాను లేకుంటే నెతన్యాహు జైల్లో ఉండేవాడవని అన్యాపదేశంగా ట్రంప్ అనేసారు. ఏదీ తెగదు, నెతాన్యాహ్యు తెగనివ్వడు అనే ధోరణిలో మాట్లాడారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్‌కలిసి రావడం లేదంటూ ట్రంప్ అభ్యంతరకర భాషలో నేరుగా ఫోన్‌లోనే విరుచుకుపడ్డారు. నిజానికి అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందమేమీ కుదరలేదు. వారిద్దరి మధ్య చర్చలంటే ఒకరు వేలికేస్తే మరొకరు కాలికేస్తారు. అలాగే కాలికేసేది ఒకరైతే వేలికేసేది మరొకరు. అంతే తప్ప చర్చలు సజావుగా సాగనివ్వరు. ఒప్పందాన్ని ఓ కొలిక్కి రానీయరు. అన్న చందంగా సాగుతోంది. వీళ్ల చర్చలు స్థిరమైన శాంతి ఒప్పందానికి భరోసా ఇవ్వలేకపోతున్నాయి. మధ్యలో ఇజ్రాయిల్ చీకాకులు కొన్ని. వీటన్నిటితో ట్రంప్ సతమత మవుతున్నట్లు కనపడుతోంది. పరస్పర అవిశ్వాసం, చర్చల పురోగతి ప్రధాన అడ్డంకిగా మారింది. ఒకవైపు దౌత్యం, మరోవైపు సైనిక చర్చలు, ఒప్పందాల ఉల్లంఘనలతో చర్చలకు మార్గం సుగమమయ్యే పరిస్థితి కనపడుట లేదు. పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధ మంటే ప్రపంచ దేశాలన్నిటినీ చమురు సంక్షోభంలో ముంచిన ఓ సైనిక ప్రక్రియలాగే కనపడుతోంది. యుద్ధం ముగిసినా ప్రపంచ జనాభా నెత్తిన ధరల పిడుగు ప్రభా వం నుంచి తప్పించలేరు. బిడ్డ చచ్చినా పురిటికంపు పోదన్న రీతిలో జనం యావత్తూ ఆర్థిక సమస్యలతో మునిగిపోయారన్నది జగద్విదితం. ఒకవేళ దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కుదిరినా అంతర్జాతీయ చమురు మార్కెట్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రభావం నుంచి ఏ దేశమూ తప్పించుకోలేదు. అమెరికా ఆది నుంచీ చెప్పున్నట్లు ఈ యుద్ధం ఇరాన్ 'అణు కార్యక్రమం ఆపాలనే' అని అయితే ఈ పాటికే 'శాంతి రేఖలు' విలసిల్లేవి.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే, మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కోల్టన్

# ప్రజావాక్కు

## రీల్స్‌కు బానిస కావొద్దు

నేడు చిన్నాపెద్దా అనేతేడా లేకుండా చాలామంది రీల్స్‌కు బానిసలుగా మారుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు, గంటల తరబడి రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కొద్దిసేపు చూడాలని ప్రారంభించిన రీల్స్‌గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తాయి. దీనివల్ల చదువు, పని, కుటుంబానికి కేటాయించాల్సిన సమయం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఏకాగ్రత తగ్గి, సృజనాత్మక ఆలోచనలు కూడా మందగిస్తాయి. సమయం అమూల్యమైనది. కాలాన్ని వృథా చేసే రీల్స్ కంటే, భవిష్యత్తును నిర్మించే పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. రీల్స్‌కు బానిస కాకండి, మీ లక్ష్యాలకు మాత్రమే బానిసలుగా మారండి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఆర్థిక వ్యవస్థకు పునాది

పర్యాటక రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు, తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాల వంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ,మౌలిక సదుపాయాల లోపం, కనెక్టివిటీ సమస్యలవల్ల పర్యాటక రంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది. కేవలం హోటళ్ల నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం,భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం. ముఖ్యంగా పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో స్థిరమైన టూరిజం నమూనాలను అనుసరించడం అనివార్యం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీస్తే అది దీర్ఘకాలిక నష్టానికి దారితీస్తుంది.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేప ట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనే కాకుండా నగరాల్లో కూడా రోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

## పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడేశక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవి. మనిషి ముఖం,స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం. మాట్లాడని మాటలను మాట్లాడినట్లుగా, చేయని పనులను చేసినట్లుగా చూపించే నకిలీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖులు, నాయకులు, ఉన్నతాధికారుల స్వరాలను అనుకరించి అత్యవసర పరిస్థితి పేరిట డబ్బులు కోరడం వంటి మోసాలు సాధారణమవుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పేదలకు వరం

నేడు ఉరుకుల పరుగులజీవితంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కుటుంబ భవిష్యత్ జీవితం దృష్ట్యా సరిగ్గా ఆహారం తీసుకోకుండా, ఉద్యోగానికి ఆలస్యం అవుతుందనే కారణాలతోగడిపే ఉద్యోగులకు చిరువ్యాపారులకు ఇందిరమ్మ క్యాంటీన్, అన్నపూర్ణ సెంటర్స్ సదరు పేదవాడి ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి నగరంలోనే కాకుండా గ్రామాలకు వ్యాప్తి చెందితే ప్రజలకు మరింత మేలు చేసినవాళ్లవుతారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## బిసిల అభ్యున్నతికి కృషి చేయాలి

బిసి కుటుంబాలు చాలా వరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కొన్ని పథకాలు పెడుతున్న కూడా బిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినాఅది సమంజసమే. పోటీ పరీక్షల ఎంపికలో వీరికి పరీక్ష ఫీజురాయితీ, హాజరు అయ్యేందుకు ఉచిత ట్రైన్ రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైన కోరిక. ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటే ఎంతో మంది పోటీలో తప్పక నెగ్గుతారు.

- బి.మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# బాల్యానికి స్వేచ్ఛతోనే చదువులకు పండుగ!

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.**



రామ కిష్టయ్య సంగన భట్ల

ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలతో బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్లు, ఇళ్ళల్లో వెట్టిచాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయపెట్టీ, హింసించి, మోసగించి, బెదరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్ల వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం.



కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య నేటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాలలోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదుకాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# ఎల్‌నినో పట్ల రైతులకు అవగాహన అవసరం!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

తరతరాలుగా, భారత వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి కొనసాగుతున్నది. వర్షాలు సకాలంలో కురిసి, రుతుపవనాలు సమానంగా విస్తరించినపుడు మాత్రమే పంటలు బాగా పండుతాయి. పర్యావరణ భూగోళంపై ఈ ఏడాది అతి బలమైన ఎల్‌నినో ఏర్పడవచ్చనే చేదు విషయాన్ని నివేదిక బహిర్గతం చేసింది. పసిఫిక్ మహా సముద్రంలో జలాలు సాధారణం కన్నా అధికంగా వేడెక్కడాన్ని 'ఎల్‌నినో' అని అంటారు. సాధారణం కన్న 2.5 డిగ్రీల ఎక్కువగా సముద్ర నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఎల్‌నినో వల్ల జూన్ 2026 నుంచి వాతావరణ ప్రతికూల మార్పులు జరగవచ్చని, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి అసాధారణ రుతుపవనాల గమనం జరుగుతుందని నివేదిక రూపంలో స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో గాలుల దిశ మారిపోయి ప్రతికూల వాతావరణ మార్పులకు ఆజ్యం పోయవచ్చని అంచనా వేశారు. మే మాసంలో ఏర్పడే ఎల్‌నినో ఆగష్టు నాటికి బలపడి సూపర్ ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో ప్రతికూల మార్పులు, సముద్ర తుఫాన్లు, కరవు కాటకాలు లాంటి దుష్ప్రభావాలు జరుగుతాయని గమనించాలి. ఎల్‌నినో ప్రభావం వల్లవర్షాభావం, సకాలంలో వర్షాలు పడకపోవడం, సుదీర్ఘ పొడిగాలులు వీయడం, వరి,పత్తి, వేరుశనగ లాంటి వర్షాధార పంటల దిగుబడులు భారీగా పడిపోవడం, తెగుళ్ల బెడద (రసం పీల్చే పేనుబంక, తెల్లదోమ, బూడిద తెగులు) పెరగడం, నీటి కొరత వల్ల చెరువులు,బావులు, చిత్తడి నేలలు ఎండిపోవడం లాంటి దుష్ప్రభావాలు జరిగే అవకాశం ఉందవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావానికితట్టుకునే



విధంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ నీటితో పండే గోరుచిక్కుడు, మినుములు, కందులు, చిరుధాన్యాలు లాంటి పంటలను ఎంచుకోవాలి. నేలలో తేమను సంరక్షించుకోవడానికి ఆకులతో కప్పడం(మల్చింగ్) లాంటి విధానం పాటించాలి. నేల సారానికి అనుగుణంగా ఎరువులు, సేంద్రియ పదార్థాలు వాడడం మంచిది. సస్య రక్షణలో భాగంగా తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలతో సకాలంలో పురుగుమందులు పిచికారీ చేయాలి. సూక్ష్మసేద్యం ద్వారా ఉద్యాన రైతులకు కొంత మేర ఉపశమనం లభించవచ్చు. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, యుద్ధాలతో యూరియా లాంటి ఎరువుల కొరత ఏర్పడనుందని గమనించాలి. రానున్నరోజుల్లో ఎల్‌నినో ప్రభావం పట్ల అవగామన పెంచుకొని రైతులు తగు పంటలపై దృష్టిని కేంద్రీకరించాలి. పంటల అవశేషాలను కాల్చడంతో భూసారం దెబ్బతినడం, దిగుబడులు తగ్గడం, ఎరువులు వేసినా తగిన ప్రయోజనం లభించకపోవడం లాంటి తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఇప్పటికే సూరన్న సుర్రుమంటున్నాడు. అకాల వర్షాలు అన్నదాత రోదనలకు ఆజ్యం పోస్తున్నాయి. చేతికి వచ్చిన పంట నేలపై వాలిపోయింది. పండ్లతోటల్లో కాయలు రాలుతున్నాయి. ఆరుగాలం కష్టపడిన రైతన్న కంట కన్నీటి వరదలు పారుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్ష వడగళ్లతో హలధారి విలవిల్లాడుతున్నాడు. పుండు మీద కారం చల్లినట్లు రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో బలపడితే కరవు కరాళ నృత్యం చేయవచ్చు. ఆహార అభద్రత రాజ్యమేలవచ్చు. ఇలాంటి వాతావరణ ప్రతికూల మార్పులకు కారణాలను తెలుసుకొని, అరికట్టే ప్రయత్నాలు చేయనియెడల విశ్వమానవాళి సంక్షోభ సంకెళ్ల లో బంధించబడి హాహాకారాలతో ఆఖరి శ్వాస తీసుకోవచ్చు. ఈ పరిస్థితులను ఆలకించరు చేసుకొని రాబోయే కరవుల ను ఎదుర్కొనే చర్యలను నేటి నుండే మొదలు పెడదాం, రేపటి ఆరోగ్యకర వాతావరణానికి నేటి నుంచే హారతి పడదాం.

# ఫలించని సంస్కరణలతో పేదలు భూమికి దూరం!

బొల్లిముంతసాంబశివరావు

తెలంగాణ రాష్ట్రంలో 25లక్షల గ్రామీణ కుటుంబాలకు సాగు భూమి లేదని, వీరిలో దళిత కుటుంబాలు ఎక్కువని,వీరంతా కూలిపనులు చేసుకొంటున్నారని ధరణి కమిటీ రిపోర్టులో పేర్కొంది. ఈకుటుంబాలకు ప్రస్తుత ప్రభుత్వం భూములు పంపిణీ చేయటమే కాకుండా ఏటా 12వేల ఆర్థిక సహాయం అందించే ఆలోచన చేస్తున్నది. భూమికి, గ్రామీణ ప్రజలకు విడదీయరాని బంధం ఉంది. రైతుకు సమాజంలో హోదాని, గౌరవాన్ని ఇచ్చేది సేద్యపు భూమే. అంతటిప్రాధాన్యత ఉన్న భూమి కొద్దిమంది వ్యక్తుల వద్ద ఎక్కువగా పోగుపడి ఉంది. అత్యధిక మందిపేదలు భూమి కిదూరమయ్యారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో 65లక్షల మంది రైతులున్నారు. సేద్యపు భూమి కోటి52లక్షలుఉంది. 73శాతం మంది రైతులు 2.5ఎకరాలకన్నా తక్కువ భూమి కలిగి ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికార లెక్కల ప్రకారం లక్షలోపు జనాభా కలిగిఉన్న వారి వద్ద 14.97లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు 42.22 లక్షల మంది ఉంటే, వారి వద్ద 60.60 లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు నుంచి ఐదుఎకరాల లోపు ఉన్న రైతులు 10.08 లక్షల మంది ఉండగా, వారి వద్ద 40లక్షల ఎకరాల భూమి ఉంది. ఐదునుంచి 10 ఎకరాలున్న వారు 4.65 లక్షల మంది రైతులుండగా, వారు 30.94 లక్షల ఎకరాలు కలిగి ఉన్నారు. 20ఎకరాల భూమి ఉన్న రైతులు 84.606 మంది ఉండగా, వారి వద్ద11.09 లక్షల ఎకరాల భూమిఉంది. 20ఎకరాలపైన ఉన్న భూకామందులు 14.46 వేల మంది ఉంటే వారి వద్ద 3.87 లక్షల ఎకరాల భూమి ఉంది. ఈగణాంకాలను గమనిస్తే భూస్వాముల, ధనిక, రైతుల వద్ద భూకేంద్రీకరణ ఎక్కువగా ఉందని, చిన్న, సన్నకారు రైతులు తక్కువ భూమి కలిగి ఉన్నారని, అసలు సెంటు భూమి లేని పేదలు 25 లక్షలమంది ఉన్నారని వెల్లడౌతుంది. దేశంలో బ్రిటిష్ వలస పాలన కాలంలోనే భూమికోసం అనేక పోరాటాలుజరిగాయి. 10లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుని పంపిణీ చేసుకున్నారు. వేలాది గ్రామాల్లో ప్రజాపాలన ఏర్పడింది. ఈపోరాటంలో 4 వేలమంది కమ్యూనిస్టు పార్టీ వారు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రజల ప్రధాన సమస్య అయిన భూమి సమస్యను ముందుకు తెచ్చింది. భూపోరాటాలకు భయపడిన నెహ్రూ ప్రభుత్వం 1947 నవంబర్ 28న జమీందారీ విధానం రద్దు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. 1948లో వ్యవసాయ సంస్కరణలపై కుమారప్ప కమిటీని వేసింది. ఈ కమిటీ 1949లో తన నివేదిక అందచేసింది. అందులో కొన్ని సూచనలు చేసింది. ఈ కమిటీ సూచనల మేరకు 1949లోహైద్రాబాద్ జాగీర్దార్ల రద్దుచట్టాన్నిచేసింది. 1950లో సంస్థానాలను రద్దుచేసి ఒక్కో సంస్థానానికి 18కోట్లు భరణంగా ఇచ్చింది. వీటికింద లక్షలాది ఎకరాల భూములున్నాయి. ఈ భూములు పేదలకు దక్కలేదు. రైతులపేరుతో దలారులుగా ఉన్నవారు భూములు పొంది భూస్వాములుగా మారారు. కుమారప్ప కమిటీ సూచనలకు అనుగుణంగా వ్యవసాయం చేయని భూయజమానుల దోపిడీ నుండి కౌలుదారులకు రక్షణ కల్పించటం పేరుతో 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేశారు. వివిధ చారిటబుల్



మతసంబంధమైన ఈనాం భూములకు (వీటికింద లక్షల ఎకరాల భూమి ఉంది) తప్ప ఈచట్టం అన్నిరకాల భూములకు వర్తిస్తుంది. 1933 నుంచి 1943 మధ్యకాలంలో వరుసగా ఆరుసంవత్సరాలు కౌలుకు చేస్తున్న వారిని రక్షి త కౌలుదారులుగా చట్టం గుర్తించింది. రక్షి త కౌలుదారునికి సేద్య అవసరాల కోసం భూమిని బ్యాంకుల తనకా పెట్టే హక్కు కల్పించబడింది. నిబంధన ప్రకారం కౌలుచెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలుచెల్లించకపోతే కౌలు ఒప్పందం రద్దు అవుతుంది. భూయజమాని సొంత సేద్యం చేసుకునేందుకు చట్టంలో హక్కు కల్పించారు. ఈ హక్కుతో సొంత సేద్యం పేరుతో భూకామందులు కౌలు దారులను భూముల నుండి తొలగించారు. ఆచరణలో కౌలుదారీ చట్టం అలంకారప్రాయంగా మారింది. ఎటు వంటి హక్కులు లేకుండా కౌలుదారులు అధిక కౌలుతో నేడు కౌలుసేద్యం చేస్తున్నారు. భూకేంద్రీకరణను, ఆర్థిక, సాంఘిక, అసమానతలను తగ్గించటానికని భూకమతాలపై గరిష్ఠ పరిమితి విధించారు. దీన్ని అమలు చేయటానికి హైద్రాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ నియమించబడింది. ఈకమిటీ భూకమతాల గరిష్ఠపరిమితికి కొన్ని సూచనలు చేసింది. వ్యవసాయదారులకు నెలకు రూ.150 వచ్చే విధంగా వివిధ ప్రాంతాల్లోని భూములను ఆర్థిక కమతంగా గుర్తించాలి. రెండు ఎకరాల మాగాణి లేదా 15 ఎకరాల మెట్ట భూమిని బేసిక్ ఆధారంగా కమతం గరిష్ఠ పరిమితిని నిర్ణయించాలి. గరిష్ఠ పరిమాణం ఆర్థిక కమతానికి 5రెట్లు ఉండాలని సూచించింది. కమిటీ సూచనల ప్రకారం మధ్య వర్తుల తొలగింపు చట్టం, జమీందార్ల, జాగీర్దార్లను తొలగించటం వరకే పరిమితమైంది. దున్నేవానికే భూమి అన్న నినాదం వదిలివేయబడింది. తెలంగాణ రైతాంగ పోరాటం తర్వాత నక్సల్బరీ గిరిజన రైతాంగ పోరాటం, శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం మరలా భూసమస్యను ఎజెండాలోకి తెచ్చాయి. వ్యవసాయ కూలీల్లో, పేదరైతుల్లో భూమి సాధించుకోవాలనే పట్టుదల రోజురోజుకి పెరిగింది. ఈవాస్తవాన్ని గ్రహించిన ఆనాటి ఇందిరాప్రభుత్వం, భూపోరాటాలను దారిమళ్లించేందుకు పూనుకుంది. 1970లోముఖ్య మంత్రుల సమావేశంలో మనరాజకీయ వ్యవస్థ రక్షి ంచబడా లంటే భూసంస్కరణల చట్టం చేయక తప్పదని ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పింది. భూపరిమితికి ఐదుగురు సభ్యుల కుటుంబాన్ని యూనిట్ తీసుకోవాలి. సంవత్సరాని కి రెండు పంటలు పండే భూమి 10 నుంచి 18ఎకరాలు, మెట్టభూమి27ఎకరాలు గరిష్ఠ పరిమితిగా, కాఫీ, తేయాకు, రబ్బరు,కోకో మొద్దలైన తోటలు పండించే తోటలకు చట్టం నుంచి మినహాయింపు ఇచ్చి, నూతన సవరణలతో భూ సంస్కరణ చట్టాలను డిసెంబర్ 31,1972 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని ఆదేశించింది. కేంద్రం ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1972మేలో భూపరిమితి కుదిస్తూ ఆర్డినెనెన్ విడుదల చేసింది. దానిలో కుటుంబానికి 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టభూమిని భూపరిమితిగా విధించి 1973 జనవరిలో శాసనసభ ఆమోదంపొంది భూసంస్కరణల చట్టంగా మారినా 1975 జనవరిలోగాని ఆచరణలోకి రాలేదు. ఈ చట్టం ద్వారా మొదట 18 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని ప్రకటించి దాన్ని కదిస్తూ చివరికి 7.8 లక్షల ఎకరాలుగా తేల్చి అందులో 6.47 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.82లక్షల ఎకరాలను 4 లక్షల,79 వేలమందికి పంపిణీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కూడా చట్టానికి ముందే పేదలు సాగుచేసుకుంటున్న భూములు ,సేద్యానికి ఉపయోగపడని భూములే ఎక్కువగా ఉన్నాయి. చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని భూస్వాములు చట్టపరిధిలోకి రాకుండా కాపాడుకున్నారు. జాతీయ స్థాయిలో ఒకేసీలింగ్విధానం రూపొందించిన తర్వాత 67 లక్షలుగా, మిగులు భూమిగా ప్రకటించగా, ప్రభుత్వ విధానాలు, పాలసీలపైపరిశోధన, క్రమశిక్షణ నిమిత్తం ఏర్పాటైన నలఅకాడమి దేశంమొత్తంలో మిగులు భూమి 5 కోట్ల 20 లక్షల ఎకరాలు ఉంటుందని అంచనా వేసింది. భూ సంస్క

4-6Pg5.qxd:4-6Pg5.qxd 1/1/02 6:16 AM Page 1



# రూ.10 వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి



**- విమానయాన సంస్థలకు ఆర్థిక ప్యాకేజీ - కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం**

**- ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో కాలుష్య నివారణకు రూ.9,585 కోట్ల కొత్త పథకం - రూ.8300 కోట్లతో రామేశ్వరం- పరదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్టుకు ఆమోదం - తెలంగాణలో రూ.7,597.16 కోట్లతో 190 కి.మీ. హైవే ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ :కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, జూన్ 3:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ విపణిలో పెరుగుతున్న ఇంధన ధరలతో భారత్‌పై ఆ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉపశమన చర్యలకు శ్రీకారం చుట్టింది. రూ.10 వేల కోట్లతో 'ఇంధన ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారం మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ నిధి ఏర్పాటుకు విమానయాన రంగానికి ఒక ప్రధాన ఉపశమన చర్యగా అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కొనసాగుతున్న పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల ప్రభావితమైన షెడ్యూల్డ్ భారతీయ విమానయాన సంస్థల కోసం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను స్థిరీకరించడంలో సహాయపడటానికి బడ్జెట్ మద్దతు ప్యాకేజీని ఆమోదించినట్లు వివరించారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ద్వారా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసిలకు) వడ్డీ లేని అడ్వాన్సుల రూపంలో ఈ సహాయం అందించబడుతుంది.

ఈ నిధి, దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీకి అంతరాయం కలగకుండా చూస్తూనే, అపూర్వమైన ఇంధన ధరల అస్థిరత నుండి విమానయాన సంస్థలను కాపాడటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా పాత బస్సులు, ట్రక్కుల స్థానంలో కొత్తవి తీసుకు రావడానికి రూ.9,585 కోట్లతో ప్రతిపాదించిన కొత్త పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రెండేళ్లలో ఈ పథకం కింద పూర్తిగా బి-6 లేదా ఇవి వాహనాలను తీసుకు రావడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే, తమిళనాడులోని రామేశ్వరం నుంచి ఒడిశాలోని పరదీప్ వరకు 160.18 కిలోమీటర్ల కోస్టల్ హైవే ప్రాజెక్టును రూ.8300.79 కోట్లతో రెండు దశల్లో చేపట్టాలనే ప్రతిపాదలకు కేంద్ర కేబినెట్ అనుమతిచ్చింది. పూర్తిగా హైబ్రిడ్ అన్యుటి మోడల్ (హెచ్ఎఎం)లో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇదిలా ఉండగా, తెలంగాణలో ఎన్‌హెచ్-63లో ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల సెక్షన్, ఎన్‌హెచ్-563లో జగిత్యాల - కరీంనగర్ మొత్తం 190 కి.మీ. నాలుగు వరుసలతో హైబ్రిడ్ అన్యుటి మోడల్(హెచ్ఎఎం)లో రూ.7,597.16 కోట్లతో విస్తరణ పనులకు ఎన్‌హెచ్ఐఎ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మధ్యప్రదేశ్‌లో ఎన్‌హెచ్ 347బిలో హివార్‌ఖేడి - రోష్ని -ఆషాపూర్- రుధీ మధ్య 125.01 కి.మీ, దేశ్‌గావ్ -జుల్వానియా మధ్య 108.65 కి.మీ మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ కోసం రూ.4,415.60 కోట్ల ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

అలాగే బీహార్‌లో రూ.3, 936.05 కోట్లతో ఎన్‌హెచ్-31, ఎన్‌హెచ్-231 రహదారి విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వివరించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించవచ్చు


## తమిళనాడు, కర్ణాటక చట్టాలను సమర్థించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆటలపై ఆన్‌లైన్ బెట్టింగ్, పందెం కాయడాన్ని నిషేధించే తమిళనాడు, కర్ణాటక చట్టాల రాజ్యాంగబద్ధతను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆట నైపుణ్యానికి సంబంధించినది అయినప్పటికీ, బెట్టింగ్‌పై చట్టాలు చేసేందుకు రాష్ట్ర శాసనసభలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని రెండవ జాబితాలోని 34వ అంశం ప్రకారం, "బెట్టింగ్, జూదం"పై చట్టాలు చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందని, దీని కింద నైపుణ్యంతో కూడిన ఆటలపై బెట్టింగ్‌ను నియంత్రించే, నిషేధించే అధికారం రాష్ట్రాలకు ఉందని జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నైపుణ్యపు ఆటలకు లభించే రాజ్యాంగ రక్షణ, అటువంటి ఆటలపై నిర్వహించే పందెం కాయడానికి లేదా బెట్టింగ్‌కు వర్తించదని కోర్టు స్పష్టం చేసింది. నైపుణ్యంతో కూడిన ఆటలు 'జూదం' అనే పదం పరిధిలోకి రాకపోవచ్చు అనేది నిజమే అయినప్పటికీ, నైపుణ్యంతో కూడిన ఆటలపై 'పందెం' వేయడం కూడా రాష్ట్ర శాసనసభ చట్టసభ పరిధిలోకి రాదని చెప్పడం సరికాదు" అని కోర్టు పేర్కొంది. పందెం, జూదంతో కూడిన వ్యాపారం చేయడానికి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు ఆర్టికల్ 19(1)(జి) కింద ప్రాథమిక హక్కు లేదని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొన్నది. ఆన్‌లైన్ వ్యసనాలవల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది.

# ముఖ్యమంత్రిగా డికె పదవీ ప్రమాణం

## ఆయనతోపాటే 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్‌లోకి

### యతీంద్ర, యుటిఖాదర్‌లకు కూడా ఛాన్స్



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటకలో నెలకొన్న కాంగ్రెస్ సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రిగా 64 ఏళ్ల దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్ 18వ ముఖ్యమంత్రిగా బుధవారం లోక్‌భవన్‌లోజరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసారు. రాజ్యాంగం పుస్తకాన్ని చేతబట్టి ఆయన ప్రమాణ పత్రాన్ని చదివారు. అంతకుముందు వేదికపైనుంచే ఆయన ఆహూతులందరికీ సాష్టాంగప్రణామం చేయడం కాంగ్రెస్‌నేతలను ఆకర్షించింది. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యే అయిన శివకుమార్ ముఖ్యమంత్రిగాను, డిప్యూటి సిఎంగా జికె పరమేశ్వరలు ప్రమాణస్వీకారంచేసారు. మరో 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణంచేసారు. లోక్‌భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోత్ వీరితో ప్రమాణంచేయించారు. సీఎంగా శివకుమార్ వీరగంగాధర అజ్జయ్యపేరును పఠించి ప్రమాణంచేసారు. అంతకుముందు అజ్జయ్యకు పూలతో నివాళి అర్పించారు. మంత్రులుగా సిద్ధరామయ్య తనయుడు యత్రీంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే,కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, సతీశ్ జర్కిహోళి, రామలింగారెడ్డి, కృష్ణబైరె గౌడ, మాజీ స్పీకర్ యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. సాధారణంగా సీఎం ప్రమాణ స్వీకార వేదిక ద్వారాలు, కార్యాలయంలోని ఆసనాలన్నీ జ్యోతిషశాస్త్ర ప్రకారమే మార్చడ విశేషం. ఏఐసీసీ నుంచి విశిష్ట అతిథులు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రత్యేక అతిథులుగా పలు రంగాల ప్రముఖులను గౌరవ అతిథులుగా ఆహ్వానించారు. మొత్తం 1100 మందికి లోక్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి 3 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, అధికారం చేపట్టింది. ఆ సమయంలోనే సీఎం పదవి కోసం డీకే తీవ్రంగా ప్రయత్నించారు. సీనియర్ నేత సిద్ధరామయ్యకు అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత అవకాశం కల్పిస్తామని అప్పట్లో హైకమాండ్ మాట ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. గతేడాది నవంబరుతో సగం కాలం పూర్తికాగా నాయకత్వ మార్పుపై తీవ్ర చర్చ జరిగింది. ఆ సంక్షోభాన్ని నివారించిన కాంగ్రెస్ సిద్ధరామయ్యను ఒప్పించి రాజీనామా చేయించారు.

# మమతా బెనర్జీకి షాక్.. 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు..

**కోల్‌కత్తా,జూన్ 3:** అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీకి షాక్ తగిలింది. 58 మంది ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. వారంతా కలిసి ఏకంగా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా బెనర్జీని తమ పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని స్పీకర్‌ను కోరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వీరంతా ప్రత్యేక బస్సుల్లో బెంగాల్ అసెంబ్లీకి చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రతా బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం టీఎంసీలో 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 58 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతగా రితబ్రత పేరు సూచిస్తూ మద్దతు నిలిచారు. ఆయన చెప్పినట్లు పార్టీపై 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే మమత పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారు. ఈ అంశంపై ఇప్పటివరకు మమతా బెనర్జీకానీ, టీఎంసీ అగ్రనాయకత్వం కానీ స్పందించలేదు. మరోవైపు టీఎంసీ అగ్రనేత అభిషేక్ కల్యాణ్ బెనర్జీ తాజాగా ఎక్స్‌లో స్పందించారు. తన పార్టీ తరఫున అసెంబ్లీలో హోదాలకు సంబంధించి కీలక ప్రతిపాదనల్ని స్పీకర్‌కు పంపించారు. శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరారు. కానీ, ఇప్పుడు అత్యధిక శాతం ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు పలకడంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. రితబ్రతనే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తే మమత ఆధ్వర్యంలోని టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఇటీవలే రితబ్రతతోపాటు సందీపన్ సాహాను కూడా టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ అగ్రనాయకత్వం తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని వీరు ఫిర్యాదు చేయడంతో టీఎంసీ వీరిని సస్పెండ్ చేసింది.

## పార్టీలోని అన్ని కమిటీలను రద్దుచేసిన టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ సీఎం మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఆవిర్భావం తర్వాత టీఎంసీకి ఇటువంటి గడ్డు పరిస్థితి ఎదురుకావడం ఇదే మొదటిసారి. అంతర్గత సంక్షోభం, భారీ తిరుగుబాటు నేపథ్యంలో అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీ రాష్ట్ర కమిటీతో పాటు అనుబంధ సంఘాలన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ అన్ని కమిటీలు, అలాగే దాని అనుబంధ సంస్థలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించడం జరిగిందని తన అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో టీఎంసీ పోస్ట్ పెట్టింది. టీఎంసీ నుంచి ఎన్నికైన కనీసం 58 మంది ఎమ్మెల్యేలు అధినేత్రి నిర్ణయానికి వ్యతిరేకంగా రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్న గంటలోపే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడారనే ఆరోపణలపై టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సాందీపన్ సాహాలను మమతా బెనర్జీ సోమవారం పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. పార్టీ నుంచి సస్పెండ్ గురయ్యేంత వరకు తృణమూల్ ట్రేడ్ యూనియన్ విభాగానికి రితబ్రత నాయకత్వం వహించారు. పదిహేనేళ్ల పాటు బెంగాల్‌ను పాలించి టీఎంసీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరవేగంగా కుప్పకూలుతోంది. ఆ పార్టీ నాయకులలో చాలామంది కీలక సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలోని ఎన్నికైన ప్రజాప్రతినిధులలో చాలామంది సామూహికంగా రాజీనామా చేయడం లేదా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులలో అరెస్టు అయ్యారు. ఆత్మపరిశీలన చేసుకుని, సంస్థను కొత్తగా పునర్నిర్మిస్తామని తృణమూల్ తెలిపింది. "పార్టీ ప్రతి స్థాయిలో సమగ్రమైన ఆత్మపరిశీలన, పనితీరు సమీక్ష, సంస్థాగత మదింపు ప్రక్రియను చేపడుతుంది ఈ ప్రక్రియ ఫలితాల ఆధారంగా సంస్థాగతంగా అన్ని విభాగాలను పునర్నిర్మించి, తగిన సమయంలో ప్రకటన చేస్తామన్నారు.

# ఫలించిన వ్యూహం..

## విపక్షనేతగా రెబెల్ నేత రితబ్రత బెనర్జీ

### ఆమోదించిన స్పీకర్ రతీంద్రనాథ్ బోస్

### చీఫ్‌విప్, విప్ , డిప్యూటీల నియామకానికీ ఓకే!



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమబెంగాల్ టిఎంసిలో రోజురోజుకూ తిరుగుబాటు పెరుగుతోంది. తాజాగా 58 ఎమ్మెల్యేలు రాష్ట్ర స్పీకర్ రతీంద్రనాద్‌బోస్‌కు లేఖ ఇచ్చారు. వీటిని వెంటనే స్పీకర్ ఆమోదించడంతో టిఎంసి రెబెల్ ఎమ్మెల్యేల గ్రూప్ మరింత దూకుడు పెంచింది. రితబ్రత బెనర్జీ ఆధ్వర్యంలో 58 మంది ఎమ్మెల్యేలు తాము శాసనసభా పక్ష నేతగా రితబ్రత బెనర్జీనే ఎన్నుకున్నట్లు లేఖ ఇవ్వడంతో ఆగ్రూపు నేతగా రితబ్రత ఎన్నికయ్యారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం రెబెల్‌నేత మాట్లాడుతూ తమకు 58 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఉందని, మేమంతా సమిష్టిగా స్పీకర్‌ను కలిసి లేఖ ఇచ్చామని వెల్లడించారు. అలాగే శాసనసభలో విపక్షనేతగా బందోపాధ్యాయ్‌ను ఎన్నుకున్నట్లు కూడా తెలిపారు. అంతకుముందు పార్టీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు, ఎంపి అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖరాస్తూ శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్‌ను శాసనసభలో విపక్ష నేతగా ఎన్నుకున్నట్లు లేఖ ఇచ్చారు. అయితేఈ ప్రతిపాదనను స్పీకర్ ఆమోదించలేదు. అనేకమంది టిఎంసి ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీచేసారన్న ఆరోపణలు, ఫిర్యాదులు స్పీకర్‌కు రావడంతో అభిషేక్ లేఖను తిరస్కరించారు. ఈపరిణామాలిలా ఉంటే కోల్‌కత్తామేయర్ టిఎంసి సీనియర్ నాయకుడు ఫిర్హాద్ హాకీమ్‌కూడా తన పదవికి రాజీనామాచేసారు. అంతకుముందే మమతాను తాను రాజీనామాచేస్తానని కోరినట్లు వినికిడి. బిజెపి ప్రభుత్వంలో బాధ్యతలునిర్వహించడం కష్టమేనని తాను తప్పుకుంటానని చెప్పినట్లు సమాచారం. పదేపదే విజ్ఞప్తులుచేయడంతో మమతా బెనర్జీ కూడా పదవినుంచి దిగిపోయేందుకు సుముఖత వ్యక్తంచేసారని ఎమ్మెల్యే కునాల్‌ఘోష్ తెలిపారు. ఇదిలా ఉంటే రితబ్రత బెనర్జీ పార్టీ చీఫ్ విప్‌గా జావేద్ అహ్మద్‌కాన్, సాదీపన్ సాహా, సబినా యాస్మిన్,షియులి సాహాలు డిప్యూటీలుగా నియమించినట్లుప్రకటించారు. లేఖలను ఇప్పటికే స్పీకర్‌కు అందచేసామని రితబ్రత వివరించారు.

# దేశంలో భారీ కుట్రలకు తెరలేపిన దావూద్ గ్యాంగ్

**ముంబయి, జూన్ 3:** దేశంలో లక్ష్యనిర్దేశిత ప్రాంతాల్లో దాడులకోసం దేశీయంగా యువతను రిక్రూట్ చేసుకుంటున్నట్లు దావూద్ గ్యాంగ్ గుట్టును పోలీసులు ఛేదించారు. ఢిల్లీ స్పెషల్ పోలీసులు, మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ సమాచారం బయటకు వచ్చింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ ఐఎస్ఐ, అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం గ్యాగ్ కలిసి భారత వ్యతిరేక కుట్రలకు తెరలేపాయి. దేశంలోని యువతను డబ్బు ఆశ చూపి గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నట్లు వెల్లడైంది. ఇటీవల ఢిల్లీ పోలీసులు, మహారాష్ట్ర ఏటీఎస్ కలిసి ముంబై సమీపంలోని భయందర్ ప్రాంతంలో 26 ఏళ్ల హుజైఫా ఫారూక్ అహ్మద్ హష్మి అనే వ్యక్తిని అరెస్టు చేశాయి. అతడిని విచారించగా సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ, ముంబైకి చెందిన దావూద్ గ్యాంగ్ కలిసి దేశంలోని కొందరు యువతను తమ గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నాయి. వారికి డబ్బును ఆశగా చూపుతున్నాయి. అనంతరం అండర్‌వరల్డ్ సిండికేట్‌లో చేర్చుకుని రకరకాల నేరాల్లో భాగస్వాములుగా చేస్తున్నాయి. వీరంతా కలిసి ఢిల్లీలోని ఒక కీలక నేతను లక్ష్యంగా ఎంచుకున్నారు. అయితే, ఆ నేత ఎవరు అనేది ఇంకా వెల్లడించలేదు. హష్మికి, పాకిస్తాన్‌కు చెందిన యవార్ ఖాన్‌తో సంబంధాలున్నాయి. హష్మికి యవార్ ఖాన్ ఒక కాంటాక్ట్ ఇచ్చాడు. యవార్ హష్మితోపాటు కుర్లాకు చెందిన సాజిద్, ముంబ్రాకు చెందిన తౌఖిర్‌లను గ్యాంగ్‌గా ఏర్పాటు చేసి, ఒక ఢిల్లీ నేతను టార్గెట్‌గా ఇచ్చారు.

# నేనే సుస్మితపై ఆధారపడేవాడిని!

## సేన్ గోల్డ్ డిగ్గర్ అన్న వ్యాఖ్యలకు లలిత్‌మోడీ కౌంటర్

**లండన్, జూన్ 3:** మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో తన గత బంధం గురించి ప్రముఖ వ్యాపారవేత్త లలిత్ మోదీ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సుస్మితను గోల్డ్ డిగ్గర్ (డబ్బు కోసం ఆశపడే వ్యక్తి) అని విమర్శించిన వారికి గట్టి సమాధానం ఇస్తూ, అసలు తానే ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడినని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఇంటర్వ్యూ వైరల్ అయిన తర్వాత సుస్మితా సేన్ చేసిన మొదటి సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హ్యూమన్స్ ఆఫ్ బాంబేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ మాట్లాడుతూ సుస్మిత చాలా అందమైన, బాగా సంపాదించుకున్న మహిళ. ఈ గ్రహం మీద నేను చూసిన ఎవరికన్నా ఆమె దగ్గరే ఎక్కువ వజ్రాలున్నాయి. అవన్నీ ఆమె స్వయంగా సంపాదించుకున్నవే. ఒకానొక సమయంలో నేను ఆమెతో బయటకు వెళ్లినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. అన్నీ ఆమెనే చూసుకునేది. నేను ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడిని. ఆమె అద్భుతమైన మహిళ అని వివరించారు.

# కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ భీకర దాడి

**కువైట్ సిటీ, జూన్ 3:** గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎయిర్‌పోర్ట్‌లోని ఒక ప్యాసింజర్ టెర్మినల్ తీవ్రంగా దెబ్బతింది. ఎయిర్‌పోర్ట్‌లోని టీ1 ప్యాసింజర్ భవనంపై ఇరాన్‌కు చెందిన డ్రోన్లు దాడి చేశాయి. విమానాశ్రయ భవనానికి భారీగా నష్టం వాటిల్లినట్లు కువైట్ ప్రభుత్వం వెల్లడించింది. దాడి నేపథ్యంలో అధికారులు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, అన్ని విమాన సర్వీసులను నిలిపివేశారు. ఈ దాడిని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ సౌద్ అబ్దుల్‌అజీజ్ అల్‌ఒతైబీ మాట్లాడుతూ, ఇది ఇరాన్ చేసిన నేరపూరిత దురాక్రమణ. శత్రు డ్రోన్లు నేరుగా ప్రయాణికుల భవనాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడి వల్ల భవనానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. పరిస్థితిని భద్రతా దళాలు నిశితంగా గమనిస్తున్నాయని, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో తమ సైనికులకు ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ స్పష్టం చేసింది. దాడి సమయంలో కువైట్, బహ్రెయిన్ దళాలు కూడా తమ రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేశాయి. ఫిబ్రవరిలో మొదలైన ఘర్షణల తర్వాత, ఇటీవలే కువైట్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాజా దాడితో గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కువైట్ అధికారులు సైనిక బలగాలను హై అలర్ట్‌లో ఉంచారు.

# లక్ష డాలర్ల ఫీజు నిర్ణయించినా హెచ్1బి వీసాలకోసం 2.86 లక్షల దరఖాస్తులు



## హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్

**వాషింగ్టన్, జూన్ 3:** హెచ్1బి వీసాలపై ఆంక్షలు పెంచేందుకు డొనాల్డ్‌ట్రంప్‌ప్రభుత్వం ఫీజును లక్ష డాలర్లకు పెంచినప్పటికీ దరఖాస్తులు మాత్రం వెల్లువలా వస్తూనే ఉన్నాయి. హెచ్1బి వీసాలకోసం దరఖాస్తులు రెండులక్షలకుపైగా వచ్చినట్లు డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ వెల్లడించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ సబ్‌కమిటీ ముందు వివరణ ఇచ్చిన మార్క్‌వేన్ ముల్లిన్ హెచ్1బి వీసాకోసం దరఖాస్తులు 2.86 లక్షలవరకూ అందినట్లు తెలిపారు. వీటిలో రెండులక్షల దరఖాస్తులకు అభ్యర్థులు లక్ష డాలర్ల ఫీజును కూడా చెల్లించారు. దీనితో మేం వేగంగా ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సెనేటర్ సుసాన్ కొల్లిన్స్ వేసిన ప్రశ్నలకు మార్క్‌వేన్ ముల్లిన్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. దరఖాస్తుదారులు 15రోజుల్లోనే తమ దరఖాస్తులను క్లియర్‌చేసేందుకు వీలుగా మొత్తం ఫీజు చెల్లించారని చెప్పారు. సాధారణ దరఖాస్తులు సుమారుగా 7.5 నెలలకాలం పడుతుందని కూడా డిహెచ్ఎస్ కార్యదర్శి వివరించారు. గ్రామీణ హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు భారం పెరుగుతోందని, ప్రిస్క్ ఐల్ అనే ఉత్తరమైన్ ప్రాంతంలో ఇటీవలే విదేశీ సర్జన్‌కోసం నిర్దేశిత ఫీజు మొత్తం చెల్లించిందని చెప్పారు. ఇప్పటివరకూ సేవలు అందని ప్రాంతాల్లో నియామకాలకు స్కిల్డ్ వర్కర్లు అవసరం అవుతారని, దేశీయ ట్యాలెంట్ పూల్స్‌నుంచే వారిని ఎంపికచేసుకోవాలనిసూచించారు. ఈ ఫీజునుంచి వైద్య వృత్తినిపుణులను మినహాయిస్తారా అన్న ప్రశ్నపై ముల్లిన్ స్పందిస్తూ వైద్యనిపుణులు అందుబాటులో లేనట్లు నిర్ధారణ అయితేనే సాధ్యం అవుతుందని చెప్పారు. కొన్ని ప్రత్యేక కేసుల్లో మినహాయింపులు ఇచ్చే అంశంపై నిపుణులు కొరత తీవ్రంగా ఉన్నపుడు మాత్రమే వీలవుతుందని ముల్లిన్ చెప్పారు. ఐటిరంగంలో ఒక కంప్యూటర్ నిపుణుడిని ఇతర దేశంనుంచి కాలిఫోర్నియా, సిఇకాన్ వ్యాలీల్లో నియమించుకున్నంత సులువుగా ఒక వైద్యనిపుణుడిని మాత్రం గ్రామీణ ఆసుపత్రుల్లో నియమించుకోవడం అంత సులువుకాదన్నారు. అలాస్కా రిపబ్లికన్ సెనేటర్ లీసా మరెకోవ్‌స్కీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో కూడా హెచ్1బి వీసా టీచర్లకు సమస్య ఎదురవుతోందని డిహెచ్ఎస్ దృష్టికి తెచ్చినట్లు గుర్తుచేసారు.

# సంక్షిప్తంగా..

## అద్దెలు పెంచవద్దని ఎమిరేట్స్ భవన యజమానులకు ఆదేశాలు



**అబూదాబి, జూన్ 3:** ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అబుదాబి ప్రభుత్వం అక్కడి నివాసితులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, దుకాణాలు, పారిశ్రామిక భవనాల అద్దెలను ప్రస్తుతానికి పెంచొద్దని ఆదేశాలు జారీ చేసింది. అబుదాబి రియల్ ఎస్టేట్ సెంటర్ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అధికారికంగా ప్రకటించింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారి కాంట్రాక్టులను పునరుద్ధరించుకునే సమయంలో అద్దెను అస్సలు పెంచకూడదు. ఒకవేళ పాత వాళ్లు ఖాళీ చేసి వెళ్లినా ఆ స్థానంలోకి వచ్చే కొత్త వాళ్లకు కూడా పాత అద్దెనే వర్తింపజేయాలి. గతంలో ఏడాదికి గరిష్ఠంగా ఐదు శాతం వరకు పెంచుకునేందుకు యజమానులకు ఉన్న అవకాశాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా రద్దు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసించే ప్రవాస భారతీయులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటను ఇచ్చింది.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయపై విదేశీ టూర్ల బ్యాన్!



**కొలంబో, జూన్ 3:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్షపై శ్రీలంకకోర్టు విదేశీ టూర్‌లపై నిషేధం విధించింది. 2019లో జరిగిన ఈస్టర్ సన్‌డే బాంబింగ్స్‌అరాచకానికి సంబంధించి దర్యాప్తు వేగం అవుతున్నందున ఆనాటి అధ్యక్షుడిపై విదేశీ టూర్లు చేయడానికి ఆంక్షలు విధించింది. రాజపక్ష హయాంలోని ఇంటెలిజెన్స్ చీఫ్ సురేష్ సల్లాయ్‌ను ఫిబ్రవరినుంచే అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులకు వ్యూహరచన చేసింది ఆతడేనన్న అభియోగాలున్నాయి. ఆనాటి దాడుల్లో 279 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆరోపణలను ఐజీచీఫ్ ఖండించారు. కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఇందుకు సంబంధించి రాజపక్షతోపాటు మరో ఇద్దరు మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు దేశం వీడి వెళ్లకుండాచూడాలని ఇమ్మిగ్రేషన్ అధికారులకు కూడా ఆదేశాలిచ్చారు.

## అనుమతుల్లేకుండా జపాన్‌లో పాకిస్థానీల అక్రమ మసీదునిర్మాణం

**టోక్యో, జూన్ 3:** ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జపాన్‌లోని పాకిస్తానీయులు మసీదు నిర్మించడం ఇపుడు పెద్ద వివాదం అయింది. రాజధాని టోక్యో సమీపంలోని కావాగోయ్‌లో నిర్మించిన ఈ మసీదును జపాన్‌లోని పాకిస్థాన్ రాయబారి అబ్దుల్ హమీద్ ప్రారంభించారు. జపాన్ సిటీ ప్లానింగ్ యాక్ట్ ప్రకారం సరైన అనుమతులు పొందకుండానే మసీదును నిర్మించారని అధికారుల తనిఖీల్లో తేలింది. దీంతో ఈ మసీదు కూల్చివేత ముప్పును ఎదుర్కొంటోంది. కావాగోయ్ సిటీలో ఈ మసీదును నిర్మించిన ప్రాంతంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ముందుగానే అనుమతులు పొందాలి, లేకపోతే అక్కడ నిర్మాణాలు చేపట్టడంపై నిషేధం ఉంది. ముందస్తు అనుమతులు తీసుకోకుండా మసీదు నిర్మాణాన్ని చేపట్టారని కవాగోయ్ సిటీ అధికారులు తెలిపారు. దీంతో ఈ భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

## ఖాన్‌సార్ కోచింగ్ సెంటర్‌పై ఆగంతకుల దాడి!



**పాట్నా,జూన్ 3:** దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన ప్రముఖ అధ్యాపకుడు ఖాన్ సర్ కోచింగ్ సెంటర్‌పై మంగళవారం రాత్రి కొందరు దుండగులు దాడికి తెగబడ్డారు. పాట్నాలోని సంస్థలోకి అక్రమంగా చొరబడిన కొందరు వ్యక్తులు అక్కడ ఉన్న గార్డుపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. విపరీతంగా గొడవ చేస్తూ లోపల ఉన్న వస్తువులను, ఆస్తులను ధ్వంసం చేశారు. గాయపడిన సెక్యూరిటీ గార్డు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి జరిగిన విషయం తెలియగానే ఖాన్ సర్ రాత్రి 11:30 గంటల సమయంలో కోచింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. కొందరు సంఘ విద్రోహ శక్తులు లోపలికి వచ్చి గార్డును కొట్టారని, ఆఫీస్ వస్తువులు ధ్వంసం చేశారని చెప్పారు. మొదట అక్కడ కాల్పులు జరిగాయని ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు దాన్ని ఖండించారు. కేవలం తోపులాట, వస్తువుల ధ్వంసం మాత్రమే జరిగాయని స్పష్టం చేశారు.

4-6Pg6exHMNWJQE.qxd:4-6Pg6exHMNWJQE.qxd 1/1/02 6:22 AM Page 1



## 'రాష్ట్ర అభివృద్ధిపై జగన్ విషం చిమ్ముతున్నారు'



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతి, రాష్ట్ర అభివృద్ధిపై వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జగన్ వైఖరి వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేదని, ఆయన రాష్ట్రాన్ని ఎప్పటికీ అభివృద్ధి చేయనివ్వరని విమర్శించారు. రాజధాని విషయంలో స్థిరత్వం లేకపోవడమే వైసిపి సిద్ధాంతమని మంత్రి సవిత దుయ్యబట్టారు. ప్రాంతాన్నీ అభివృద్ధి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. "ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన చేసిన జగన్, ఇప్పుడు మావిగన్ అంటూ మరో మాట మాట్లాడుతున్నారు. నలుగురు కుటుంబ సభ్యులున్న జగన్ కోసం నాలుగు ప్యాలెస్‌లు నిర్మించుకోవచ్చు కానీ, రాష్ట్రంలోని 5 కోట్ల జనాభా కోసం అంతర్జాతీయ స్థాయి రాజధానిని నిర్మించకూడదా?" అని మంత్రి నిలదీశారు "రాజధానిపై రోజుకో మాట, పూటకో ప్రకటన చేయడం జగన్‌కు అలవాటుగా మారింది. గతంలో అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాష్ట్ర రాజధానిగా స్వాగతిస్తున్నామని జగన్ స్వయంగా చెప్పలేదా?" అని మంత్రి సవిత ప్రశ్నించారు. "మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పుకొనే జగన్.. అధికారంలోకి రాగానే మూడు రాజధానుల డ్రామా తెరపైకి తెచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం పాల్జేశారు" అని మంత్రి సవిత మండిపడ్డారు.

## ఏవియేషన్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు

● ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో ఉపాధి పొందిన యువతులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, జూన్ 3 ప్రభాతవార్త:** విమానయాన రంగంలో కూడా మహిళలకు విశేషమైన ఉపాధి అవకశాలు ఉన్నాయని, సరైన రీతిలో శిక్షణ తీసుకుంటే మంచి వేతనాలతో ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అయన స్వగృహంలో ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో శిక్షణ తీసుకుని ఉపాధిని పొందిన అయిదుగురు యువతులు తమ నియామక పత్రాలను రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసిన రామ్మోహన్ నాయుడు. పౌర విమానయాన రంగంలో మహిళలకు ఉపాధి అవకశాలు మెండుగా ఉన్నాయనే అంశానికి ఈ అయిదుగురు యువతులు బ్రాండ్ అంబాసిడర్లుగా పని చెయ్యాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఏవియేషన్‌లో ఉపాధి విప్లవాన్ని అందుబాటులో ఉంచే విధంగా ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమాన్ని రూపొందించారు. రామ్మోహన్ నాయుడు సరిగ్గా ఏడాది క్రితం శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కళాశాలలో ఏవియేషన్ అంశంపై వ్యాసరచన కార్యక్రమాన్ని నిర్వహించి అందులో మొదటి అయిదు స్థానాల్లో నిలచిన యువతులకు ఏవియేషన్ రంగంలోని పలు విభాగాల్లో శిక్షణను హైదరాబాద్‌లో ఇప్పించారు.
ఏవియేషన్ రంగంలోని టికెటింగ్, కస్టమ్స్, కార్గో, క్యాబిన్ క్రూ, ఇతర విభాగాల్లో పూర్తి స్థాయి శిక్షణను అందించారు. ఈ శిక్షణను అయ్యే ఖర్చును కూడా ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తూ పూర్తి స్థాయిలో వారిని ఉద్యోగాలను సిద్ధం చేశారు. ఏవియేషన్‌లోని పలు విభాగాల్లో పూర్తి స్థాయి తర్ఫీదు అనంతరం ఉద్యోగాలను సంపాదించిన ఆ అయిదుగురు యువతులు మంగళవారం నాడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో అయన స్వగృహంలో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎంపిక సమయం నుండి శిక్షణ, ఉద్యోగం పొందే వరకు ఎదురైన అనుభవాలను వారిని అడిగి తెలుసుకున్నారు.
శ్రీకాకుళం ప్రతిభను చాటారంటూ మెచ్చుకుంటూనే భవిష్యత్‌లో ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలని కోరారు. మహిళలు ఏవియేషన్ విభాగంలో అనేక ఉపాధి అవకశాలు సిద్దంగా ఉన్నాయని, ఆ దిశగా అందరు అవగాహన తెచ్చుకుని తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రామ్మోహన్ నాయుడు కోరారు. కాగా ఉద్యోగాలు పొందిన అయిదుగురు యువతులు త్వరలోనే హైదరాబాద్ కేంద్రంగా తమ విధులను నిర్వర్తించనున్నారు.



## రోడ్డు ప్రమాదంలో బయటపడ్డ అక్రమ గంజాయి రవాణా

● బ్రేక్ డౌన్ అయిన వాహనాన్ని ఢీకొన్న బైకర్ మృతి

**ఒంగోలు (క్రైమ్), జూన్ 3 ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని దాసరాజుపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం గంజాయి అక్రమ రవాణా గుట్టును రట్టుచేసింది. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఏకంగా ఐదు క్వింటాళ్ల గంజాయి లభించడం కలకలం రేపింది. విశాఖపట్నం నుంచి తమిళనాడుకు తరలిస్తున్న గంజాయిని లారీలో తవుడు బస్తాల కింద అత్యంత రహస్యంగా దాచిపెట్టి రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, గంజాయి తరలిస్తున్న లారీ సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయింది. అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లోకేష్ అనే యువకుడు నిలిచివున్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పరిశీలించే సమయంలో అనుమానాస్పద పరిస్థితులు కనిపించాయి. లారీలో ఉన్న తవుడు బస్తాలను తనిఖీ చేయగా వాటి కింద భారీ మొత్తంలో గంజాయి ప్యాకెట్లు దాచిపెట్టినట్లు బయటపడింది. దీంతో పోలీసులు వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రమాదం కారణంగా అక్రమ సరుకు బయటపడుతుందనే భయంతో లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరో కీలక విషయం కూడా వెలుగులోకి వచ్చింది. గత వారం రోజులుగా తమిళనాడు పోలీసులు ఈ లారీ కదలికలను జిపిఎస్ ద్వారా గమనిస్తున్నట్లు తెలిసింది. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం ఉండటంతో వాహనాన్ని ట్రాక్ చేస్తున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో అక్రమ రవాణా గుట్టు బయటపడింది. ఒంగోలు పోలీసులు, తమిళనాడు పోలీసులు సంయుక్తంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి సరఫరా ముఠా, నిర్వాహకులు, రవాణా మార్గాలు, ఈ వ్యవహారంలో పాల్గొన్న ఇతర వ్యక్తుల వివరాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. స్వాధీనం చేసుకున్న ఐదు క్వింటాళ్ల గంజాయి విలువ లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ ఘటన స్థలాన్ని ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఒంగోలు తాలూకా సిఐ టి విజయ్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేర్ని నోరు అదుపులో ఉంచుకో

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

● దమ్ముంటే గన్నవరంలో పోటీచేయాలని సవాల్



**గన్నవరం(కృష్ణా), జూన్ 3 ప్రభాతవార్త:** గత కొంతకాలంగా అవాకులు చవాకులు పేలుతున్న మాజీమంత్రి పేర్ని నాని తన నోటిని అదుపులో ఉంచుకోవాలని, మంచితనాన్ని చేతగాని తనంగా భావిస్తే తగిన శాస్తి జరుగుతుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ హెచ్చరించారు. బుధవారం పెనమలూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గన్నవరం, గుడివాడ ఎమ్మెల్యేలు దివాళా తీసారంటూ పేర్ని నాని వ్యాఖ్యలు చేయటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. తాను వందల కోట్ల పన్నులు చెల్లించేస్థాయిలో ఉన్నానని మైనేటా వెబ్‌సైట్‌లో తన ఆస్తుల వివరాలు పరిశీలించుకోవచ్చన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఎన్నికల్లో పోటీచేసేందుకు డబ్బులు లేవన్న పేర్నికి ఇప్పుడు ఇంత సంపద ఎలా వచ్చిందని సూటిగా ప్రశ్నించారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా దోచుకుని కోట్లు కూడబెట్టావని ఆరోపించారు. గుడివాడ, గన ్నవరం అభ్యర్థులను మారుస్తున్నారంటూ చంద్రబాబు నీకు చెప్పాడా అని ప్రశ్నించారు. నోటికి వచ్చినట్లు వాగటం సరికాదని హితవు పలికారు. నీలాగా ప్రజల సొమ్ముతో, అక్రమ సంపాదనతో ఎన్నికల్లో పోటీచేయలేదని కష్టార్జితం ఖర్చుచేసి ఎన్నికల్లో పోటీచేస్తే ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారని యార్లగడ్డ వివరించారు. రాజకీయాల నుండి రిటైర్ అయిపోయానని ప్రకటించిన నాని ఇప్పుడు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నాడని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుండి తానే టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తానని, దమ్ముంటే తనపై పోటీకి సిద్ధం కావాలని పేర్నికి సవాల్ విసిరారు. బ్రిటీష్ హయాంలో అభివృద్ధి చెందిన బందరును నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేసావని ప్రశ్నించారు. మీవల్లే జగన్‌కు 11సీట్లకు పరిమితమయ్యారని, ఇలాగే వాగుతుంటే ఈసారి అవి కూడా రావని యార్లగడ్డ వెంకట్రావ్ ఎద్దేవా చేసారు.

## పరిశ్రమలకు విద్యుత్ సమస్యలను రానివ్వొద్దు

● సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు విద్యుత్ సమస్యలను రానివ్వకూడదని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి అధికారులు, సిబ్బందికి సూచించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎస్‌పిడిసిఎల్ సంస్థ పరిధిలో శివశంకర్ లోతేటి బుధవారం వినియోగదారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యల పరిష్కారానికై ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎపి ఎస్‌పిడిసిఎల్ అవకాశం కల్పిస్తోంది. ఎపి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 10 మంది పారిశ్రామిక వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయడం ద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఎస్‌పిడిసిఎల్ కృషి చేస్తోందని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సంస్థ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. చిత్తూరు సమీపంలోని గంగ్రాజుపల్లి పారిశ్రామికవాడ నుంచి అల్లూరయ్య మాట్లాడుతూ తమకు దగ్గరలో సబ్‌స్టేషన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలియజేయగా ఈ అంశంపై సిఎండి స్పందిస్తూ గంగ్రాజుపల్లె పారిశ్రామికవాడకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశామని, నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు యం.ఉమాపతి, ఎం.మురళి కుమార్, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం శ్రీవారి దర్శనం నిమిత్తం తిరుమలకు విచ్చేశారు. దర్శనానికి వెళ్తున్న క్రమంలో పిఎసి-3 సమీపంలో తమ బ్యాగును అనుకోకుండా మరిచి పోయారు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జి.వి. రావు ఆ బ్యాగును గుర్తించి పరిశీలించగా, అందులో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు సుమారు 30 గ్రాముల విలువైన సుమారు రూ.4.50 లక్షలు చేసే బంగారు తాళిబొట్టు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బ్యాగులో లభించిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించి, వారిని సంప్రదించి బ్యాగును సురక్షి తంగా వారికి అప్పగించారు. తమ విలువైన వస్తువులు తిరిగి లభించినందుకు సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జి.వి.రావుకి, అలాగే తిరుమల ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పకడ్బందీగా ఎస్ఐఆర్ నిర్వహించండి

● జిల్లా కలెక్టర్లకు సిఎస్, ఎస్ఇసి దిశానిర్దేశం

**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** బుధవారం అమరావతి సచివాలయం నుండి ఓటరు జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించగా తిరుపతి జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు మరియు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా వివరాల ను కచ్చితంగా డూప్లికేట్ నమోదు గుర్తింపు, చిరునామా మార్పులు, చేర్పులు మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్లి సర్వే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన చేపట్టి ఓటరు జాబితాల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ఎస్వీ ప్రాచ్య కళాశాలలో ప్రవేశాల సందడి

● సంస్కృతం, తెలుగు, హిందీ, టూరిజం కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. భారతీయ సంస్కృతి, సాహిత్యం, భాషా వైభవాన్ని అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఇది ఒక సువర్ణావకాశమని కళాశాల యాజమాన్యం తెలిపింది. బి.ఏ. (ఓ.ఎల్.) డిగ్రీ కోర్సులో తెలుగు, సంస్కృతం, హిందీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాలలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చు. అలాగే ప్రీడిగ్రీ (ఇంటర్ మీడియట్‌కు సమానం) కోర్సులో సంస్కృతం, తెలుగు, హిందీ విభాగాలలో కూడా అడ్మిషన్లు జరగనున్నాయి. ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించబడుతుంది. అదనంగా ఉచిత భోజన వసతి కూడా అందుబాటులో ఉంటుంది.
**అర్హతలు:** రెండేళ్ల ప్రీడిగ్రీ కోర్సులకు 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు అర్హులు. మూడేళ్ల డిగ్రీ కోర్సులకు 21 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, ప్రీ డిగ్రీ, ఇంటర్‌మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 17, 2026 నుండి సంబంధిత విద్యార్హతల ధ్రువపత్రాలతో కళాశాలలో నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. కె.టి. రోడ్డులోని ఎస్వీ ప్రాచ్య కళాశాల కార్యాలయంలో 25 రూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారాలు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 31, 2026 లోపు సమర్పించాలి. మరిన్ని వివరాలకు 98486 42346, 62818 94208 నంబర్లలో సంప్రదించవచ్చని వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల అధికారులు తెలిపారు.

## ఢిల్లీలో అగ్ని ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీలో ఓ రెస్టారెంట్ జరిగిన ఘోర అగ్ని ప్రమాద ఘటనపై వైసిపి అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఏకంగా 21 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం కారణంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. అగ్నిప్రమాద బాధితుల్లో విదేశీయులు ఉన్నట్లు వస్తున్న వార్తలు మరింత కలచివేస్తున్నాయని జగన్ తెలిపారు.

## బయోడీగ్రేడబుల్ ఉత్పత్తులను వినియోగించాలి

● స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



చాంబర్‌ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు బయోడీగ్రేడబుల్ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేసారు. విజయవాడ బందరురోడ్‌లోని ఛాంబర్‌ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ప్రోత్సహించటం, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయటం, ప్రజలో ్ల అవగాహన పెంచటం, హరిత ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఇలకు అవకాశాల సృష్టించటం వంటి అంశాలపై చర్చలు జరిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఛాంబర్‌ఆఫ్ కామర్స్‌లోని 40వేల మంది వ్యాపారులు ప్రతిరోజూ ఏదోక రూపంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను వినియోగించాలని పట్టాభి ఈసందర్భంగా సూచించారు. బయోడీగ్రేడబుల్ ఉత్పత్తుల తయారీదారులకు ముడిసరుకును స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా సరఫరా చేస్తామని, ఉత్పత్తుల మార్కెటింగ్ బాద్యతను మెప్మా, సెర్ప్ ద్వారా డ్వాక్రా గ్రూప్‌లు, మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలపడే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం అనే బ్రాండ్‌పేరుతో ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించనున్నట్లు ఆయన వివరించారు. ఛాంబర్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ స్వయం ప్రాజెక్టుతోపాటు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చేపట్టే ఇతర కార్యక్రమాలకు ఛాంబర్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, మెప్మా యండి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తా



**బుచ్చి (నెల్లూరు), జూన్ 3, ప్రభాతవార్త:** దాతల సహకారంతో కూరగాయాల మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి వాటిని పరిష్కరించుకుందాం అని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూరగాయాల మార్కెట్ వ్యాపారస్తులకు నచ్చచెప్పారు. బుధవారం కూరగాయాల మార్కెట్‌ను పరిశీలించిన సందర్భంగా ఆమె వ్యాపారస్తులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒక్కరూం కూడా కిటికిలు లేవు.. అసలు గాలి ఆడడం లేదు.. కొద్ది మందికి మాత్రమే వ్యాపారాలు జరుగుతున్నాయి మిగిలిన వారికి జరగడం లేదు.. గతంలో మార్కెట్‌లోకి రాకముందే బాగున్నింది అని ఎమ్మెల్యే ముందు కూరగాయాలు అమ్ముకునే మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, కమీషనర్ చిన్నబాబు, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, సీనియర్ నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హారికృష్ణా, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలపక్షాన నిలబడితే అరెస్టులా!

● వైసిపి నేతల నిరసనను అడ్డుకున్న పోలీసులు



**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** యేళ్ళతరబడి అలిపిరి వద్ద పలు రకాలుగా తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదవారిని తొలగించి అరకు కాఫీ దుకాణానికి అనుమతించడం పట్ల వైసిపి తీవ్ర వ్యతిరేకత తెలిపింది. పేదలపక్షాన నిలబడి వారికి న్యాయం చేయడానికి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో బుధవారం అలిపిరి వద్దకు చేరుకున్నారు. తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నాయకులు పసుపులేటి సురేష్, వాసు యాదవ్, దినేశ్‌రాయల్, ఉదయ్‌వంశీ, సాయి రాకేశ్, ఇమ్రాన్, దినేశ్, అనిల్, రాజేశ్, అజయ్, మహి, మహిళలు అలిపిరి వద్ద ధర్నాకు దిగారు. పేదవారిని అక్కడ నుండి తొలగించి వారి కడుపులు కొట్టారని ఆరోపించారు. పేదవారి స్థలాలను నిర్వీర్యంచేసి ఆ చోట అరకుకాఫీ పెట్టాలని చూడటం ఓ కూటమిపార్టీ టిడిపి శాప్స్ చైర్మన్ రవినాయుడుకు వత్తాసు పలకడమేనని ఆరోపించారు. కూటమి నేతల అప్రజాస్వామ్యం చర్యలు పై భూమన అభినయ్ రెడ్డి నేతృత్వంలో అలిపిరి జూపార్క్ రోడ్ వ్యాపారులకు మద్దతుగా క్షేత్ర స్థాయిలో నిరసనకు దిగారు. అయితే తిరుపతిలో పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్నందున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. అక్కడ ఎలాంటి నిరసనలు చేయరాదని వైసిపి నేత అభినయ్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, సురేశ్ తదితరులకు నోటీసులు ఇచ్చారు. అప్పటికీ అక్కడ పరిస్థితి చేయితప్పడంతో పోలీసులు బలవంతంగా వైసిపి నేతలను అరెస్ట్ చేశారు. వారందరినీ అలిపిరి పోలీస్ స్టేషన్ కు,ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ నుంచి భూమన అభినయ్ రెడ్డికి 41 ఏ నోటీసులు ఇచ్చి పంపించారు. అలిపిరి జూపార్క్ రోడ్‌లో తొలగించిన చిరు వ్యాపారులకు అదే ప్రాంతంలో కొనసాగించాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు.

## ప్రజలతో మమేకమై ముందుకు సాగాలి

● కూటమినేతలతో కలసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి: బిజెపి చీఫ్ మాధవ్




**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు బిజెపి నాయకులు ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సూచించారు. అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం తిరుపతికి విచ్చేసిన ఆయనకు తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. మదనపల్లి నుండి తిరుపతి బైరగిపట్టేడలోని బిజెపి కార్యాలయంకి విచ్చేశారు. ఆయనకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మాధవ్ వారితో మాట్లాడుతూ 12యేళ్ల మోడీ సుపరిపాలన ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సామాజిక సంక్షేమం వరకు అన్ని రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని మాధవ్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం పలికిన వారిలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, బిజెపి సెంట్రల్ మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరప్రసాద్, బిజెపి నాయకులు పురుషోత్తం నాయుడు, నరేష్ కుమార్ రెడ్డి, బాబు, మల్లారపు రవి, ప్రసాద్, వేదవతి రాయల్, తేజోవతి, డాక్టర్ శ్రీధర్ ముని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు కోమటిగుంట్ల శివని పరామర్శించిన మేకపాటి శాంతికుమారి

**నెల్లూరు, జూన్ 3 ప్రభాతవార్త-వైద్యం:** ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలంలో ఉన్న పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు కోమటిగుంట్ల శివని నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కోమటిగుంట్ల శివకు చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయంను చెక్కు అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలం, పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోమటిగుంట్ల శివ కందుకూరులో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఆంధ్ర విద్యార్థి సంఘం ఒంగోలు జిల్లా అధ్యక్షులుగా పని చేస్తున్నారు. శనివారం జరిగిన కత్తి దాడిలో తీవ్ర గాయాలకు గురై ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.
ఈ విషయం తెలుసుకున్న ఆమె శివని పరామర్శించి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి 2 లక్షలు రూపాయలు చెక్కు అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లవరపు అశోక్ రెడ్డి, ఒంగోలు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, విద్యార్థి నాయకులు మోహన్, నాయబ్, బాలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

## భారీ వర్షాలకు కొట్టుకుపోయిన శారదా నది గట్లు -ఆందోళనలో ప్రజలు



**ఎలమంచిలి, జూన్ 03, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి నియోజకవర్గంలోని కీలక సమస్యలపై చర్చించి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ప్రధానంగా రెండు సంవత్సరములుగా రాంబిల్లి మండలంలో శారదా నది దిగువ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనలో జీవిస్తున్నారని, గత భారీ వర్షాలకు శారదా నది గట్లు కొట్టుకుపోవడంతో రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో నన్ను భయం మధ్య ప్రజలు జీవిస్తున్నారని వివరించారు. ఈ వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి శారదా నది గట్టులు బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుని పనులను త్వరత గతిన చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలియజేశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలియజేశారు.

# రేపు విశాఖ జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

**విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేది ఉండవల్లి నుండి బయలుదేరి ఉదయం 10.50 గంటలకు వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు. అనంతరం ప్రజాప్రతినిధులను, అధికారులను కలుసుకుంటారు. ఉదయం 11 గంటలకు నోవోటేల్‌లో సముద్రపు ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై జరిగే నేషనల్ వర్క్ షాప్ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ ఎకనామిక్ రీజియన్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం విశాఖపట్నం నుండి బయలుదేరి వాయు మార్గం ద్వారా ఉండవల్లి చేరుకుంటారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్టణం, జూన్ 03 ప్రభాతవార్త**




ఈ నెల 05, 08వ తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్ర పర్యట నకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన సీపీ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. 05వ తేదీన నోవాటెల్ వేదికగా సముద్ర ఆహార ఎగుమతులపై జరిగే నేషనల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొంటారని, అనంతరం సాయంత్రం విశాఖ ఎకనామిక్ రీజియన్(వీఈఆర్)పై సమీక్షిస్తారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఆ రోజు ఉదయం తాడేపల్లి నుంచి నేరుగా బీచ్ రోడ్లోని కోస్టల్ బ్యాటరీ వద్దనున్న హెలీప్యాడ్ కు చేరుకుంటారని, అక్కడ నుంచి నోవాటెల్ లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అలాగే 08వ తేదీన ముఖ్యమంత్రి తాడేపల్లి నుంచి రుషికొండ హెలీప్యాడ్ కు చేరుకుంటారని, అక్కడ నుంచి ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని విద్యుత్ శాఖ సీవోఈఈటీ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్) భవనానికి రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారని చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడ జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. భోజనం అనంతరం రుషికొండ హెలీప్యాడ్ నుంచి తర్లువాడ చేరుకొని అక్కడ గూగుల్ డేటా సెంటర్ సమీపంలో జరిగే ఎపిస్ టెక్నాలజీస్ సెమికండక్టర్ యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతారని వివరించారు. అక్కడి కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి తర్లువాడ నుంచి లేదా ఎయిర్ పోర్టు నుంచి తాడేపల్లి చేరుకుంటారని స్పష్టం చేశారు. కావున ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికార ప్రతినిధులు సమన్వయం వహించుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రతా పరమైన ఏర్పాట్లను పర్యవేక్షించవల్సిందిగా పోలీసు అధికారులకు సూచించారు. డెలిగేట్, వీఐపీ, డ్యూటీ పాసుల జారీకి సంబంధించిన ప్రక్రియలను చూడాల్సిందిగా జేసీ, డీఆర్వోలకు చెప్పారు. ఎయిర్ పోర్టు, రైల్వే స్టేషన్ల వద్ద హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఎన్.ఎఫ్.డి.సి. సీఈవో విజయ్ కుమార్, డీసీపీలు లతామాధురి, మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో శేషశైలజ, ఎపిస్ టెక్నాలజీ, ఎంపెడా, మత్స్యశాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం పోర్ట్‌లో ఎస్టీ రిజర్వేషన్ విధానం అమలుపై ఎన్‌సీఎస్టీ సమీక్ష




**విశాఖపట్నం-ప్రభాతవార్త**

షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు సంబంధించిన రిజర్వేషన్ విధానం అమలు, రక్షణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలపై విశాఖ పట్నం పోర్ట్ అథారిటీలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (ఎన్‌సీఎస్టీ) గౌరవ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా, కమిషన్ గౌరవ సభ్యులు పోర్ట్ అధికారులతో విజయవాడలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ ట్రైబ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు రిజర్వేషన్ విధానం సమర్థవంతమైన అమలుకు పోర్ట్ చేపడుతున్న చర్యలు, కార్యక్రమాలపై పోర్ట్ అధికారులు ప్రెసెంటేషన్ ద్వారా కమిషన్‌కు వివరించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఛైర్మన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఐఆర్టీఎస్, కార్యదర్శి ఎం.శంకర్‌బాబు, ఎస్సీ/ఎస్టీ అధికారుల, ఉద్యోగుల సంక్షేమ 8వ పేజీలో

# ఆనందపురం హైవే పై రోడ్డు ప్రమాదం






## ఆగిన్న వాహనాలను ఢీకొన్న మరో వాహనం -డాన్స్ మాస్టర్ పండుకు తీవ్ర గాయాలు

8లో

# అధునాతన సదుపాయాలతో లే అవుట్లు అభివృద్ధి



**విశాఖపట్నం-ప్రభాతవార్త**

విఎంఆర్‌డిఎ ద్వారా అధునాతన సదుపాయాలతో కూడిన లే అవుట్ల అభివృద్ధి చేయటానికి సిద్ధంగా ఉన్నామని, అందుకు భూములు ఇచ్చిన 161 మంది రైతులకు అండగా ఉంటామని విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం సమావేశ మందిరంలో రామవరం, జిఎస్ అగ్రహారం లే అవుట్లకి సంబంధించి రైతులతో, విఎంఆర్‌డిఎ ఇంజనీరింగ్, ప్రణాళిక, ఎస్టేట్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు లే అవుట్లను విఎంఆర్‌డిఎ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అభివృద్ధి చేయాలని నిర్ణయించటం జరిగింద న్నారు. లే అవుట్ వద్దకు చేరుకునేలా అవసరాన్ని బట్టి 100 అడుగుల రహదారుల నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా లే అవుట్ ల్లో పార్క్, ఆర్చి(ప్రవేశ ద్వారం), చిల్డ్రన్ ప్లే ఏరియా వంటి వాటితో పాటు అధునాతన సదుపాయాలతో మోడల్ లే అవుట్‌గా అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా రైతులకు కేటాయించాల్సిన ప్లాట్‌లను కూడా త్వరితగతిన ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగ అధికారుల సమన్వయంతో పని అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాటికి లే అవుట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి దివ్య లత, ఓఎస్‌డి కృష్ణా నాయక్, డిఎఫ్ఓ శిరీష, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, రామవరం, జిఎస్ అగ్రహారంలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# ఉపమాక క్షేత్రంలో భారీ దొంగతనం

## దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు -నిందితులను పట్టుకుంటాం: డిఎస్పీ శ్రీనివాస్





8లో

# ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026కు దరఖాస్తుల ఆహ్వానం

8లో

## విమ్స్ డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ శ్రేణులు



ఆరిలోవ, జూన్ 3, ప్రభాతవార్త

విమ్స్ డైరెక్టర్‌గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మన్మధరావును బుధవారం స్థానిక టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 9వ వార్డ్ ఇంచార్జి బుడుమూరి గోవింద్ డైరెక్టర్‌తో మాట్లాడి స్థానికులకు మెరుగైన వైద్యం అందించి హాస్పిటల్ ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ ప్రధాన కార్యదర్శి బాదరు బాలరాజు, 12 వ వార్డ్ ప్రధాన కార్యదర్శి పోతిన భరత్, రాయి అప్పాజీ, బొట్ట శ్రీను, పైసాక సుధాకర్, గన్రెడ్డి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సాంకేతిక పద్ధతిలో కేర్‌లో గుండె శస్త్ర చికిత్సలు

ఆరిలోవ, జూన్ 3, ప్రభాతవార్త



ఆరిలోవ హెల్త్ సిటీ ప్రాంగణంలో ఉన్న కేర్ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలో అత్యాధునిక పద్ధతిలో సక్లిష్ట మినిమిల్లి ఇన్వెసివ్ అడ్వాన్స్ కార్డియాలజీగా కేర్ ఆస్పత్రి గుర్తింపు పొందిందని డాక్టర్ భరత్ కుమార్ మోహన్ దాస్ అన్నారు. తీవ్రమైన గుండె రక్తనాళాలు బ్లాకేజీలు స్ట్రోక్ ప్రమాదం ఉన్న హైరిస్క్ గుండె రోగులకు శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. తక్కువ సమయంలో, తక్కువ రోజుల్లో కోల్కొని త్వరగా నడవడం ఆసుపత్రిలో తక్కువ సమయం కేటాయించడం మినీ మల్లి ఇన్వెసివ్ సర్జరీ యొక్క ప్రత్యేకత అని తెలిపారు. ఉత్తరాంధ్రలోనే అడ్వాన్స్ కార్డియాక్ కేర్ సెంటర్‌లో మరోసారి తన సామర్థ్యాన్ని చాటు కుందన్నారు. నగరానికి చెందిన 64 ఏళ్ల వ్యక్తికి అత్యంత సంక్లిష్టమైన మల్టీవెసెల్ మినిమల్లి ఇన్వెసివ్ కరోనరీ ఆటరి బైపాస్ గ్రాఫింగ్ శాస్త్ర చికిత్సలు విజయవంతం చేశారు. అదేవిధంగా ఏలూరికి చెందిన వృద్ధ హైరిస్కు గుండె రోగికి కూడా అనేక ఇతర ఆరోగ్య సమస్యలు తీవ్రమైన శాస్త్ర చికిత్స ప్రమాదం ఉన్నప్పటికీ అత్యాధునిక మిమ్మల్ని ఇన్వెస్ట్ యు గుండె సస్త్ర చికిత్స ద్వారా విజయవంతమైన చికిత్స అందించారు. ఈ సమావేశంలో డాక్టర్ భరత్ కుమార్ మోహన్ దాస్ మాట్లాడుతూ ఈ రెండు కేసులు అత్యంత ఇష్టమైన వలె గుండె సమస్యలతో పాటు స్ట్రోక్ ప్రమాదం, గుండె పనితీరు తగ్గిపోవడం వంటి అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. అత్యాధునిక సర్జికల్ ప్లానింగ్ ఖచ్చితత్వం, మినిమల్లి ఇన్వెసీవ్ టెక్నాలజీ సహాయంతో విజయవంతమైన ఫలితాలు సాధించగలిగామన్నారు. ఈ సమావేశంలో కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి సుఖేష్ రెడ్డి తో పాటు ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## భావితరాలకు సారవంతమైన నేలే సంపద

### రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి - శాస్త్రవేత్తల పిలుపు



ఆనందపురం, జూన్ 3, ప్రభాతవార్త

భారత ప్రభుత్వ "నా గ్రామము నాకు గొప్ప", "ఖేత్ బచ్చావో అభియాన్" కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆనందపురం మండలం బోని గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.ఎస్. రాజు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సారవంతమైన నేలను అందించాలంటే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించడం ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే సముద్ర నాచు (కప్పాఫైకస్), స్పైరులినా ఆధారిత ద్రావణాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. దీంతో నేల భౌతిక, రసాయనిక లక్షణాలు సంరక్షించబడటంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు ముక్త, శేఖర్ మేఘరాజన్, ప్రళయ రంజన్ బెహరా, కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త కిషోర్ కుమార్, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి బి.స్వాతి, గ్రామ వ్యవసాయ సహకారురాలు జి. రాజేశ్వరి పాల్గొని రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోని మాజీ సర్పంచ్ సూరాల సత్య వరప్రసాద్, గ్రామానికి చెందిన సుమారు 50 మంది రైతులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలను ఆసక్తిగా తెలుసుకున్నారు. రైతులు భూసార పరిరక్షణకు సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## మోహిని థియేటర్లో 'పెద్ది' సంబరాలు

### ఘనంగా రామ్ చరణ్ చిత్ర విడుదల వేడుకలు -హాజరైన బీజేపీ, జనసేన నాయకులు

గాజువాక, జూన్ 3,ప్రభాతవార్త




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ చిత్రం 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సందర్భంగా గాజువాకలో అభిమానుల కోలాహలం అంబరాన్ని తాకింది. గాజువాక రామ్ చరణ్ ఫ్యాన్స్ యువసేన ఆధ్వర్యంలో స్థానిక మోహిని థియేటర్ వద్ద గురువారం భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మెగాస్టార్, పవర్ స్టార్, మెగా పవర్ స్టార్ అభిమానులు సంయుక్తంగా పాల్గొని సందడి చేశారు. బాణసంచా కాలుస్తూ, కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ నరసింహారావు, మోహిని థియేటర్ యాజమాని చిన్ని, జనసేన పార్టీ 58వ వార్డు అధ్యక్షుడు ఎం. ధర్మేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డు గ్రహీత రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర యూనిట్‌కు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో జనసేన నాయకురాలు లంక లత, బీజేపీ కార్యకర్త రాపేడు సునీల్ కుమార్, రామ్ చరణ్ ఫ్యాన్స్ ప్రతినిధులు ఎం. కిషోర్, అరవింద్, శ్రీను, శేఖర్, సంతోష్ కుమార్, గణేష్, సాయి చరణ్, అనిల్, మంజునాథ్, సాయినాథ్, సుబ్బు, చైతు, కుమార్, రాజు తదితర అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెదగంట్యాడలో ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య!

### -ప్రేమ వ్యవహారమే కారణమా? -దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గాజువాక,జూన్ 3,ప్రభాతవార్త



పెదగంట్యాడ పరిధిలోని విజయనగర్‌లో మంగళ వారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగర్‌కు చెందిన రంగి మనోహర్ (18) అనే యువకుడు కాకతీయ ఐటీఐలో ద్వితీయ సంవత్సరం చదువు తున్నాడు. మంగళవారం రాత్రి మనోహర్ తన గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు పిలిచారు. లోపలి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందిన వారు తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ మనోహర్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


**ప్రేమ వ్యవహారమేనా..?**

మనోహర్ ఆత్మహత్యకు గల కారణాలపై స్పష్టత రానప్పటికీ, ప్రేమ వ్యవహారం లేదా మరేదైనా వ్యక్తిగత సమస్యల వల్లనే మనస్తాపానికి గురై ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఈ-సైకిల్ ఎక్కిన డీఆర్ఎం లలిత్ బోహ్రా

### -పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త



విశాఖపట్నం రైల్వే డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా పర్యావరణ హిత జీవనశైలికి ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శంగా నిలిచారు. బుధవారం తన నివాసం నుంచి డివిజనల్ కార్యాలయం వరకు ఈ-సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీఆర్ఎం లలిత్ బోహ్రా, వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ హిత పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే చర్యల్లో భాగస్వాములు కావాలని రైల్వే ఉద్యోగులు, అధికారులకు సూచించారు. సైక్లింగ్, ఈ-వాహనాల వినియోగం వంటి చిన్న మార్పులు కూడా పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ముందు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా విశాఖపట్నం రైల్వే డివిజన్ సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను చాటిందని తెలిపారు.

## అమరావతిలో అమరజీవికి పవన్ ఘన నివాళి



విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని శాఖమూరులో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆయనతో కలిసి పాల్గొన్నారు. స్మృతి వనంలో ఏర్పాటు చేసిన 58 అడుగుల ఎత్తైన అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహానికి పవన్ కళ్యాణ్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. సేనా గళం కమిటీకి చెందిన 16 మంది సభ్యులతో కలిసి ఆయన అమరజీవి త్యాగాలను స్మరించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని అమరజీవి స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు జాతికి మార్గదర్శకమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జీవీఎంసీ ఈస్ట్, భీమిలి జోన్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

### -పారిశుధ్య విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరిక

విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త



పారిశుధ్య విధుల నిర్వహణలో లోపాలు ఉంటే సహించేది లేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, పారిశుధ్య కార్మికుల నుండి ప్రజారోగ్య అధికారుల వరకు నిత్యం చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధి లక్ష్యంగా పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఈస్ట్ జోన్, భీమిలి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య విధుల నిర్వహణపై ఆకస్మిక పర్యటన నిర్వహించారు. కమిషనర్ ముందుగా ఈస్ట్ జోన్ 19వ వార్డు పరిధిలోని లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డు పరిసర ప్రాంతలు, భీమిలి జోన్ 3వ వార్డు పరిధిలోని గంటస్తంభం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించి బీచ్ రోడ్డు పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, పర్యాటకులు ఎక్కువగా వచ్చే ప్రాంతం కాబట్టి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని అధికారులను ఆదేశించారు. నిత్యం కాలువల పరిశుభ్రత, చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను అడిగి ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు ఉదయాన్నే ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ, తరలింపు,వీధులు, రోడ్ల పరిశుభ్రత పక్కాగా శత శాతం జరగాలని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు పనుల్లో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదని, విధులకు గైర్హాజరయ్యే వారిపై మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం నిఘా ఉంచాలని ,నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య సిబ్బంది,అధికారుల పాత్ర కీలకమన్నారు.భీమిలి జోనల్ కమిషనర్ విజయ్ కుమార్ ను, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఈస్ట్, భీమిలి జోనల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వార్డు సచివాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్



విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 5న విశాఖలో పర్యటించనున్న సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం రాత్రి పలు ఏర్పాట్లను నావెల్ కమాండర్ మనోజ్ కుమార్ , జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, సౌత్ జోన్ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో నేవెల్ కోస్టల్ బ్యాటరీ పరిసర ప్రాంతంలో హెలిపాడ్ ప్రాంతాన్ని, సమీపంలో చేపట్టవలసిన పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనలు ప్రాంతాల్లో రోడ్ల పరిశుభ్రత, పచ్చదనం, పారిశుధ్య విధులు తదితర పనులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అదనప కమిషనర్ నల్లనయ్యకు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడుకు కమిషనర్ ఆదేశించారు. బీచ్ ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశాలు ఉన్నందున మరింత జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నేవల్ కమాండర్ మనోజ్ కుమార్ తో మాట్లాడుతూ హెలిపాడ్ ప్రాంతంలో చేపట్టవలసిన జాగ్రత్తలపై కమిషనర్ చర్చించి వివరాలను అడిగి తెలుసుకున్నారు

## విశాఖపట్నం పోర్ట్‌లో ఎస్టీ రిజర్వేషన్ విధానం అమలుపై ఎన్‌సీఎస్టీ సమీక్ష

7వ పేజీ తరువాయి ..

సంఘాల ప్రతినిధులు ఉమా మహేశ్వరరావు, దేవేశ్వరరావు, రామకృష్ణ, ఓ.రామలింగం, లైజన్ అధికారి బి.సాంబమూర్తి సమావేశంలో పాల్గొని, రిజర్వేషన్ విధానం అమలు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ సంక్షేమానికి సంబంధించి పోర్ట్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్టీ గౌరవ ఛైర్మన్, సభ్యులు, ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారం, సంక్షేమ చర్యలు మరియు రిజర్వేషన్ విధానం అమలులో పోర్ట్‌తో పాటు ఎస్సీ/ఎస్టీ సంక్షేమ సంఘాలు చేస్తున్న కృషిని అభినందించారు. షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు సంబంధించిన రిజర్వేషన్ విధానం అమలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పారదర్శకత, భారత ప్రభుత్వ మార్గదర్శకాల అమలులో పోర్ట్ చేపడుతున్న కార్యక్రమాలు పోర్ట్ నిబద్ధతకు అద్దంపడుతున్నాయి.

## ఉపమాక క్షేత్రంలో భారీ దొంగతనం




(నక్కపల్లి, ప్రభాతవార్త)

కోస్తాంధ్రలో అతి పురాతనమై నక్కపల్లి మండలం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి సమయం లో భారీ దొంగతనం జరిగింది. పాయకరావుపేట నియోజక వర్గంలో టీటీడీ అనుబంధ దేవాలయంగా ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయం నడుస్తుంది. సీసీ కెమెరాల, టీటీడీ విజిలెన్స్ విభాగం సెక్యూరిటీ సిబ్బంది వుండగానే అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి ప్రవేశించి విద్యుత్ కట్టర్లతో హుండీలను పగులగొట్టి నగలు, నగదు పట్టుకుపోయారు. సుమారు రూ. 5 లక్షలు నగదు పోయివుంటుందని భావిస్తున్నారు.బుధవారం ఉదయం ఆలయం లోపలికి వెళ్లిన సెక్యూరిటీ సిబ్బంది హుండీలు తెరచి వుండడం, కొంత చిల్లర డబ్బులు చిందరవందరగా పడివుండడాన్ని చూసి ఆలయ అధికారులు, అర్చకులకు సమాచారం అందజేశారు. ఆలయ అధికారులు జరిగిన చోరీపై పోలీసులకు సమాచారం అందజేశారు. స్పందించిన సీఐ మురళి తన సిబ్బందితో ఆలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో జరిగిన చోరీపై సంఘటనా స్థలాలను పరిశీలిస్తుండగా బాధ్యతారాహిత్యంగా కిందపడ్డ చిల్లరడబ్బులను సైతం ఈ సెక్యూరిటీ సిబ్బంది తిరిగి హుండీలో వేయడంపై గుర్తించిన పోలీసులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస పరిజ్ఞానం కూడా వుండనవసరం లేదా ? అని ప్రశ్నించారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది వుండగానే దొంగలు ఎంతో చాకచక్యంగా ఆలయంలోకి ప్రవేశించారు. ఆల యానికి వెనుకన వున్న స్వామివారి జీడితోట నుంచి బేడామండపంపైకి వెళ్లి, అక్కడ నుంచి మామిడి చెట్లు మీదు గా లోపలకి దిగారు. కింద ఆలయంలో ప్రధాన ఆస్థాన మండపం వద్ద వున్న ప్రధాన హుండీని కట్టర్తో తెరచి అందులో వున్న బంగారు వస్తువులు, వెండి ఆభరణాల మూటను, నగదును తస్కరించారు. అనంతరం ఆండాళ్లమ్మ, మూలవిరాట్ సన్నిధి వద్ద వున్న మరో హుండీని కూడా పగుల గొట్టి నగదు పట్టుకుపోయారు. అంతకుముం దు కొండపై వున్న స్వామి ఆలయంలో కూడా ఈ దొంగలు చోరీకి విఫలయత్నం చేసినట్టు సంఘటనా స్థలంలో పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ జూరెడ్డి మురళి తో పాటు పోలీసులు గుర్తించారు. మూడు నెలల నుంచి తెరవని హుండీలు' వాస్తవానికి గత ఫిబ్రవరి 28న శ్రీవారి వార్షిక కల్యాణం జరిగింది. మార్చి 5న చివరిసారిగా ఆలయంలో వున్న హుండీలను తెరచి ఆదాయాన్ని లెక్కించారు. ఆ తరువాత ఇప్పటి వరకూ హుండీలను తెరవలేదు. మార్చి 5న హుండీలు తెరిచనప్పటి నుంచి మార్చి 18 వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు సందర్భంగా గ్రామంలో జాతర నిర్వహించారు. ఈ పక్షం రోజులు రికార్డు స్థాయిలో భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నా విషయం తెలిసినదే.! తరువాత ఉగాది, శ్రీరామ నవమి వంటి వేడుకలు కూడా ఆలయ అధికారులు నిర్వహించిన విషయం తెలిసినదే.! ఎంత లేదన్నా రెండు హుండీల ద్వారా సుమారు రూ. 5 లక్షలు వరకూ నగదు పట్టుకుపోయి వుంటారని భావిస్తున్నారు. ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరా వును సంప్రదించగా, హుండీలలో ఆదాయం దాదాపు రూ. 2 లక్షలు వరకూ పోయి వుండవచ్చునని చెప్పారు. హుండీలను కట్టర్తో కట్ చేస్తున్నప్పుడు కూడా టెంపుల్ సెక్యూరిటీ సిబ్బంది గమనించకపోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది సీసీ ఫుటేజీ రూమ్లో ఒకరు, ఆఫీస్ వరండాలో మరొకరు నిద్రపోయినట్టు ఆలయ అధికారులు గుర్తించారు. టీటీడీ విజిలెన్స్ నిబంధనల ప్రకారం రాత్రి సమయంలో ప్రతీ గంటకు సెక్యూరిటీ సిబ్బంది. టెంపుల్ పొజిషన్పై వాట్సాప్ మెజేస్ చేస్తూ వుండాలి. మంగళవారం అర్ధరాత్రి 1 -15 గంటలకు ఆలయంలో దొంగతనం జరిగింది. కానీ సెక్యూరిటీ సిబ్బంది ఇది గమ నించకుండా తెల్లవారుజామున 4 =30 గంటలకు పొజిషన్ పీస్ఫుల్ అంటూ విజిలెన్స్ విభాగానికి మెసేజ్ పంపడం గమనార్హం.. ఆలయం వెనుక దొరికిన నగలు మూట ఉపమాక వెంకన్న ఆలయంలో జరిగిన చోరీలో మరో ట్విస్ట్ నెలకొంది. దొంగలు నగదుతోపాటు, హుండీలో వున్న నగలు కూడా పట్టుకుపోయారు. అయితే ఆలయం వెనుక వున్న జీడితోటలో బంగారు వస్తువులు, వెండి ఆభరణాలున్న మూటను వదిలేయడం విశేషం.! పోలీస్ జాగిలాలు ఆలయాన్ని పరిశీలించి,పసిగట్టిన అనంతరం ఆలయం వెనుక వున్న తోటవద్దకు వెళ్లేసరికి అక్కడ శ్రీవారి ఆభరణాల మూట పోలీసులకు లభ్యమైంది. వీటిని లెక్కించగా సుమారు 56 గ్రాములు బంగారం, రెండున్నర కేజీలకు పైగా వెండి ఆభరణాలున్నట్టు గుర్తించారు. ఈ సంఘటనపై డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు జె.మురళీ, ఎల్.రామకృష్ణ తదితరులు ఆరా తీశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ప్రత్యేక బృందాలతో దొంగలను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. అత్యంత త్వరగా చోరీకి పాల్పడిన నిందితులను పట్టుకుంటామని డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. చోరీకి పాల్పడిన దుండగులు సిసి ఫుటేజీలను సీఐ జూరెడ్డి మురళి విడుదల చేశారు. ఉప్మాక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన హుండీ దొంగతనం కేసుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలో నమోదైన అనుమానిత వ్యక్తుల చిత్రాలను విడుదల చేశారు. ఈ చిత్రాలలో ఉన్న వ్యక్తులను ఎవరైనా గుర్తుపట్టినట్లయితే లేదా వారి గురించి ఏదైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే నక్కపల్లి సీఐ లేదా నక్కపల్లి పోలీస్ స్టేషన్ ను సంప్రదించి సమాచారం అందించవలసిందిగా ప్రజలకు సీఐ మురళి పిలుపునిచ్చారు. 9440796105కి ఫోన్ చేసి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి కోరారు.



## విశాఖలో రెండు ఏఆర్టీ కేంద్రాల తనిఖీ



పిఎం పాలెం, జూన్ 3, ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఏఆర్టీ (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ), సరోగసి పర్యవేక్షణ బృందం విశాఖపట్నంలోని రెండు ఏఆర్టీ కేంద్రాలను తనిఖీ చేసింది. కృష్ణనగర్, మహారాణిపేటలోని శ్రీ వెంకటరమణ హాస్పిటల్ (ఆర్ట్ లెవెల్-1), మురళీనగర్‌లోని నిర్మల హాస్పిటల్ (ఆర్ట్ లెవెల్-1)లను బృందం సందర్శించి పలు అంశాలను పరిశీలించింది. ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ యంత్రాలు, ల్యాబ్ పరికరాలు, వైద్యులు, సిబ్బంది విద్యార్హత లను పరిశీలించారు. ఏఆర్టీ కేంద్రాల నిర్వహణకు అవసరమైన అనుమతులు, నిబంధనల అమలుపై ఆరా తీశారు. కేంద్రాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, సేవలను మరింత మెరుగుపరచాలని సంబంధిత యాజమాన్యాలకు సూచించారు. డా. విద్యారమ (గైనకాలజిస్ట్, వీజీహెచ్), డా. వందన శశికిరణ్ (రేడియాలజిస్ట్, కేజీహెచ్), డా. సోభశ్రీ (సోషియాలజిస్ట్, ఆంధ్రా యూనివర్సిటీ), ఎల్.వి. రమణి (ఎన్‌జీఓ), కె. శివాజీ (మానిటరింగ్ కన్సల్టెంట్), డా. బి. ఉమావతి (డీపీఎంఓ), బి. నాగేశ్వరరావు (డెమో) తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం హైవేపై రోడ్డు ప్రమాదం

ఆనందపురం, జూన్ 3, ప్రభాతవార్త:

ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలో లొడగలవానిపాలెం వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డాన్స్ మాస్టర్ షణ్ముఖ్ అలియాస్ పండుకు తీవ్ర గాయాలు కాగా, ముగ్గురు మహిళా డాన్సర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీస్ లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తగరపువలస సమీపంలోని ఓ గ్రామంలో అమ్మవారి ఉత్సవాల్లో స్టేజి ప్రదర్శన నిర్వహించి తిరిగి గాజువాకకు వెళ్తున్న బాలు రైడర్స్ డాన్స్ బృందానికి చెందిన సభ్యులు ప్రయాణిస్తున్న సుజుకి ఎర్టిగా కారు, టాటా స్కార్పియో వాహనాలను లొడగలవానిపాలెం సమీపంలో హైవే పక్కన నిలిపివేశారు. బృందంలోని ఒక సభ్యుడికి భోజనం కారణంగా అస్వస్థత, వాంతులు కావడంతో వాహనాలను రోడ్డు పక్కన ఆపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో విజయనగరం వైపు నుంచి వేపగుంటకు కోళ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వ్యాన్ అతివేగంగా వచ్చి ఆగి ఉన్న రెండు వాహనాలను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో రోడ్డు డివైడర్ సమీపంలో ఉన్న షణ్ముఖ్ అలియాస్ పండు మాస్టర్‌కు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే డ్యాన్సర్లు లిఖిత ప్రియా, హారికతో పాటు మరో మహిళా డాన్సర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే సహచరులు విశాఖపట్నంలోని వెంకోజిపాలెంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డాన్స్ మాస్టర్ పండుకు రెండు కాళ్లు మోకాలు దిగిన తీవ్రంగా గాయపడ్డారని, మరో ఆరు నెలల పాటు చికిత్స పొందాల్సిన అవసరం ఉందని అక్కడి వైద్యుల తెలిపారు. పండు ఇప్పుడిప్పుడే ఢీ వంటి ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రమాదం విషయాన్ని వెంటనే బాధితులు, స్థానికులు స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. ప్రమాదానికి గురైన మూడు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పిఎం పాలెం, జూన్ 4, ప్రభాతవార్త

33/11 కేవీ పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కృష్ణరాయపురం ఫీడర్‌కు సంబంధించి నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3(ఆపరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, జ్యోతినగర్, మహతి స్కూల్ పరిసర ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## పీఎం పాలెం 6వ వార్డులో యూనిట్ సభ్యులతో సమావేశం

పిఎం పాలెం, జూన్ 3, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గం మధురవాడ జోన్-2 పరిధి లోని పీఎం పాలెం 6వ వార్డులో నెలలోని మొదటి బుధవారం యూనిట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 6వ వార్డు క్లస్టర్ ఇంచార్జి మన్నెల సోంబాబు అధ్యక్షత వహించగా, కో-క్లస్టర్ ఇంచార్జి పొలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 52వ యూనిట్ ఇంచార్జి గొలగాన గోసన్యాసిరావు, 53వ యూనిట్ ఇంచార్జి పోతిన రఘు, 54వ యూనిట్ ఇంచార్జి రెడ్డి సత్యనారాయణ, 55వ యూనిట్ ఇంచార్జి కుప్పక రామకృష్ణ, 56వ యూనిట్ ఇంచార్జి కొల్లి గోవింద, 59వ యూనిట్ ఇంచార్జి పోతిన హనుమంతరావుతో పాటు యూనిట్ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాల అమలు, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో మరింత సమన్వయంతో ప్రజలకు చేరువై సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

## 7వ వార్డులో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశం




పిఎం పాలెం, జూన్ 3, ప్రభాతవార్త

భీమిలి నియోజకవర్గం పరిధి లోని 7వ వార్డు తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశం బుధవారం మధురవాడ ఆదిత్య నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు పిల్లా వెంకటరావు హాజరుకాగా, నాగోటి సూర్యప్రకాశ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో స్థానిక ప్రజలు తమ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న నాయకులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పిల్లా వెంకటరావు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం మరియు అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటారని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. 7వ వార్డు ఉపాధ్యక్షుడు పోతిన అప్పారావు, యూనిట్-60 కో-యూనిట్ ఇన్‌చార్జ్ పోతిన వెంకటరావు, యూనిట్ కో-కన్వీనర్ నాగోటి శివాజీ, యూనిట్ ఇన్‌చార్జ్ పిల్లా రాము, పోతిన బుజ్జి, కె.సూరిబాబు (బుజ్జి)తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జ్‌లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సమావేశం ఉత్సాహభరితంగా సాగింది.

## చిన్నారులకు తొలి 1000 రోజులు కీలకం

విశాఖపట్నం జూన్ 3, ప్రభాతవార్త



జీవితంలో తొలి 1000 రోజులు చిన్నారుల మెదడు శారీరక వికాసానిక అత్యంత కీలకమని, ఈ దశలో అభివృద్ధి సమస్యలను గుర్తించడం ద్వారా పిల్లల భవిష్యత్తు మరింత మెరుగు పరచవచ్చని శిక్షకులు వివరించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో బుధవారం ఆరు సంవత్సరాల వయస్సు చిన్నారులలో అభివృద్ధి జాప్యాలను ముందస్తుగా గుర్తించి సకాలంలో తగిన వైద్య సేవలు అందించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ ) ఆధారిత స్క్రీనింగ్ పై ఒక్క రోజు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంనకు మూడు ప్రాజెక్ట్ లకు చెందిన సీడీపీఓలు ఆర్బీఎస్కే నోడల్ ఆఫీసర్ 11 మండలాలకు చెందిన సూపరవైసేర్లు వైద్యాధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్నారుల అభివృద్ధి మైలురాళ్లు, అభివృద్ధి జాప్యాల గుర్తింపు, ఏఐ ఆధారిత స్క్రీనింగ్ యాప్ వినియోగం, నివేదికల తయారీ, అవసరం అయిన సేవలకు పిల్లలని అనుసంధానం చేసే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవచేతన కార్యక్రమం ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న ప్రత్యేక చర్యలు గురించి విరించారు. ఈ కార్యక్రమం చిన్నారుల సమగ్ర అభివృద్ధి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సకాలంలో సేవల అందుబాటుకు దోహద పడుతోందని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిని కేవీ రామ లక్ష్మీ తెలిపారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, UTLA VENKATA KIRAN KUMAR S/O UTLA SUBBARAO, previously called UTLA KIRAN KUMAR R/O THUMKAPALLI, KOTHAVALASA, VIZIANAGARAM now changed my name from UTLA KIRAN KUMAR to UTLA VENKATA KIRAN KUMAR. Henceforth I will be called as UTLA VENKATA KIRAN KUMAR for all purposes.

(Ro.No. 8938)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## జీవీఎంసీ మాధవధార హైస్కూల్ కాంప్లెక్స్ ఘనంగా బడి పిలుస్తోంది కార్యక్రమం



విశాఖపట్నం-ప్రభాతవార్త

జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ బుధవారం జీవీఎంసీ మాధవధార హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్‌తో సహా ఉప విద్యా శాఖాధికారి ఏ.సోమేశ్వరరావు, గోపాలపట్టణం 2వ ఎంఈఓ దివాకర్, టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల వరప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలైన బి.హేమలత, ఏఎంఓ శ్రీదేవి, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, జీవీఎంసీ పాఠశాల క్లస్టర్ పరిధిలో గల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఉదయం 9గంటలకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భమును పుర్కరించుకుని డీఈఓ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ అందరు ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలల పరధిలో అన్ని ఆవాసాలల్లో తిరిగి విద్యార్థులను ఈ వేసవిలో సమీకరించి పాఠశాలలో చేర్పించడం హర్షణీయమని ప్రశంసంచారు. 100 శాతం ఎన్రోల్మెంట్ను ప్రభుత్వ పాఠశాలలో చేర్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉప విద్యా శాఖాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల వల్ల విద్యార్థులకు ఎన్ని విధాల ఉపయోగాలో తెలియజేసారు. ఈ సమావేసానికి హాజరైన తల్లిదండ్రులను ఉద్దేశించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని తెలియజేసారు. తదుపరి టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల. వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత పధవుల్లో ఉన్న వారు ఎందరో ఉన్నారు అని ప్రభుత్వ పాఠశాలలపై చిన్న చూపు తగదు అని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలైన హేమలత 2025-2026 విద్యాసంవత్సరంలో పాఠశాలలో విద్యార్థులు సాధించిన ప్రగతి, ఇతర పాఠశాలలో విద్యార్థులు సాధించిన అంశాలను వివరించారు. అలాగే మాధవధార ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు తాము చేస్తున్న బడి పిలుస్తోంది కార్యక్రమం వివరాలు తెలియజేసారు. పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, తల్లిదండ్రులు మాట్లాడ డం జరిగింది. ఈ రోజు బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బడి పిలుస్తోంది కార్యక్రమం మనందరి బాధ్యత అందరం కలసి శ్రమించాలని డిఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ స్ఫూర్తిదాయకమైన సందేశంతో, ప్రధానోపాధ్యాయురాలు వందన సమర్పణతో ఈనాటి సమావేశం ముగిసింది.

## మెగా డీఎస్సీపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి

### తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు

గాజువాక, జూన్ 3,ప్రభాతవార్త



మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, తప్పుడు ప్రచారాలను తెలుగుయువత విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు తీవ్రంగా ఖండించారు. గొడవలు పెట్టాలనుకుంటున్న గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగ యువతను పూర్తిగా మోసం చేసిన వైఎస్సార్సీపీ, ఇప్పుడు డీఎస్సీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నాడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో విఫలమై, నేడు యువతపై నకిలీ ప్రేమ చూపిస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా డీఎస్సీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే నిరుద్యోగుల భావోద్వేగాలతో వైఎస్సార్సీపీ ఆటలాడుకుంటోందని దుయ్యబట్టారు. అభ్యర్థుల సంక్షేమానికి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్ కాంత్, గాజువాక తెలుగుయువత అధ్యక్షులు మానపురం గణపతి, ప్రధాన కార్యదర్శి వియ్యపు నరేష్, లోకేష్, సాయి వర్మ, అధికార ప్రతినిధులు అప్పల రాజు, బోండా రవి, ఊరుకుటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కేఎన్ఆర్



గాజువాక,జూన్ 3,ప్రభాతవార్త

మండల పరిధిలోని 64వ వార్డు పెద్దపల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణంరెడ్డి నరసింగరావు బుధవారం పరిశీలించారు. మండల ఇన్‌చార్జ్ గరికిన పైడిరాజు, వార్డు అధ్యక్షురాలు మాధవి ఆధ్వర్యంలో ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా సౌకర్యాలపై అంగన్‌వాడీ కార్యకర్త దేవుడమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేఎన్ఆర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సౌజన్యంతో ఈ కేంద్రంలో 30 మంది చిన్నారులకు ఉచిత చదువు, మధ్యాహ్న భోజనంతో పాటు గర్భిణులకు పాలు, గుడ్లు అందిస్తున్నట్లు చెప్పారు. కాగా, కేంద్ర భవనానికి సంబంధించిన ద్వారబంధాలు, తలుపులు పుచ్చిపోయి ఇబ్బందిగా ఉన్నట్లు కార్యకర్త దేవుడమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. ఈ సమస్యను వెంటనే స్థానిక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, దేవుడు, జగన్నాధం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గాజువాకలో వైసీపీ 'వెన్నుపోటు దినం' నిరసనలు

గాజువాక, జూన్ 3,ప్రభాతవార్త



వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు గాజువాకలో "వెన్నుపోటు దినం" కార్య క్రమాలను భారీ ఎత్తున నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని మూడు ప్రధాన జంక్షన్లలో ఈ నిరసనలు జరుగనున్నాయి. పెదగంట్యాడ జంక్షన్‌లో జరిగే నిరసనలో 64, 65, 66, 74, 75, 76 వార్డుల శ్రేణులు పాల్గొననగా, ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి హాజరవుతారు. అలాగే, బీహెచ్‌పీవీ జంక్షన్‌లో 67, 68, 69, 70, 72, 73 వార్డుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి గాజువాక పరిశీలకులు, మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో 71, 85, 86, 87, 78, 89 వార్డుల పరిధిలో నిర్వహించే నిరసనకు గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైసీపీ నేతలు మరుదుపెట్టారు, పెట్ల రెడ్డి, అంబేడ్కర్ అప్పారావు పిలుపునిచ్చారు.

## గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు రాయడం..చెప్పడంపై ప్రత్యేక శిక్షణ



గాజువాక, జూన్ 3,ప్రభాతవార్త

స్థానిక గాజువాక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ప్రత్యేక సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఈరోజు విద్యార్థులకు కథలు చదవడం, రాయడం,కథలు చెప్పడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సృజనాత్మకంగా అందమైన ఫోటో ఫ్రేములను తయారు చేయడం నేర్చుకున్నారు. తాము తయారు చేసిన ఫోటో ఫ్రేములను విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ దగ్గరుండి పర్యవేక్షించి, విద్యార్థులను ఉత్సాహపరిచారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో ఇలాంటి సృజనాత్మక కళలను నేర్పుకోవడం వల్ల వారిలో దాగివున్న ప్రతిభ వెలికివస్తుందని ఆమె పేర్కొన్నారు. అనంతరం జాతీయ గీతాలాపనతో ఈరోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## రాత్రి పూట రహస్యంగా.. స్కేటింగ్ నిర్మాణ పనులు!

### రెండోసారి ఫ్లోరింగ్ వేస్తున్నా కానరాని జీవీఎంసీ సిబ్బంది -అల్లూరి సీతారామరాజు పార్కులో నాసిరకం పనులపై స్థానికుల ఆగ్రహం

గాజువాక,జూన్ 3,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గం 76వ వార్డు పరిధిలో జీవీఎంసీ నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కు పనులు ప్రారంభంలోనే నత్తనడకన సాగుతున్నాయి. పార్కులో లక్షల రూపాయల నిధులతో చేపట్టిన స్కేటింగ్ గ్రౌండ్ ప్రారంభానికి ముందే వివాదాల్లో చిక్కుకుంది. మొదటిసారి వేసిన ఫ్లోరింగ్ పూర్తిగా నాసిరకంగా ఉండటంతో.. ఇప్పుడు దాన్ని పూర్తిగా తొలగించి, మళ్లీ కొత్త ఫ్లోర్ వేస్తున్నారు. జీవీఎంసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ పనులు చేస్తున్నప్పుడు సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ స్కేటింగ్ గ్రౌండ్ పనులు మాత్రం రాత్రి 8 గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. అసలు ఈ పనులు కార్మికులు తప్ప పర్యవేక్షించాల్సిన అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం. మొదటిసారి నాసిరకం పనుల వల్ల ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ, అధికారులు మళ్లీ అదే రీతిలో రాత్రి పూట పనులు చేయిస్తుండటంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానిక ప్రజలు.. ఈ వ్యవహారాన్ని నేరుగా నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరి ఈ అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## ఉక్కు భూములు ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు :ఎస్‌డిసి సునీత



గాజువాక, జూన్ 2,ప్రభాతవార్త

ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారా? ఏకంగా ఉన్నతాధికారి సంతకాన్నే ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించినా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. పెదగంట్యాడ మండలం వెంపల్‌నగర్ గ్రామంలో ఉక్కు నిర్వాసితులకు చెందిన రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు కొందరు కేటుగాళ్లు తెగబడ్డారు. ఈ దందాకు ఉక్కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి చెందిన ఒక అధికారి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెంపల్‌నగర్ గ్రామంలోని ప్లాట్ నంబర్ 794లో ఉన్న 157 గజాల స్థలం ఉక్కు నిర్వాసితులకు కేటాయించిన ప్రభుత్వ భూమి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుంది. ఈ విలువైన స్థలంపై కన్నేసిన భూచోళ్లు ఏకంగా ఉక్కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంతకాన్నే అచ్చుగుద్దినట్లు ఫోర్జరీ చేసినట్లు,ఆ నకిలీ పత్రాలను అడ్డం పెట్టుకుని ప్రస్తుతం క్షేత్రస్థాయిలో భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నిలువు దోపిడీకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలోని ఓ కీలక అధికారి వెనకుండి నడిపిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో చొరవ చూపించాల్సిన సదరు అధికారి.. కబ్జాదారుల నుంచి భారీగా ముడుపులు అందుకుని అక్రమ నిర్మాణాలకు, ఆక్రమణలకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమిని అక్రమంగా నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేస్తున్న వారిపై, అలాగే ఈ ఫోర్జరీ వ్యవహారానికి సహకరిస్తూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు అధికారిపై తక్షణమే విచారణ జరపాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు, కబ్జాదారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. దీనిపై విశాఖ ఉక్కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతను వివరణ కోరగా....తన దృష్టి కి ఎటువంటి ఫిర్యాదు రాలేదని, తమ దృష్టికి వస్తే కబ్జా దారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

## కోర్టుకు హాజరుకాకుండా పరారీలో ఉన్న ఇద్దరు ముద్దాయిల అరెస్ట్

### -అమలాపురంలో పట్టుకున్న మల్కాపురం పోలీసులు

గాజువాక,జూన్ 3,ప్రభాతవార్త



కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు ముద్దాయిలను మల్కాపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మల్కా పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 185/24, ఖ/o 85 దీమీా కేసులో పిసింగి హరి బాబు, సంగడి గోవిందరాజులు ముద్దాయిలుగా ఉన్నారు. వీరు గత కొంతకాలం గా కోర్టు విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉంటున్నారు. దీంతో వీరిపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిందితుల కోసం గాలింపు చేపట్టిన మల్కాపురం పోలీసులు.. వారు అమలాపురంలో ఉన్నట్లు సమాచారం అందుకొని అక్కడకు వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన ముద్దాయిలను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి రిమాండ్ విధించినట్లు మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు తెలిపారు.

## అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయొద్దు

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి లోకనాథం



ఆరిలోవ, జూన్ 3, ప్రభాతవార్త

ముడసర్లోవ రిజర్వాయర్ ఎదురుగా ఉన్న కొండపై అదానీ గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం నాయకత్వంలో బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జివిఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగారావులతో కలిసి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం భూములను పరిరక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే, సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ 160 ఎకరాల దేవస్థానం భూములను అదానీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు చేపట్టిందని ధ్వజమెత్తారు. దానితో పాటు జివిఎంసికి చెందిన 13 ఎకరాల భూమిని కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. డేటా సెంటర్ ఏర్పాటు చేయబోయే ప్రాంతానికి సమీపంలోనే ముడసర్లోవ రిజర్వాయర్ ఉందని, ఈ ప్రాజెక్ట్ వల్ల క్యాచ్మెంట్ ఏరియా పూర్తిగా దెబ్బతిని నీటి లభ్యత తగ్గిపోతుందన్నారు. ఈ డేటా సెంటర్ వచ్చినట్టైతే లక్ష కుటుంబాలకు నీటి సరఫరా సంగతేమిటని ప్రశ్నించారు. ఈ డేటా సెంటర్ నడపడానికి గంటకు 1 గిగావాట్ (1000 మెగావాట్లు) విద్యుత్ అవసరమవుతుందని, ఈ విద్యుత్ వినియోగం వల్ల ఉష్ణోగ్రత మరో 2 నుండి 3 డిగ్రీలు పెరిగి, మనుషులు నివసించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పంచగ్రామాల్లోనూ 275 సర్వే నెంబరులో నివశిస్తున్న పేదల ఇళ్ళకు పట్టాలు ఇవ్వడానికి, ఇళ్ళ రిపేర్లు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని గత 40ఏళ్ళుగా పోరాడుతుంటే ఇదే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అది దేవస్థానం భూమి ఇవ్వడం కుదరదన్నారు. ఇళ్ళ రిపేర్లు చేసుకుంటే దేవస్థానం అధికారులు దాడులు చేస్తున్న పరిస్థితి. మరి నేడు అదాని డేటా సెంటర్కు దేవస్థానం భూమిని ఎలా కట్టబెట్టారంటూ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డేటా సెంటర్ కేటాయించిన అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి వి. కృష్ణారావు, నాయకులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, ఆర్.రమణమ్మ, కె. కుమారి, కాంత, పి వెంటకరావు, ఐసి నాయుడు, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

## కుర్రపల్లి కాలనీలో తిష్ట వేసిన మంచినీరు, పారిశుధ్యం సమస్యలు

పద్మనాభం, జూన్ 3, ప్రభాతవార్త



మండలంలో కుర్రపల్లి కాలనీలో మంచినీరు, పారిశుధ్యం సమస్యలు తిష్ట వేసాయి. దీంతో కాలనీ ప్రజలు ఈ సమస్యలతో సతమవుతున్నాతు.కాలనీలో ఉన్న మంచినీటి ట్యాంక్ గత రెండు వారాలు పనిచేయలేదు.దీంతో తాగునీటికి కాలనీకి సుదూరంలో పద్మనాభం, తగరపువలస రోడ్డులో నల్లమారమ్మ అమ్మవారి గుడి దగ్గర ఉన్న బోరుబావికి వెళ్లాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు.అసలే వేసవి కావడంతో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కాలనీలో ఉన్న డ్రెయినేజీ చెత్తతో నిండిపోయాయి.ఈ మురికి నీరు బయటకి పోవడానికి కాలువ లేక రోడ్డుపై పారుతుంది. గ్రామ నాయకులు ఈ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. అధికారులు, నాయకులు స్పందించి పై సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## రెవిన్యూ మంత్రి...సీసీఎల్ఏను కలిసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

### -టీడీపీ పార్లమెంట్ కార్యాలయాల స్థలాల కేటాయింపుపై చర్చ



గాజువాక,జూన్ 3,ప్రభాతవార్త

గాజువాక ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇందులో భాగంగా ఆయన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు, ల్యాండ్ రెవిన్యూ ల్యాండ్ రికార్డ్స్ అండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ కె. సాయి ప్రసాద్‌లను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలు, జిల్లాల పరిధిలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాల కేటాయింపు, అందుకు అనుసరించాల్సిన సాంకేతిక, చట్టపరమైన నిబంధనలపై రెవిన్యూ మంత్రి, భూపరిపాలన కమిషనర్‌లతో పల్లా శ్రీనివాసరావు విస్తృతంగా మాట్లాడారు. కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## నేడు ఎస్.ఎఫ్.ఎస్. స్కూల్ నూతన భవనం ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 3,ప్రభాతవార్త

ప్రతిష్టాత్మకమైన సీతమ్మధారలోని ఎస్.ఎఫ్.ఎస్ స్కూలు ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనాన్ని గురువారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఆధునిక సౌకర్యాలతో కూడిన మూడు అంతస్థుల నూతన భవనాన్ని నిర్మించామని,దీనిని గురువారం సాయంత్రం ప్రొవిన్సియల్,ఎస్.ఎఫ్.ఎస్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ బి.సురేష్ బాబు ముఖ్య అతిథిగా ప్రారంభిస్తారన్నారు. ఎంతో చరిత్ర గల ఎస్.ఎఫ్.ఎస్. స్కూల్లో చదివిన విద్యార్థులు దేశ,విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు..ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక శాతం ఫలితాలు తమకు ఎంతో ఆనందాన్ని కలిగించాయన్నారు. అదేవిధంగా ఇటీవల సాంస్కృతిక, క్రీడోత్సవాలలో జాతీయ,అంతర్జాతీయ స్థాయి సాంస్కృతిక క్రీడోత్సవాలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపరిచి పాఠశాలకు, విశాఖ నగరానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడం జరిగిందన్నారు.. విద్యా, విజ్ఞాన,క్రీడా,సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని మనోజ్ పేర్కొన్నారు. జూన్ లో ఆరంభమయ్యే విద్య సంవత్సరం లో విద్యార్థులు ఈ నూతన భవనంలో విద్యాభ్యాసం చేస్తారన్నారు

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తదితరులు



విశాఖపట్నం, జూన్ 03, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, సహజ వనరుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ సూచించారు. పరిశుభ్రమైన, హరిత వాతావరణం భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి విశాఖపట్నం రూపొందించిన అవగాహన పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో ఈ ఏడాది థీమ్‌ను ప్రతిబింబిస్తూ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కీలక అంశాలను పొందుపరిచారు. ప్లాస్టిక్ కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, నేల కాలుష్యం, నిర్మాణ వ్యర్థాలు, నీటి కాలుష్యం వంటి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎక్కువ చెట్లు నాటడం, ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిరాకరించడం, చెత్తను వేర్వేరుగా సేకరించడం, నీటిని ఆదా చేయడం, పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడం, నేల సంరక్షణ వంటి చర్యలను పోస్టర్‌లో వివరించారు. అలాగే పరిశుభ్రమైన పర్యావరణం వల్ల ఆరోగ్యకరమైన జీవనం, హరిత సమాజాల నిర్మాణం, పునరుత్పాదక ఇంధన వినియోగం, స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతాయని పోస్టర్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ముకుందరావు, ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, డీసీపీలు లతామాధురి, మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో శేషశైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఏరువాక చొరవతో 200 కెఎల్ సామర్థ్యం గల నీటి సంప్ క్లీనింగ్

ఆరిలోవ, జూన్ 3, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు పైనాపిల్ కాలనీ వద్ద గల జెఎన్ఎన్ యూఆర్ఎం బ్లాక్స్‌లో ఉన్నటువంటి 200కెఎల్ సామర్థ్యం గల నీటి సంపును ప్రజల అవసరాల కోసం ఎప్పటినుంచో వాడుకోవడం జరుగుతుంది. కానీ సంపు క్లీనింగ్ సరిగా లేక కాలనీవాసులు చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు వెంటనే స్పందించి ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు దృష్టికి తీసుకువెళ్లి వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాస్ రప్పించి వాటర్ సంపును పరిశీలించారు. అనంతరం బుధవారం జీవీఎంసీ వాటర్ సప్లై సిబ్బంది మోటార్ తో సంపులో ఉన్నటువంటి పాత వాటర్ ను బయటకి తోడేసి,సంపు అడుగుభాగంలో పేరుకుపోయినటువంటి మట్టిని బయటకు తీసి సంపును పూర్తిగా శుభ్రం చేశారు. దీంతో కాలనీ వాసులందరూ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావుకు, వార్డు టిడిపి కమిటీ చొరవతో సమస్యను పరిష్కరించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, స్వర్ణ వార్డు వాటర్ సప్లై ఏ.ఈ కనకరాజు, వాటర్ వర్క్స్ ఇన్స్పెక్టర్ శేఖర్, టీడీపీ నాయకులు ఎస్.కే వహిద్, (రాజేష్ ),గురజాపు వాసు, కాలనీ సభ్యులు రావాడ నారాయణ,కంఠ కనకరాజు, నేతల త్రినాధ్, శ్రీకాంత్ పాత్రుడు, రాఘవమ్మ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు గంటా శంకుస్థాపన



విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త

జోన్‌లోని 4 వార్డుల్లో రూ.6.20 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ 2వ వార్డు సంగివలస నుంచి పాండ్రంగి మధ్య శిథిలమైన కాజ్ వే స్థానంలో రూ.1.43 కోట్లతో మైనర్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, రూ.50 లక్షలు వెచ్చించి 3వ వార్డులో పరిధిలోని గంట స్తంభాన్ని అందమైన డిజైన్‌తో పునరుద్ధరిస్తున్నామని వివరించారు. రూ.47 లక్షలతో ఆదర్శనగర్ లో చేపల మార్కెట్, వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, పార్కులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోం దని, నియోజకవర్గంలోని 9 జీవీఎంసీ వార్డుల్లో రూ.200 కోట్ల విలువైన పనులు చేపట్టామన్నారు. భోగా పురం ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత భీమిలి జోన్‌లో అభివృద్ధి పరుగులు తీస్తుందని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్, ఈఈ వాసు, డీఈ సురేష్, కూటమి నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గాడు చిన్ని కుమారి లక్ష్మి, శాఖారి శ్రీనివాస్, చురకల రమణ, జీరు సత్యం, కంటుభుక్త రామానాయుడు, కనకల అప్పలనాయుడు, పాసి నర్సింగరావు, గరికిన ఎల్లాజీ (కింగ్), పరిమి భువనేశ్వరి పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ల నిర్ణయం చారిత్రాత్మక ముందడుగు

విశాఖపట్నం, జూన్ 3, ప్రభాతవార్త



మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల నిర్ణయం రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని, సాధికారతను పెంచే దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు అని తెలుగుదేశం సీనియర్ నాయకులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ మంత్రి నారా లోకేశ్ పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని చేసిన ప్రతిపాదనకు కృతజ్ఞతగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు అధిక సంఖ్యలో హాజరైన మహిళల ఆనందోత్సాహాల మధ్య పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విల్లూరి డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ, రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి నారా లోకేశ్ ప్రతిపాదన ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. విల్లూరి తిరుమల దేవి మాట్లాడుతూ, స్త్రీశక్తిని గౌరవించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, మహిళా సాధికారత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేశ్ మహిళా లోకం రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని "జై చంద్రబాబు, జై లోకేశ్" అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ, కో-క్లస్టర్ బంటుపల్లి శ్రీనివాస్, బలిగిరి వెంకటేశ్వర స్వామి బోర్డు మెంబర్ మాత లక్ష్మి, నేలమ్మ వేప చెట్టు బోర్డు మెంబర్ మధుపాటి ధనలక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొందించుదాం

### పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత - ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి -మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచుదాం -కడలి శ్రీ వాణీ, విశాఖ సబ్ డిఎఫ్ఓ



విశాఖపట్నం, జూన్ 3 (ప్రభాతవార్త)

విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొం దించుదాం అని విశాఖపట్నం సబ్ డిఎఫ్ఓ కడలి శ్రీవాణీ పిలుపునిచ్చారు. బుధవారం. ఉదయం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల ఎదురుగా ఉన్న వనమిత్ర లో సిఫా ట్రస్ట్, గ్రీన్ అంబాసిడర్స్‌లో నేతృత్వంలో విత్తనాల బంతులు తయారు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులు విస్తరించేందుకు విత్తనాల బంతులు తయారు చేయడం అవసరం అని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన విత్తన బంతులు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి అని కోరారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచుదాం అని వివరించారు. సిఫా ట్రస్ట్ సిఇఓ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ 2006 నుండి ప్రతి సంవత్సరం గ్రీన్ అంబాసిడర్స్ చేత విత్తనాల బంతులు తయారు చేయడం, కొండల మీద జల్లడం జరుగుతుంది అన్నారు. విద్యార్థులు అందరూ ప్రకృతి వనరుల పరిరక్షణ కోసం కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ వి లావణ్య, సెక్షన్ ఆఫీసర్ ఎల్లారావు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026కు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 03, ప్రభాతవార్త

భారత ప్రభుత్వం ప్రతిభావంతులైన బాలలను గుర్తించి సత్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా అందజేసే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026 అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ,సాధికారత అధికారి కె.వి. రామలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన భారతీయ సంతతికి చెందిన బాలలు ఈ అవార్డులకు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుంది. ఎంపికైన బాలలకు అవార్డులను భారత రాష్ట్రపతి జనవరి నెలలో న్యూఢిల్లీ నగరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేస్తారు. భారతీయ సంతతికి చెందినవారై ఉండాలి. - భారతదేశంలో నివసిస్తూ ఉండాలి. - 31 జూలై 2026 నాటికి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని అర్హులైన బాలలు 31 జూలై 2026లోపు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు హెచ్‌టిటిపిఎస్://అవార్డ్.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం జిల్లా ఎన్ఐసీ పోర్టల్‌ను సందర్శించవచ్చని తెలిపారు. అదనపు సమాచారం కోసం జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరికృష్ణను 99491 36649 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

vsp10:vsp10.qxd 03-06-2026 21:54 Page 1







## శారదా నది గట్టుల బలోపేతానికి చర్యలు

### ముఖ్యమంత్రి చంద్రబాబు హామీపై రైతుల హర్షం

**( అచ్యుతాపురం, జూన్ 4, ప్రభాత వార్త ) :**



యలమంచిలి నియోజకవర్గంలోని కీలక సమస్యలను పరిష్కరించేందుకు శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండలంలోని శారదా నది దిగువ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.గత రెండు సంవత్సరాలుగా శారదా నది గట్టులు దెబ్బతినడంతో పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. భారీ వర్షాల సమయంలో గట్టులు మరింత కోతకు గురై, సమీప గ్రామాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, శారదా నది గట్టుల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పనులను త్వరితగతిన ప్రారంభించేలా అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి స్పందనపై శారదా నది పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వరద ముప్పు నివారణకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన ధర ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో నియోజకవర్గ ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అభిప్రాయపడ్డారు.

## నేడు వైసిపి శాంతియుత నిరసన

**అనకాపల్లి, జూన్ 3, (ప్రభాత వార్త) :**

రాష్ట్ర వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నేడు గురువారం ఉదయం 9 గంటలకు అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ ( విశాఖ బస్టాప్ ) నుండి బయలుదేరి స్థానిక తాసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా తరలి వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాల ను వివరిస్తూ ప్రజలకు మద్దతుగా శాంతియుత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉపాధి కూలీలకు

## మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన వైకాపా నాయకుడు

**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త) :**



నెల్లిపూడి గ్రామంలో సుమారు 200 మంది ఉపాధి హామీ కూలీలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు ఆ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు ముందుకొచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఉపాధి హామీ పనిచేస్తున్న 200 మంది కూలీలకు గ్రామానికి చెందిన కురం దాసు నానాజీ ముందు కొచ్చి భోజనం ఏర్పాటు చేసి వారికి దగ్గరుండి వడ్డించారు. ఈ విధంగా ఉపాధి కూలీలకు భోజనం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన నానాజీని ఉపాధి కూలీలు అభినందించారు. ఆయనతోపాటు తిరుమల రాజు వెంకటరాజు ఉన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**(నక్కపల్లి ,ప్రభాతవార్త) :**



మండలంలోని మన బాలవాని పాలెం దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దర్శనాలు చేసుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నదానం ఆలయ కమిటీ నిర్వహించారు.

## మా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టండి..

## అధికారులకు పెద్దతీనార్ల గ్రామస్తుల వినతి.!





**( నక్కపల్లి రూరల్ /అడ్డు రోడ్డు ,ప్రభాతవార్త):**

పెద్ద తీనార్ల గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వలన వీధి కాలవల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు అధికంగా ఉన్నాయని దాని వలన ఇళ్లల్లో ఇబ్బందులు పడుతున్నామని ,తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం ఎంపీడీవో చలపతిరావు డిప్యూటీ తాసిల్దార్ నారాయణరావుకు వేరువేరుగా వినతి పత్రం అందజేశారు. మెరుగు తాతారావు, మైలపల్లి జోగిరాజు,అజ్జలమసేనులు కలసి చాలా మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## సూర్య గణేష్‌ను పరామర్శించిన కొప్పిశెట్టి

**(నక్కపల్లి, ప్రభాతవార్త) :**



రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న మండలంలోని దేవవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కొరిమి సూర్య గణేష్‌ను పాయకరావుపేట నియోజక వర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ బుధవారం సాయంత్రం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా జరిగిన పరిస్థితులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, కురుందాసు నూకరాజు,వైబోయిన వెంకటరమణ, ఎరిపిల్లి అప్పలరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## మద్యం సీసాలతో పట్టుబడిన మహిళ అరెస్ట్ .!

**(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త ):**



మండలంలోని చందనాడ గ్రామంలో ఒక పాన్ షాప్‌లో అక్రమంగా ఉన్న మద్యం సీసాలను పోలీసులు బుధవారం జరిగిన తనిఖీల్లో గుర్తించి వికరిస్తున్న గ్రామానికి చెందిన మేడిశెట్టి దేవి అదుపులోకి తీసుకున్నారు . పాన్ షాప్‌లో జరిపిన తనిఖీల్లో 18 మద్యం సీసాలను ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా మద్యం వికరిస్తున్న ఆ మహిళపై కేసు నమోదు అరెస్ట్ చేశామని సీఐ మురళి తెలిపారు. దాడుల్లో మహిళా ఎస్సై సాహిబా అంజుమ్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వ వెన్నుపోటుపై వైయస్సార్సీపి సమర శంఖం

### - గోడపత్రికను ఆవిష్కరించిన ధర్మశ్రీ, ప్రసాద్ , గోవింద్ - నేటి నుంచి కార్యక్రమాలు

**ఎలమంచిలి, జూన్ 3, ప్రభాతవార్త:**



నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ శ్రేణులు "నమ్మకానికి సంకెళ్లు -- వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించబోయే నిరసన కార్యక్రమాల గోడపత్రికను బుధవారం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ బోదుపు గోవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు "సూపర్ సిక్స్" హామీలతో ప్రజలను ఘోరంగా మోసం చేశారని విమర్శించారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి రెండేళ్లలో ఒక్కటే ఇచ్చారని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఊసే లేదని మండిపడ్డారు. ఈ నిరసనల కార్యాచరణలో భాగంగా జూన్ 4న నాలుగు మండల కేంద్రాలలో భారీ ధర్నాలు, మానవహారాలు నిర్వహించి, కూటమి పార్టీల మేనిఫెస్టో, బాండ్ పత్రాల కాపీలను ప్రజల సమక్షంలో దహనం చేయనున్నారు. అనంతరం జూన్ 8 లేదా 9 తేదీల్లో రైతులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు, డీఎస్సీ అభ్యర్థులతో టౌన్ హాల్‌లో విస్తృత చర్చా వేదిక ఏర్పాటు చేస్తారు. చివరిగా జూన్ 12న ఎలమంచిలి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ మానవహారం నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డెడ ప్రసాద్ మాట్లాడుతూ, కార్యకర్తలకు ఏ అర్ధరాత్రి ఏ కష్టం వచ్చినా, పోలీస్ స్టేషన్లలో లేదా కోర్టులలో తాము ముందుండి భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. గతంలో 'చలో దువ్వుతురు' కార్యక్రమంతో వాతావరణాన్ని అనుకూలంగా మార్చామని గుర్తుచేశారు. ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన వెరిఫికేషన్‌లో ఎలమంచిలి నియోజకవర్గం 97.69 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందని నేతలు హర్షం వ్యక్తం చేశారు. జూన్ 4న జరిగే ధర్నా కార్యక్రమాలకు కరణం ధర్మశ్రీ స్వయంగా హాజరుకానుండగా, గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేసి ఈ నిరసనలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, బోద్దపు ఎర్రయ్య దొర, నాలుగు మండలాలకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేయడమే మనందరి లక్ష్యం : అయినంపూడి

**(నక్కపల్లి ,ప్రభాతవార్త ) :**



వేంపాడు, అమలాపురం గ్రామాల్లో టిడిపిని బలోపేతం చేయడమే లక్ష్యంతో ప్రతి ఒక్కరం పని చేయాలని ఆ విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు దక్కించుకునే విధంగా ఇప్పటి నుంచే గ్రామంలో ప్రతి ఇంటికి ప్రతి కార్యకర్త అనే నినాదంతో పనిచేయాలని మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు అయినంపూడి అప్పలరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం వేంపాడు అమలాపురం తెలుగుదేశం పార్టీ యూనిట్ స్థాయి సమావేశం ఇంచార్జ్ పల్లా రాంబాబు ఆధ్వర్యంలో అయినంపూడి అప్పలరాజు ఇంటి వద్ద నిర్వహించారు. రాబోయే రోజుల్లో పార్టీ పతిష్టకు కృషి చేయాలనీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను తదితర విషయాలపై చర్చించారు . ఇప్పటినుంచి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వేంపాడు, అమలాపురం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ఈ సమావేశం లో మండల బీసీ సెల్ అధ్యక్షులు ఏరిపిల్లి అప్పలరాజు, పెదపూడి శంకరావు, పిఏసిఎస్ డైరెక్టర్ దారబాల నరసింహమూర్తి, వేంపాడు గ్రామశాఖ అధ్యక్షులు కళ్లేపల్లి వెంకటపతి రాజు, అమలాపురం గ్రామశాఖ అధ్యక్షులు సూరకాసుల గోవిందరావు,వేంపాడు ఉన్నత పాఠశాల చైర్మన్ కమిడి బాబురావు,పాయకరావుపేట నియోజకవర్గం ఐటీడీపి ప్రధానకార్యదర్శి ఏరిపిల్లి సత్తిబాబు,మండల తెలుగుయువత అధ్యక్షులు కమ్మిలి శివరామకృష్ణ,మండల క్రిస్టియన్ అధ్యక్షులు రాకతి రాజు, శివాజీ, పైడిరాజు, వెంకటరమణ, చిన్నప్పన్న, అప్పలరాజు, తదితరులు ఉన్నారు.

## నేడు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైకాపా ఆందోళన

**(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త):**



చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు - ప్రజా వ్యతిరేక హామీల మోసాన్ని నిరసిద్దాం నినాదంతో రాష్ట్ర పార్టీ నాయకత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశం మేరకు మండలంలో గురువారం పెద్ద ఎత్తున ర్యాలీలు ఆందోళన నిర్వహించనున్నామని ఆ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వాములై జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు బుధవారం ప్రకటనలో తెలిపారు.నక్కపల్లి మండల పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి , దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ ల నాయకత్వంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆందోళన కార్యక్రమానికి జడ్ పీటీసీ ,ఎంపీపీ ,వైస్ ఎంపీపీలు, రాష్ట్ర, జిల్లా ,మండల అనుభబంద విభాగల నాయకులు,మాజీ సర్పంచ్లు,ఎంపిటిసిలు,బి ఎల్ఏలు, సీనియర్ నాయకులు,,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అంజయ్య కాలనీలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి

### విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేసిన వైసిపి నేతలు

**అనకాపల్లి , జూన్ 3, (ప్రభాత వార్త) :**



స్థానిక 82వ వార్డ్ అంజయ్య కాలనీ ప్రాంత ప్రజల కరెంట్ కష్టాలు తీర్చాలని వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ అధికారి కమర్షియల్ ఏఈ అమృత ను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు గా ఉన్న మాజీ కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన ట్రాన్సఫార్మార్ ను ఇటీవల మార్పు చేసినప్పటినుండి మరలా పాత కరెంట్ కష్టాలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. అక్కడి ప్రజలు సమస్య పై స్పందించి తీవ్ర వ్యతిరేకత తో మరలా కొత్త ట్రాన్సఫర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఒక వ్యక్తి అవగాహన లోపంతో స్పందనలో చేసిన అభ్యంతరంతో పనులను నిలుపులదల చెయ్యడం శోచనీయమని, వ్యక్తి ప్రయోజనం కంటే స్థానిక ప్రజల అవసరాలు ముఖ్యమని పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నియోజకవర్గం యువజన అధ్యక్షులు జాజుల రమేష్ , 82వ వార్డ్ అధ్యక్షులు అల్లు త్రినాధ్ లు వివరించారు. తక్షణమే సమస్య పై ఉన్నత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని కమర్షియల్ అమృత తెలియజేశారు. కార్యక్రమంలో అంజయ్య కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## విశాఖ రైల్వే జోన్ సాధనలో అలుపెరుగని పోరాట యోధుడు కొణతాల రామకృష్ణ





**అనకాపల్లి, జూన్ 3, (ప్రభాత వార్త) :**

విశాఖపట్నం, దక్షిణ తీర రైల్వే జోన్‌కు ప్రధాన కార్యాలయం , ఇది భారతీయ రైల్వేలో 18వ సరికొత్త రైల్వే జోన్.అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన అప్పటి మాజీ మంత్రి, ఇప్పటి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఈ ప్రత్యేక రైల్వే జోన్ కోసం దశాబ్దాలుగా సాగిన ప్రజా ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన నాయకుడు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్‌గా, ఆయన ఈ జోన్‌ను ఇతర డివిజన్లలో విలీనం చేయకుండా, విశాఖపట్నంలో ప్రధాన కార్యాలయంతో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిరసనలు, సంతకాల సేకరణ కార్యక్రమాలు, న్యూఢిల్లీకి అధికారిక ప్రతినిధి బృందాలకు నాయకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద ఏర్పాటు చేయబడిన ఈ జోన్‌లో విశాఖపట్నం డివిజన్ కూడా ఉంది. ఇది ఉత్తరాంధ్ర ప్రాంత రాజకీయ, పౌర ఉద్యమాలకు ఒక ప్రధాన విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో సరికొత్త వినూత్న నిరసన , డిమాండ్ భారతీయ రైల్వే రైలులో విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీకి కదులుతున్న రైలులో ఆంధ్రప్రదేశ్ ప్రజల నిరసన కార్యక్రమం కొణతాల చేపట్టారు .జనవరి 27న 2019 విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీకి ఉదయం 8.30 గంటలకు రైలు యాత్ర, విశాఖపట్నం రైల్వే జోన్ కోసం ఈ నిరసన జనవరి 29వ 2019 తేదీన రైలు గమ్యస్థానంలో ఆగే వరకు కొనసాగింది. దీని తర్వాత ఘాట్‌కి వెళ్లి మహాత్మా గాంధీకి నివాళులు అర్పించి, ఆపై నిరసనను ముగించారు. దీని తర్వాత పార్లమెంటులోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు ఎమ్మెల్యేలను కలిసి ప్రత్యేక రైల్వే జోన్ కోసం రైల్వే మంత్రి కి విజ్ఞప్తి చేశారు. వాల్తేరు డివిజన్ విభజనను తీవ్రంగా వ్యతిరేకించి, ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవం కోసం కేంద్రంతో రాజీలేని పోరాటం చేసిన నాయకుడు కొణతాల రామకృష్ణ. ఈరోజు అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చేసిన రైలు యాత్ర నిరసన కార్యక్రమం ఫలితంగా ఎన్నో ఏళ్ల కళ సఫలీకృతమై విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రస్థానం ఈ సంవత్సరం జూన్ 1 నుంచి ప్రారంభమైనది. వాస్తవ గణాంకాలతో ఆయన చేసిన నిరంతర శ్రమ, గట్టి పోరాటాల ఫలితంగానే నేడు విశాఖపట్నం కేంద్రంగా నూతన రైల్వే జోన్ సాకారమైంది.ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రదాత కొణతాల రామకృష్ణకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

## హోంమంత్రి, కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోం : కొప్పిశెట్టి

**(నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త):**



రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని , హోం మంత్రి వంగలపూడి అనిత పై రాష్ట్ర మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఇలా చేస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. "హోం మినిస్టర్ ఇంటికి వెళ్ళండి, 15 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి, 15 లక్షలు ఇవ్వండి" అని చెప్పి తప్పుడుగా మాట్లాడటం సరైనది కాదని అన్నారు. మీ పార్టీ మీకు ఒక ఆదేశం ఇచ్చి ఉండొచ్చు, ఆదేశాల ప్రకారం "ప్రభుత్వం మీద బురద జల్లడం, డీఎస్సీ మీద అవినీతి జరిగిందని ప్రజల్లోకి వెళ్లి వారిని పక్కదారి పట్టించడం" ఇదే పనిగా చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఒక తప్పుడు సమాచారాన్ని మీకు ఇవ్వడం జరిగిందని ఆ విధంగా రాజకీయ లబ్ధి కోసం ఎన్నైనా చేసుకోండి కానీ ఎటువంటి ఆరోపణ చేయడం మంచిది కాదని వెంకటేష్ అన్నారు. ఈ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా, 16 వేలకు పైగా నిరుద్యోగ యువతకు, బీఈడీ చదువుకున్న యువతకు ఎస్జీటీలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా, పీజీటీలుగా ఉద్యోగాలు ఇస్తేఎక్కడా అవినీతి జరగకుండా పారదర్శకంగా జరిగిన సంగతి అందరికీ తెలుసు అని అన్నారు. వాళ్ళు ఉద్యోగాలు చేసుకొని కూడా ఆరు నెలలు పైచీలుకు అయిపోయిందని ఈ విషయాన్ని తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ ఏ విద్యాశాఖ మంత్రి చేయని విధంగా నారా లోకేష్ కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా ఈ డీఎస్సీని ప్రారంభించడం చేశారని, దాన్ని పూర్తి చేయడం కూడా జరిగిందని. కానీ మీరు తప్పుడుగా ప్రచారాలు చేసి, ఒక్కొక్క ఉద్యోగానికి డబ్బులు తీసుకున్నారని, చెప్పేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని అన్నారు. ఇది పారదర్శకంగా జరిగిందని ప్రజలందరికీ తెలిసిన విషయం తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. బీఈడీ చదువుకున్న విద్యార్థులందరూ ఉద్యోగాలతో చాలా ఆనందంగా ఉన్న సమయంలో మీరు తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని వెంకటేష్ అన్నారు., హోం మంత్రి పదవి చేపట్టిన తర్వాత, ఈ రాష్ట్రంలో ఏ హోం మంత్రి పని చేయని విధంగా 6 వేలకు పైగా మందికి పోలీసు ఉద్యోగాలు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వంలోనే కాకుండా ప్రైవేట్ కంపెనీల్లో కూడా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చెప్పి పెద్ద ఎత్తున పోరాటం చేశాం. అలాగే వాళ్లకు కూడా ఉద్యోగాలు కల్పించే కార్యక్రమం చేస్తున్నాం అన్నారు.రాబోయే కాలంలో మన ప్రాంతం, ఉత్తరాంధ్ర ప్రాంతం, అందులోనూ మన అనకాపల్లి జిల్లాలో 'ఆర్సెలార్ మిట్టల్' అనే ఒక లక్షల కోట్ల రూపాయలతో ఒక మంచి కంపెనీని తెస్తే, మరి దానిమీద కూడా మీరు విమర్శలు చేస్తున్నారు ఇది సరైనది కాదని ప్రజలకు మంచి సందేశం ఇవ్వాలి తప్ప పక్కదారి పట్టించే విధంగా వ్యవహరించకూడదని అన్నారు. మీరు చేయలేని పనిని మేము చేస్తుంటే మీరు కంగారు పడుతున్నారు ఎందుకు. ఆ రోజు అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు, మీరు "దాచుకో దోచుకో" అన్న విధంగా పరిపాలించారు. దావోస్ వెళ్ళినప్పుడు చలి వేస్తుందని చెప్పి దావోస్ వెళ్ళని నాయకులు మీరు. ఏ కంపెనీ వస్తుంది అంటే "గుడ్డు పెట్టాలి, పొదగాలి" అని చెప్పేసి మీరు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రమంతా నవ్వుల పాలయ్యాయి అని అన్నారు. ఈ రోజు కూడా నవ్వుల పాలవుతున్నారు. ఏం చేయాలో తెలియక తప్పుడుగా ప్రచారం చేస్తున్నారు ఇది న్యాయమా తిని ప్రశ్నించారు. అభివృద్ధికి సహకరించండి చేయకండి అని వెంకటేష్ అన్నారు.డీఎస్సీలో మా నియోజకవర్గంలో పేద విద్యార్థులకి, చదువుకున్న విద్యార్థులకి, 34 మంది టీచర్లు ఎంపికైతే, వాళ్లందరినీ వారి తల్లిదండ్రులను పిలిచి సన్మానం చేసిన ఘనత అనితమ్మకు దక్కిందన్నారు. ప్రతి సంవత్సరం టెన్త్ క్లాస్ లో చదువుకున్న పిల్లలకి ఫస్ట్, సెకండ్ వచ్చిన వారికి ప్రైజ్ మనీ ఇచ్చి వాళ్ళని ప్రోత్సహించే కార్యక్రమం చేస్తున్నారు ఇది తెలుసుకోండి అన్నారు. రాబోయే కాలంలో వీళ్ళందరికీ కూడా ఉద్యోగాలు కల్పించాలనే ఆలోచనతో బ్రహ్మాండంగా పని చేస్తూ, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే అనిత మీద తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు ఇది విరమించుకోవాలని తెలిపారు. ఎక్కడైనా ఏ విద్యార్థి అయినా, ఏ నిరుద్యోగి అయినా "ఇదిగో మా దగ్గర టీడీపీ నాయకులు డబ్బులు తీసుకున్నారు, లేకపోతే మంత్రి డబ్బులు తీసుకున్నారు" అని నిరూపించగలిగితే చెప్పండి మీరు చేసిన ప్రతి దానికి కూడా మేము శిక్ష అనుభవిస్తామని వెంకటేష్ అన్నారు. మరి ఆ విషయాన్ని మీరు నిరూపించలేకపోతే మీరు అపాలజీ చెప్పాల్సిన అవసరం ఉందని దానికి మీరు సిద్ధమేనా అని ప్రశ్నించారు. వెంకటేష్‌తో పాటు టీడీపీ మండల అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, కోటఊరట్ల టీడీపీ మండల అధ్యక్షులు పెట్ల లింగంనాయుడు,జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మల్లపురెడ్డి రమా కుమారి, నక్కపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు కామ్మేల శివ రామకృష్ణ రాజు, తదితరులు ఉన్నారు.

## వెలమ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**అనకాపల్లి జూన్ 3 (ప్రభాత వార్త) :**



అనకాపల్లి వెలమ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సల శిబిరం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీరామ హాస్పిటల్‌లో జరిగిన శిబిరంలో పాల్గొన్న వారికి పలువురు ప్రముఖ వైద్యులతో ఉచితంగా వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం అవసరమైన వారికి చాలా సేవాభావంతో అతి తక్కువ రుసుములతో పలు వైద్య మెడికల్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివ దయాళ్ (కార్డియాలజీ), డాక్టర్ సింహాచలం నాయుడు (ఆర్థోపెడిక్), డాక్టర్ మహేష్ (ఈ ఎన్ టి), డాక్టర్ హరిప్రియ (గైనకాలజీ), డాక్టర్ మురళీ (ఫిజియోథెరపీ), డాక్టర్ పూడి సందీప్ (దంత వైద్యం), డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామ్ కుమార్ (జనరల్ ఫిజిషియన్ అండ్ సర్జన్) తదితర విభాగాలకు సంబంధించిన డాక్టర్లు పాల్గొని తమ సేవలను అందించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ జి వి సత్యనారాయణరావు (విక్రమ్ డాక్టర్ ) హాజరయ్యారు. సుమారు 150 మందికి పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతరులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని సేవలను పొందారని నిర్వాహకులు తెలియజేశారు. సంఘ అధ్యక్షులు సింహాచలం నాయుడు, సెక్రటరీ రొంగలి అప్పలరాజు, డాక్టర్ సందీప్, శ్రీరామ మూర్తి, అర్జున్, కృష్ణ కుమార్, పైడితల్లి, ప్రతాప్, నాగరాజు, ఆర్ శ్రీనివాసరావు, సూర్యనారాయణ, మధు, దేవుడు బాబు, సీనియర్ న్యాయవాది రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సేవలందించిన వైద్యులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సీఐటీయూ డిమాండ్



**( అచ్యుతాపురం జూన్ 4 ప్రభాతవార్త )**

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో బుధవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న స్మార్ట్ కిచెన్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బందిని కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలకు కేటాయించే బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు ప్రతి నెల 5వ తేదీలోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సీఐటీయూ మండల కన్వీనర్ కె. సోము నాయుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో పని భారం పెరుగుతున్నప్పటికీ సెలవుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినా సెలవులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు పదవీ విరమణ అనంతర ప్రయోజనాలు కల్పించాలని కోరారు.అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సత్యవతి, కార్యదర్శిగా మాణిక్యంను ఎన్నుకోగా, మరో ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో సత్యవతి, రాము, వరలక్ష్మి, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే. పుర్రె సత్యవతి పెద్దకర్మలో భావోద్వేగ వాతావరణం

**( అచ్యుతాపురం, జూన్ 4, ప్రభాతవార్త ):**



అచ్యుతాపురం మండలం ఎస్‌టిబిఎల్ గ్రామానికి చెందిన కీ.శే. పుర్రె సత్యవతి పెద్దకర్మ కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను స్మరించుకుంటూ పలువురు నివాళులర్పించారు. యలమంచిలి నియోజకవర్గం, ఉత్తరాంధ్ర జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ సతీష్ కుమార్ తన అమ్మమ్మ సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సత్యవతి తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న బంధువులు, గ్రామ పెద్దలు ఆమె నిరాడంబర జీవనం, కుటుంబ విలువల పట్ల చూపిన నిబద్ధతను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు.పెద్దకర్మ కార్యక్రమానికి వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, గ్రామ పెద్దలు, స్నేహితులు, బంధుమిత్రులు, కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సత్యవతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు సంప్రదాయ ఆచారాల మేరకు పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించగా, హాజరైన వారు మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ద్విచక్ర వాహన ప్రమాదం... ఇద్దరు మృతి

## ఒకరి పరిస్థితి విషమం



**డుంబ్రిగుడ, మే 03, ప్రభాతవార్త**

మండలంలోని ఆంధ్ర, ఒడిస్సా పిత మరి గూడ జంక్ష లో బైక్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో పాలైన సంఘటన. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై సురేస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాగర పంచాయతీ కుసుమగుడ గ్రామంలో బుధవారం ఉదయం బందువులతో శుభకార్యం జరిపించేందుకు గ్రామ పెద్దల నడుమ కార్యక్రమం కొనసాగింది. కిల్లోగుడ మీదుగా పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రం చటువాకు బైకుపై ముగ్గురు యువకులు అల్పహారాన్ని తీసుకునేందుకు బయలు దేరారని అన్నారు. ఇదే గ్రామానికి చెందిన తోటి స్నేహితులు డిప్పలి తేజేశ్వరరావు, చెడ్డా శేషుప్రవీణ్, వంతాల అరవింద్ ద్విచక్ర వాహనంలో బయలు దేరారని, చటువాలో అల్పహారం ముగించుకొని బైకులో తిరుగు స్వగ్రామానికి చేరుకునే క్రమంలో పిత్తమరిగుడ కూడలిలోని ప్రయాణికుల విశ్రాంతి భవనంలో బైక్ అదుపుతప్పి వేగంగా ఢీకొన్నారన్నారు. అదుపు తప్పిన బైకులో డిప్పలి తేజేశ్వరరావు(20) సంఘటన స్థలంలో మృతి చెందగా, కొన ఊపిరీతో ఉన్న చెడ్డా శేషుప్రవీణ్ (21)ను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించేలోగా మార్గ మధ్యలో మృతి చెందారని చెప్పారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడు వంతాల అరవింద్ కు వైద్య పరీక్షలను నిర్వహించిన వైద్య సిబ్బంది జిల్లా ఆసుపత్రి పాడేరుకు తరలించగా, అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖలోని కేజీహెచ్ కు తరలించారన్నారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే యువత హెల్మెట్ ధరించి నడాపాలని అవగాహన కార్యక్రమాలు పెడుతున్నప్పటికి యువతలో మార్పు రాకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, ఇప్పటికైనా యువతలో మార్పు రావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరిస్తూ ఈ సంఘటనపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# అల్లూరి జిల్లా విద్యుత్ శాఖ నూతన ఎస్ఈ విజయనంద్ బాధ్యతలు స్వీకరణ

**పాడేరు,జూన్3, ప్రభాతవార్త**



అల్లూరు సీతారామ రాజు జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ ఆఫీస్ నూతన ఎస్ఈగా వై.విజయనంద్ బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఈ జి.ఎన్ ప్రసాద్ శ్రీకాకుళం బదిలీపై వెళ్ళారు. అయన స్థానంలో ఈ ఈ/ టెక్నికల్ /కోనసీమ జిల్లాలో పని చేస్తూ పదోన్నతిపై ఎస్ఈగా అల్లూరి జిల్లాకు బదిలీ కావడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ/ టెక్నికల్ ఎల్ సిహెచ్ పాత్రుడు,డిప్యూటీ ఈఈ డి.భాస్కరావు, ఎఓ శ్యామల రావు, డివిజన్ ఈఈ పిన్ వేణుగోపాల్ మరియు ఇంజనీరింగ్ సిబ్బంది, ఆఫీస్ స్టాఫ్ పాల్గొనీ నూతన ఎస్ఈ విజయనంద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బూత్ స్థాయి బలోపేతంతోనే అభివృద్ధి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు



**డుంబ్రిగుడ, మే 03, ప్రభాతవార్త**

గ్రామస్థాయిలో బూత్ లెవెల్లో పార్టీ బలోపేతంతోనే అభివృద్ధి సాధ్యపడుతుంది. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కిడారి భవన్లో పోతంగి పంచాయతీ యూనిట్ ఇన్చార్జి రామునాయుడు ఆధ్వర్యాన మాసాంతర బూత్ లెవెల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు వెన్నుదున్నగా నిలుస్తోందని, కార్యకర్తల తోపాటు యూనిట్, బూతు లెవెల్లో బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బీమరాజు, బూత్ ఇన్చార్జి లైచోన్, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు సింహాద్రి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాను జోన్-1లో యధావిధిగా కొనసాగించాలి

## న్యూఢిల్లీ నేషనల్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య వినతిపత్రం -అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం వినతి

**పాడేరు, జూన్3, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాలను జోన్-1లోనే యధాతధంగా కొనసాగించాలనీ కోరుతూ న్యూఢిల్లీ నేషనల్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య విజయవాడలో బుదవారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి పేర్కొన్నారు. ఏజెన్సీ (గిరిజన) ప్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్రమైన జోనల్ వ్యవస్థ సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు.నూతన జోనల్ గెజిట్ ప్రతిపాదనల వల్ల గిరిజన ప్రాంత అభ్యర్థులకు, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని చైర్మన్‌కు వివరించినట్టువారు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన మండలాలను ఎటువంటి మార్పులు లేకుండా జోన్-1లోనే యధాతధంగా కొనసాగించాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానికత దెబ్బతినకుండా చూడాలనీ నేషనల్ కమిషన్ చైర్మన్ న్యూఢిల్లీ నేషనల్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య వివరించినట్టు వారు తెలిపారు. అల్లూరి జిల్లా 11 మండలాలను జోన్ 1లోనే కొనసాగించాలని దీనిపై చైర్మన్ చొరవ తీసుకుని, గిరిజన ప్రాంత ప్రత్యేక పరిస్థితులను, 5వ షెడ్యూల్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని జోనల్ వ్యవస్థపై గిరిజన ఉద్యోగులకు అనుకూలంగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరామన్నారు. చైర్మన్ కలిసిన వారిలో చింతపల్లి జోన్ సెక్రటరీ సాగిన కోటిబాబు పాల్గొన్నారు.

# చెత్తతో సంపద సృష్టిద్దాం..

## స్వచ్ఛ పథం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిషాంతి



**హుకుంపేట, జూన్ 03, ప్రభాతవార్త**

చెత్తతో సంపదను సృష్టించె దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ నిశాంతి కోరారు. హుకుంపేట మండలం కొంతిలి గ్రామ ప్రాంతంలో రోడ్డులో బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమాన్ని టి, డిఎల్‌పిఓ పిఎస్ కుమార్, ఇతర మండల స్థాయి అధికారులతో కలిసి స్వచ్ఛ పదం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి, తడి చెత్తతో వర్మి కంపోస్టు ఎరువులుగా తయారీ చేసి సంపద ద్వారాఉపాధి పందినప్పుడే పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. స్వచ్ఛ పథం' అనే కార్యక్రమం ప్రతి బుధవారం తప్పనిసరిగా గ్రామం పంచాయతీలలో నిర్వహించే ఒక నిరంతర పారిశుధ్య ఉద్యమం అన్నారు. పంచాయతీల్లో రోడ్ల పక్కన చెత్త కుప్పలను తొలగించడం, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, స్థిరమైన ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో రోడ్ల ప్రక్కన చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడం, సేకరించిన వ్యర్థాలను గ్రామాల్లోని వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు తరలించి అక్కడ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి, తడి చెత్తతో ఎరువుల తయారీ, పొడి చెత్తతో రీసైక్లింగ్ ప్రక్రియను చేపట్టడం ద్వారా పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, చెత్త ద్వారా సంపదను సృష్టించే దిశగా అడుగులు వేయాలని, కంపోస్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. అందునుండి వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు ఖర్చు చేసుకోవచ్చుని, తడి చెత్త ద్వారా తయారు చేసే వర్మి కంపోస్టును ఎరువుగా మార్చుకొని వినియోగించుకుంటే, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని కొంతమందికి ఉపాధి కల్పించవచ్చుని, వర్మి కంపోస్టులో పనిచేసే వారికి లబ్ది చేకూరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారిపి ఎస్.కుమార్, మండల్ పంచాయతీ అధికారులు, సచివాలయం సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం- కొట్టుకుపోయిన కల్వర్టు

## గిరిజన గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

**అరకు రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**



అరకు లోయ మండలం లోతేరు పంచాయితీలో రోడ్డు కాంట్రాక్టుల ఘోర నిర్లక్ష్యం బయటపడింది. నిబంధనల ప్రకారం పనులు చేయకపోవడం నాణ్యత లోపం కారణంగా స్థానిక కల్వర్టు ఒక్కసారిగా వరద తాకిడికి కొట్టుకుపోయింది. స్థానిక ప్రజలు తెలిపిన వివరాలు ప్రకారం ఈ కల్వర్టు నిర్మాణంలో కాంట్రాక్ట్ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పనులు పూర్తి చేయకుండా అరకొరగా వదిలేయడం వేసిన కల్వర్టులో నాణ్యత లేకపోవడం వల్ల కురిసిన సాధారణ వర్షాలకే కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దీనివల్ల లోతేరు పంచాయతీ పరిధిగల అంటిపర్తి, ముసిరిగూడ దుద్దుకోండి, అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితులకు వెళ్లాలన్న నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్న గిరిజనులు వాగు దాటలేక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవిస్తున్నారు. ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తాత్కాలికంగా నైనా రాకపోకలు సాగేలా మార్గం ఏర్పాటు చెయ్యాలని స్థానిక మాజీ వార్డ్ మెంబర్ కొర్ర. స్వామి, సుబ్బారావు, గంగు నాయుడు తదితరు డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార మే ఈ మండల గ్రీవెన్స్ వేదిక

## జిల్లా కలెక్టర్ నిశాంతి.టి.. ప్రజల వద్దకే పీజిఆర్ఎస్ 160 అర్జీలు



**హుకుంపేట, జూన్ 03, ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో హుకుంపేట మండల కేంద్రంలో ప్రత్యేక 'ప్రజా పరిష్కార వేదిక' (మండల గ్రీవెన్స్) కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ నిశాంతి తెలిపారు. బుధవారం ఘనంగా ఈ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెకర్ నిషాంతి.టితోపాటు జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ స్వయంగా పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలు, సీసీఎల్ఏ మేడం వారి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి వారం ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఈ మండల గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతవారం అనంతగిరిలో నిర్వహించగా, ఈ వారం హుకుంపేట మండలంలో దీనిని చేపట్టడం జరిగిందన్నారు. మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుండి అత్యధికంగా ప్రజలు పాల్గొని వారి సమస్యలను అర్జీ రూపేనా తయారు చేసుకుని వచ్చి అర్జీలు కలెక్టర్ ఇచ్చి వారి సమస్యలను తెలిపారు. సుమారు 6 గంటల పాటు నిరంతరాయంగా సాగిన ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో హుకుంపేట మండలం నుండి రికార్డు స్థాయిలో 160 అర్జీలు వచ్చాయని ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారని కలెక్టర్ తెలిపారు. మండలం నలుమూలల నుండి వచ్చి ప్రజలు వారి సమస్యలను తెలుపుతూ, అలాగే గత్తం తీగల వలస పంచాయతి నుండి వచ్చిన ప్రజలు రోడ్లు వేసి డోలిమోత నివారించాలని కోరారు. జిల్లాలో ప్రాథమిక వసతులకు ప్రాధాన్యం అలాగే ప్రజల నుండి ప్రధానంగా వచ్చిన సమస్యలలో, రోడ్లు, తాగునీరు (డ్రింకింగ్ వాటర్),విద్యుత్ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు, పివిటిజి గ్రామాలు 100 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇప్పటికే మంజూరై, గ్రౌండింగ్ దశలో కొన్ని పనులు, పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. సుమారు రూ. 400 కోట్ల విలువైన రహదారి పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో నిధుల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యల తక్షణ పరిష్కారం, ఆర్డబ్ల్యూఎస్ శాఖ సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉందని, ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే ఎంపీడీఓ, జడ్పీ సీఈఓలతో మాట్లాడి మండల నిధులు లేదా 'జల్ జీవన్ మిషన్' ద్వారా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రెవెన్యూ, సివిల్ వివాదాలు, రెవెన్యూ పరంగా వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంఆర్ఓ (తహశీల్దార్) వారికి ఆదేశాలు జారీ చేశారు. సివిల్ కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలపై స్పష్టమైన నివేదికలు ఇవ్వాలని, అవసరమైన చోట పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పన్నారు. ఈ రోజు నిర్వహించిన అత్యంత కీలకమైన ప్రత్యేక ప్రజా పరిష్కార వేదికకు ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన 4 నుండి 5 గురు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని అధికారులకు తక్షణమే 'షోకాజ్ నోటీసులు' జారీ చేసి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక ప్రజాలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ ప్రస్థానం దశాబ్ధాల కళ నెరవేరింది ..

## టీడీపీ సీనియర్ నాయకులు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు

**పాడేరు,జూన్3, ప్రభాతవార్త**



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్ధాల కళ తరాల పోరాటం కారణంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు అయిందని ఈ విజయం ప్రతీ ఒక్క తెలుగు ప్రజలదని, విభజన హామీనీ నెరవేర్చడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పట్టుదల ఫలించగా, ఇక నుంచి రైల్వే సమస్యల పైన భువనేశ్వర్‌పై ఆధారపడవలసిన అవసరం ఉండదనీ టిడిపి సీనియర్ నాయకులు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు పేర్కొన్నారు. కొత్త జోన్ ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా పారిశ్రామిక రంగంలో ఉపాధికి బాటలు వేస్తుందన్నారు. ఈ కీలక నిర్ణయం పైన టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్‌బాబు, ఎంపీ రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సీఎం రమేశ్‌కి, విశాఖ ఎంపీ భరత్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు టిడిపి నేత బొర్రా నాగరాజు తెలియజేసారు.

# బడి బయట వద్దు.. బడిలోనే ముద్దు..!

## విద్యార్థుల ప్రవేశాలకై ఉపాధ్యాయుల ప్రచారం



**కొయ్యూరు, జూన్ 3, ప్రభాతవార్త**

బడి బయట వద్దు.. భవిష్యత్తుకు బడిబాటే ముద్దు.. అంటూ మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని పెదమాక వరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీదేవి రాజుపేట, మునసల, బంగారం పేట, అంతాడ రత్నంపేట, చింతలపూడి గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను జాయిన్ చేసేందుకు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలు బడిబాట పట్టకుండా, బడి బయట తిరగడం వలన వచ్చే అనార్థాలను వివరించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను బడి బాట పట్టేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయుల కోరారు.

# ఈ నెల 7 నుండి 21 వరకు 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

**పాడేరు, జూన్3,ప్రభాతవార్త**



మండల స్థాయిలో నిర్వహించే ప్రత్యేక ప్రజా పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

### 100% జనగణన (సెన్సెస్) నమోదు

మండల స్పెషల్ అధికారులు ఎన్యూమరేటర్లతో ప్రత్యేకంగా సమీక్షించి, మండల పరిధిలో సెన్సెస్ నూటికి నూరుశాతం పూర్తి అయ్యేలా చూడాలన్నారు. మండల స్పెషల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి గ్రామంలోని, ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి వివరాలను సెన్సెస్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలా జరిగినట్లయితే అందుకు బాధ్యత స్పెషల్ అధికారులు వహించవలసి ఉంటుందని ఆమె హెచ్చరించారు.

### సెన్సెస్ వ్యత్యాసాలపై నిశిత పరిశీలన

గత 2011 సెన్సెస్ గణాంకాలకు, ప్రస్తుతం 2026లో నిర్వహిస్తున్న సెన్సెస్ వివరాలకు మధ్య ఎందుకు వ్యత్యాసం (డిఫరెన్స్) వస్తుందనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జనాభా పెరుగుదల తప్ప నమోదు ఎందుకు జరుగుతుందనేది ఎన్యూమి నేటర్లతో సమీక్షించి ప్రతి ఒక్కరిని నమో జరిగే విధంగా చూడాలన్నారు.

### యోగాంధ్ర విజయవంతం చేయాలి...

ఈ నెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు అన్ని గ్రామాలు, మండలాల్లో నిర్వహించ తలపెట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇందుకోసం కేటాయించిన అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని, కార్యక్రమం అద్భుతంగా జరిగేలా రూపకల్పన చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాట్లకై పిడిఆర్ డిఏ, పిడి డ్వామా, పిడిఐసిడిఎస్, జిల్లా వైద్య శాఖ అధికారిని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో పోలీస్ అధికారుల సహకారంతో కార్యక్రమం సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసి) ఎంవీఎస్ లోకేశ్వరరావు, పిజి ఆర్ ఎస్ నూరాల అధికారి బి నీలకంఠరావు, జిల్లా అధికారులు, ఎంపీడీవో, మండల తహశీల్దార్, పాల్గొన్నారు.

# బూత్ స్థాయి బలోపేతంతోనే అభివృద్ధి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు

**డుంబ్రిగుడ, జూన్ 03, ప్రభాతవార్త**



గ్రామస్థాయిలో బూత్ లెవెల్లో పార్టీ బలోపేతంతోనే అభివృద్ధి సాధ్యపడుతుంది రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కిడారి భవన్లో పోతంగి పంచాయతీ యూనిట్ ఇన్చార్జి రాము నాయుడు ఆధ్వర్యాన మాసాంతర బూత్ లెవెల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు వెన్నుదున్నగా నిలుస్తోందని, కార్యకర్తలతోపాటు యూనిట్, బూతు లెవెల్లో బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బీమరాజు, బూత్ ఇన్చార్జి లైచోన్, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు సింహాద్రి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్రపతి సమావేశంలో పాల్గొన్న డుంబ్రిగుడ వాసి గిరిజన బిడ్డ శీను శెట్టి

**డుంబ్రిగుడ, జూన్ 03 ప్రభాతవార్త**



ఢిల్లీలో భారత గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ గత 10 నుంచి ఈనెల 10వరకు జన జాతీయ కరీమా ఉత్సవ్ను జరుపుతోంది బిర్స లీవ్స్ ఇన్ న్యూ భారత్ వీక్ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము గౌరవార్ధం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డుంబ్రిగుడ గ్రామానికి చెందిన శెట్టి శ్రీను రాష్ట్రపతి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో గిరిజన వర్గాల సహకారం, వారసత్వం, గౌరవాన్ని చాటిచెప్పే విధంగా ఉండాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్య పరచాలన్నారు. రాష్ట్రపతి సమావేశానికి ఆహ్వానానికి పాల్గొవడం తనకు దక్కిన గొప్ప గౌవరంగా భావిస్తూ, తూచ్చ తప్పకుండా గిరిజనుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శెట్టి శ్రీను పేర్కొన్నారు.

# ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 12 ఏళ్ళ పాలనపై ఘనంగా వేడుకలు నిర్వహించాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి పిలుపు



**పాడేరు,జూన్3,ప్రభాతవార్త**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరి పాలన విజయోత్సవాలపై బీజేపీ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని బిజెపి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి పిలుపు నిచ్చారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు జిల్లా కార్యాశాల బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిశీలకులు పుట్టా గంగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు ప్రజా సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు చేరువ య్యాయని తెలిపారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నుండి జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రతి కార్యకర్త, ప్రతి కుటుం బం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రధానమంత్రి మోడీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ గ్రామస్థాయి నుండి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వ హించాలని ఆయన సూచించారు. యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కురుసా ఉమామహేశ్వరావు, సార్ పాడేరు అసంబ్లీ ఇంచార్జి సల్లా రామకృష్ణ,లకే స్వాతి, పండా ఈశ్వరావు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగవరంలో గ్రామదేవత గంగాలమ్మ తల్లి క్రికెట్ టోర్నీ

## బహుమతులు అందించి చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య

**కొయ్యూరు, జూన్ 3 ప్రభాతవార్త**



మండలంలోని మంప పంచాయతీ, గంగవరం గ్రామంలో గ్రామ దేవత గంగాలమ్మ తల్లి జాతర క్రికెట్ టోర్నీని గ్రామ పెద్దలు, యువత ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలో క్రికెట్ టోర్నీ సందర్భంగా సందడి నెలకొంది. గ్రామంలోనే కాక చుట్టుపక్క గ్రామాల కు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఇదిలా ఉండగా చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, కాకరపాడు వాస్తవ్యులు జర్త శ్రీనివాసరావు మొదటి బహుమతిగా రూ. 8వేలు, రెండవ బహుమతిగా రూ. 5వేలు, మూడవ బహుమతిగా రూ.2వేలు అందించారు. ఈ టోర్నమెంట్లో మంప ఆర్య టీం మొదటి బహుమతి సాధించగా, రెండో బహుమతి బూరుగుపాలెం బి టీం సాధించగా, మూడవ బహుమతి చిక్కుడుపాడు వినయ్ టీం గెలుపొందారు. ఈ కార్యక్రమందీ గ్రామ పెద్దలు సాగిన రామకృష్ణ, పోతురాజు గాంధీ ఆధ్వర్యంలో జరగగా, కోసూరు రాంబాబు, గంగవరం యూత్, గ్రామ పెద్దలు, చిక్కుడుపాడు సాగిన లోవరాజు, సోమెల పండయ్య, మల్లయ్య, నిమ్మల నూకరాజు, సాగిన నడిపయ్య, బాలకృష్ణ, ప్రసాద్, అలాగే మంప వనపల రామారావు, దాసరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూముల్లో రసాయన ఎరువులు తగ్గించాలి

## మండల వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్

**కొయ్యూరు,జూన్ 3, ప్రభాతవార్త**



భవిష్యత్తు తరాల కోసం వ్యవసాయ సాగులో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరు వుల వాడకం పెంచాలని మండల వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని చిట్టింపాడు, రామన్నపాలెం గ్రామాల్లో ఖేత్ బచావో అభియాన్ 2026 నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శివరాం ప్రసాద్ మాట్లాడుతూ భూమిని ఆరోగ్యవంతంగా ఉండేలా పరిరక్షించుకోవాలని అలాగే సిఫార్సు చేసిన మందులు, ఎరువులు తగిన మోతాదులో వేయాలన్నారు. ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువులు జీవన వెలుగులు, వినియోగం నత్రజని అధికంగా వాడడం నీటిని పొదుపుగా వాడటం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సహాయ అధికారి శశాంక్ పాల్గొన్నారు.

# పొల్లిగుడలో పిడుగుపాటుకు 8 మేకలు మృతి

## నష్టపరిహారం చెల్లించాలని - ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

**అరకు రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**



అరకులోయ మండలంలోని లోతేరు పంచాయతీ పొల్లి గుడ గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి 8 మేకలు మృతి చెందాయి. ఎప్పటి లాగానే కొండపైకి మేకలను మేతకు తీసుకుని వెల్లగా, ఆకస్మికంగా భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో 8 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. పిడుగు పాటుకు పొల్లి గూడ గ్రామానికి చెందిన బట్నాయక్ భాస్కర్‌కు చెందిన మూడు మేకలు, బట్నాయక్ శ్రీరాములుకు చెందిన రెండు మేకలు, కేరంగి చంపకు చెందిన మూడు మేకలు మృతి చెందినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఆదివాసి గిరిజనులకు చెందిన 8 మేకలు పిడుగుపాటుకు మృతి చెందడంతో ఆర్థికంగా వారు తీవ్రంగా నష్టపోయారని వారికి ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఈ సందర్భంగా కోరారు. పిడుగు పడి మేకలు మృతి చెందిన విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పొద్దు బాలదేవ్ తెలిపారు.

4-6Pg7exHMNWJQE.qxd:4-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:50 AM Page 1





జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా

## చిన్నారుల వికాసానికి 'నవచేతన'

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** ఆరేళ్ళలోపు చిన్నారుల ఎదుగుదలను పరిశీలించేందుకు నవచేతన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో నవచేతన కార్యక్రమంపై మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఉదయం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల్లో ఎదుగుదల ఆలస్యాలను, వైకల్యాలను ప్రారంభదశలోనే గుర్తించి వారికి తక్షణ సహాయక సేవలు అందించేందుకు ప్రభుత్వం నవచేతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత మొబైల్, డిజిటల్ టూల్స్ ద్వారా పిల్లల ఎదుగుదల స్థాయిని అంచనా వేస్తారని చెప్పారు. చిన్నారులు మానసిక, శారీరక, భాషా, సామాజిక, స్వయం సహాయక నైపుణ్యాలను పరిశీలించి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పిల్లల ప్రవర్తన, మాట, కదలికలను పరిశీలించి డేటాను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. తల్లిదండ్రులకు అవగాహ కల్పిస్తూ అవసరమైన పిల్లలను వైద్య, ఇతర నిపుణుల వద్దకు రిఫర్ చేస్తారని కలెక్టర్ వివరించారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యిరోజులే కీలకమని, మొదటి మూడేళ్ళలో మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎదుగుదల సమస్యలను ప్రారంభంలోనే గుర్తించటం వల్ల సత్వరమే సరైన చికిత్స అందించవచ్చున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయశాఖల అధికారులు, సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డియంహెచ్ఓ డాక్టర్ జె.ఇందుమతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శరత్, ఆర్‌బిఇఎస్‌కెపిఒ డాక్టర్ జి.మాధవీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### ఒడిశా టు బెంగళూరు వయా చిత్తూరు

## అక్రమంగా గంజాయి రవాణా

- రూ.16.88 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- ఇద్దరు అంతర్‌రాష్ట్ర నిందితులు అరెస్టు



**చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:** ఒడిశా రాష్ట్రం నుండి కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు జోరుగా గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. ఒడిశా రాష్ట్రం నుండి గంజాయి స్మగ్లర్లు విశాఖ, విజయవాడ మీదుగా తిరుపతి అక్కడి నుండి చిత్తూరు మీదుగా బెంగళూరుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్యకు గంజాయి అక్రమ రవాణాపై పక్కా సమాచారం అందడంతో మంగళవారం ఇన్స్‌పెక్టర్ వి.శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ఈశ్వరయ్య, డిప్యూటీ తహసిల్దారు జయంతి, పోలీసు సిబ్బంది వరిగిపల్లి జంక్షన్ నుండి బ్యాన్స్ హోటల్ మధ్య వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక కారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరల్లో చాకచక్యంగా పెద్ద ఎత్తున దాచిపెట్టిన 39.6 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రం మాల్కన్‌గిరి జిల్లా, ఒర్కల్ మండలం, తర్లకోట బానూర్ గ్రామంకు చెందిన దీక్షిత్ సుక్రిత్(22), ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందనూర్ తాలుకా బదేల్ గ్రామంకు చెందిన మురలీధర్ బురడీ(33)లను ఎస్ఐ ఈశ్వరయ్య అరెస్టు చేశారు. డీఎస్పీ వెంకట నారాయణ మాట్లాడుతూ నిందితులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని అక్రమంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా కర్నాటక రాష్ట్రంకు తరలించి అక్కడ ఒక కేజీ గంజాయి రూ.30 వేలకు విక్రయిస్తారని తెలిపారు. ఈ అక్రమ రవాణా ముఠాలో మరికొంతమంది ప్రమేయం వుందని తేలడంతో వారిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారంపై పోలీసులకు ఎలాంటి రాజీ వుండదని, ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సమాచారం ఎదైనా వుంటే నిర్భయంగా పోలీసులకు అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సమావేశంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ నాయుడు, యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పోలీసుల వినూత్న ప్రయోగం

- ఎన్‌డిపిఎస్ కిట్లతో గంజాయి రాయుళ్ళకు పరీక్షలు



**సూళ్లూరుపేట, జూన్ 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పోలీసు శాఖ ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పురోగతి సాధించింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సీఐ ఎం. మురలీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గంజాయి సేవించిన ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుకొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్న నేపథ్యంలో అధునాతన (ఎన్‌డిపిఎస్) కిట్లను ఉపయోగించి అనుమాని తులకు శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆరుగురు వ్యక్తులు గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా తేలడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పట్టుబడిన వ్యక్తులను విచారిస్తున్న అధికారులు, వారికి గంజాయి ఎక్కడి నుంచి అందుతోంది, ఎవరు సరఫరా చేస్తున్నారు, వారి వెనుక ఏదైనా ముఠా పనిచేస్తుందా అనే కోణాల్లో లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ ప్రాంతాలతో పాటు పరిశ్రమల పరిసరాల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్సై అజయ్ కుమార్, తడ ఎస్ఐ కొండప నాయుడు సూళ్లూరుపేట రూరల్ ఎస్సై సుబ్రమణ్య రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రమాదంలో గాయపడ్డ ఉద్యోగి మృతి

**కోవూరు (నెల్లూరు), జూన్ 3, ప్రభాతవార్త:** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని అమరాన్ బ్యాటరీ సమీపంలో మంగళవారం రాత్రి నెల్లూరు నుంచి కోవూరుకు స్కూటీలో వస్తున్న సోమశిల ప్రాజెక్టు ఆఫీస్‌లో స్టెనోగా పనిచేస్తున్న తిరుమలశెట్టి మల్లికార్జున రావు అడ్డుగా కుక్క రావడంతో రోడ్డుపై పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- అన్ని బిల్లులు ఆన్‌లైన్‌లో ఉంచాలి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగులేటి నారాయణ అధికారులను కోరారు. విజయవాడలోని మురళీఫార్ర్చ్యూన్ హోటల్‌లో బుధవారం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టుల అమలులో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ, కేటాయించిన పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యమిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇంజనీరింగ్ పనుల్లో ఎదురవుతున్న భూ, సాంకేతిక, ఏజెన్సీ సమస్యల పరిష్కారం కోసమే ఈ వర్క్‌షప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లతో ప్రతి 15రోజులకు జోన్‌ల వారీగా సమీక్ష సమావేశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 2019లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్



ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబి) ద్వారా రూ.5,350 కోట్లు నిధులు మంజూరు కాగా గత ప్రభుత్వం వాటిని వినియోగించుకోలేదని మంత్రి తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ.3 వేల కోట్లతోపాటు ఇతర ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉపయోగించుకోలేదన్నారు. స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కార్పోరేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

మురుగునీటి శుద్ధి ప్రక్రియలో పూర్తిపారదర్శకత పాటించాలని, ప్రతి రూపాయి ఖర్చును ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించారు. మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఎస్‌టిపి ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు నెల్లూరు, విజయవాడలో నిధులు మంజూరయినట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 70 అన్నాక్యాంటిన్‌లు ఏర్పాటు చేసామని, మరో 5క్యాంటిన్‌లను పదిరోజుల్లో ప్రారంభం కానున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 153లక్షల టన్నుల వ్యర్థాల్లో 128టన్నుల వ్యర్థాలను తొలగించామని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన పనులను పూర్తి చేయాలని నారాయణ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎపియుడిఐఎఫ్‌సి చైర్మన్ పిలా గోవింద సత్యనారాయణ, యండి. డాక్టర్ పి.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎపి కేబినెట్ భేటీ

- అమరావతి అభివృద్ధి, కీలక విధాన, నిర్ణయాలపై ఫోకస్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నేడు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, పలు విధానపరమైన నిర్ణయాలు భూ కేటాయింపులు తదితర కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అమరావతిలో హైకోర్టు భవనాల పరిసరాల్లో రూ.547 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ ఆమోదం తెలపనున్నాట్లు సమాచారం. అలాగే ఏపీసీఆర్డీఏ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు ప్రతిపాదనకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. రాజధాని ప్రాంత అభివృద్ధిలో భాగంగా తొమ్మిది జిల్లాల పరిధిలో అమరావతి ఎకనామిక్ రీజియన్‌కు సంబంధించి ఆర్ఎఫ్పీ ప్రక్రియకు ఆమోదం లభించే అవకాశం ఉంది. సీఆర్డీఏకు సొంత అగ్నిమాపక విభాగాన్ని ఏర్పాటు చేయడంపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పిపిపి విధానంలో డిజైన్- బిల్డ్- ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ మోడల్ ద్వారా అమరావతిలో జాయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలపనుంది. ఈ ప్రాజెక్టు రాజధాని ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎల్పీఎస్ లేఅవుట్లలో వీధిపోట్లు ఉన్న ప్రాంతాల్లో ఏటీఎంలు, కియస్కులు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను పిపిపి లేదా జాయింట్ వెంచర్ విధానంలో ఏర్పాటు చేయడం వంటి అంశాలు కూడా సమావేశంలో చర్యకు రానున్నాయి. నేగోషియబుల్ సెటిల్మెంట్ పాలకీ కింద అనువుగా లేని ప్లాట్లకు గ్రామకంఠంతో ఐదు సెంట్ల వరకు భూమి కేటాయింపుకు ఆమోదం తెలిపే అవకాశముంది. అలాగే రాజధాని ప్రాంతాలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టిమ్ ఏర్పాటుకు సంబంధించిన టాబ్రీడ్ ఒప్పందాన్ని రద్దు చేసి, కొత్తగా టెండర్లు పిలిచే అంశంపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఎల్పీఎస్ లేఅవుట్లలో 485 మంది రైతుల అలాట్‌మెంట్ కోడ్‌లు మారిన నేపథ్యంలో వారికి రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు కల్పించే ప్రతిపాదనపై కూడా చర్చించి ఆమోదం తెలుపనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పలు సంస్థలకు భూ కేటాయింపుల అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో ప్రాధాన్యం పొందనుంది. సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తల్లికి వందనం పతకానికి నిధులు విడుదలపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ పతకం అమలుకు అవసరమైన ఆర్థిక వనరులపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక రాజకీయ పరంగా కూడా సమావేశం ప్రాధాన్యం సంతరించకుంది. కూటమి ప్రభుత్వం పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉంది. అలాగే రెండేళ్ల కూటమి పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై కూడా పరీక్ష నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మహిళల, బాలల అక్రమ రవాణాను అడ్డుకుంటాం

- మంత్రులు అనిత, సంధ్యారాణి

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల బాలల అక్రమ రవాణాను తీవ్ర స్థాయిలో అడ్డుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంద్యారాణి స్పష్టం చేశారు. స్త్రీలు పిల్లల జోలికి వచ్చిన వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ 3వ బ్లాక్, 1వ అంతస్తు కాన్ఫరెన్స్ హాల్‌లో కీలక సమావేశంలో మంత్రివర్యులు గుమ్మిడి సంద్యారాణి, హోంమంత్రి వంగలపూడి అనిత సంయుక్తంగా నిర్వహించారు. మహిళలు చిన్నారుల భద్రత మరియు రక్షణకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో బాలల రక్షణ వ్యవస్థల బలోపేతంపై అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో బాలల అక్రమ రవాణా, తప్పిపోయిన పిల్లలు, విడిపిచెట్టిబడిన పిల్లలు, యాచకులుగా జీవిస్తున్న చిన్నారులు మరియు ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిలలల గుర్తింపు, రక్షణ, పునరావాస చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, హోంశాఖల సమన్వయంతో వన్ స్టాప్ సెంటర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని బాధిత మహిళలు, చిన్నారులకు వేగవంతమైన సహాయ సేవలు అందిస్తున్నాయని మంత్రులు తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను హోమ్ శాఖతో కలిసి సామాన్యం చేసుకోవాలని సమీక్ష చేపట్టారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సేవల అమలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రత, సంక్షేమం ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యత అని మంత్రులు స్పష్టం చేశారు.

## కొవ్వూరు, నిడదవోలు, మండపేట ఆసుపత్రుల్లో

# రూ.5.63 కోట్లుతో అదనపు సౌకర్యాలు

- ఆమోదించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి పుష్కరాల్లో భారీ స్థాయిల్లో పాల్గొనే ప్రజల వైద్యానసరాల నిమిత్తం స్తానికంగా ఉన్న 3 సెకండరీ ఆసుపత్రులను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా కొవ్వూరూలోని ప్రాంతీయ ఆసుపత్రి నిడదవోలు మరియు మండపేటలోని కమ్యూనిటీ మెల్త్ సెంటర్లలో అదనపు నిర్మాణాలు, సౌకర్యాల కోసం రూ.5.63 కోట్ల వ్యయంతో ప్రణాళికను వైద్యారోగ్య శాఖ మంత్రికి సత్యకుమార్ యాదవ్ బుధవారం నాడు ఆమోదించారు. పుష్కరాల్లో పవిత్ర స్నానాలు చేసేందుకు భారీగా రానున్న ప్రజల అవసరాల మేరకు ఈ మేదు ఆసుపత్రులను తగు రీతిని అభివృద్ధి చేయాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ చేసిన విన్నపంపై ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి సత్యకుమార్ వివిధ ప్రతిపాదనలు సమ్మతి తెలిపారు. మండపేట సీహెచ్‌సీ అభివృద్ధి కోసం రూ.3.75 కోట్లతో పలు పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 30 పడకలతో నడుస్తున్న ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే పనిలో భాగా రానున్న పుష్కరాల సందర్భంగా అవసరమైన చర్యల్ని చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు సూచించారు. ఇందులో భాగంగా ఆసుపత్రి భవన రెండవ ఫ్లోర్లనిర్మాణ పనుల్ని పూర్తి చేయడంతో పాటు అనుబంధ నిర్మాణాలు, సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. నిడదవోలు, సీహెచ్‌సీకి సంబంధించి రూ. 1 కో టి ఖర్చుతో అదనపు ఓపి కన్సల్టేషన్ గదులు, 8 టాయిలెట్లు, 270 మీటర్ల మేరకు ప్రహారీ గోడ నిర్మాణం సీసీ రోడ్ల నిర్మాణం, జనరేటర్, బోర్‌వెల్ ఏర్పాటు వైద్య పరికరాలు మరియు ఫర్నీచర్ కొనుగోలు నీరు, విద్యుత్ సరఫరాలకు సంబంధించి పనులు చేపడతారు. కొవ్వూరు ప్రభాత్యాసుపత్రిలో రూ.88 లక్షల ఖర్చుతో దెబ్బతిన్న ఫ్లోరింగ్ మార్పిడి పనులు, డ్రైనేజి వ్యవస్థ అభివృద్ధి పైకప్పు మరమ్మతులు ఆసుపత్రి భవనానికి రంగులు వేయడం కొత్త ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ ఏర్పాటు బాత్రూరూంలకు మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపడతారు.

## గురజాడ గురుతులు... సజీవ స్మృతులు

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్ కల్యాణ్ చొరవతో అభ్యుదయ కవి నివాస గృహ పునరుద్దరణ. ఆడిటోరియం నిర్మాణానికి రూ1.20 కోట్లతో ప్రతిపాదనలు చేసారు. గురజాడ రచనల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభించారు. విశాఖ సేనతో డీసీఎం పవన్ కల్యాణ్ సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి. ఈ మేరకు జనసేన కార్యాలయ వర్గాలు సమాచార ప్రకటన విడుదల చేసాయి. ప్రముఖ సంఘ సంస్కర్త, అభ్యుదయ కవితా పితామహుడిగా పేరుగాంచినగురజాడ అప్పారావు జ్ఞాపకాలను భావితరాలకు అందిస్తా నని ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. పురావస్తు శాఖ సహకారంతో 150 ఏళ్ల క్రితం ఆయన నివాసం ఉన్న ఇంటి పునరుద్దరణ పనులు చేపట్టారు. ఆ నివాసానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో సాంస్కృతిక శాఖ సహకారంతో రూ.1.20 కోట్లతో ఆడిటోరియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్దం చేశారు. దీంతోపాటు గురజాడ అప్పారావు రచనల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురజాడ అప్పారావు నివాస గృహం శిథిలావస్థకు చేరిన విషయాన్ని వార్తా పత్రికల ద్వారా తెలుసుకుని, విశాఖపట్నంలో నిర్వహించిన సేనతో సేనాని సభలో ఆ ఇంటి పునరుద్దరణతో పాటు ఆడిటోరిజం నిర్మాణం, రచనల డిజిటలైజేషన్‌కు హామీ ఇచ్చారు. విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని ఈ నివాస గృహంలోనే గురజాడ అప్పారావు కన్యాశుల్కం రచన చేశారు.

### 3వ విడత భూసర్వే కింద 721 గ్రామాలకు రూ.72,10,000 నిధులు

విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో 3వ విడత భూసర్వే కింద 721 గ్రామాలకు రూ.72,10,000 నిధులు (గ్రామానికి రూ.10,000 చొప్పున) విడుదల చేస్తూ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు వెంటనే వినియోగానికి వస్తాయి. ఏపీలో రెవెన్యూశాఖ భూసర్వేను నిర్వహిస్తుంది.

# దళితులపై అణిచివేతకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహార్

**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాల్ నందు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల కమిషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు, ఐఏఎస్ అధికారి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు భిక్షం మేకల, రామాంజనమ్మ, ఇతర కమిషన్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉదయం 10.00 గంటల నుండి పిజిఆర్ఎస్ హాల్ నందు ప్రజల నుండి నేరుగా సమస్యలపై అర్జీలను స్వీకరించే కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళితులు, వివిధ వర్గాల ప్రజల నుండి దాదాపు 170 వినతులు/అర్జీలను కమిషన్ చైర్మన్, సభ్యులు స్వయంగా స్వీకరించి, బాధితుల సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 02.00 గంటల నుండి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా దళితుల మీద ఎటువంటి దాడులు, అణచివేతలు జరగకుండా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దళితుల రక్షణకు, హక్కులకు భంగం కలగకుండా చట్టాలను పకడ్బందీగా అమలు పరుస్తామని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, ఎస్సీ సబ్ ప్లాన్, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ, సాధికారత అధికారి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెడ్డి బాలాజీతో పాటు, జిల్లా, మండల స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డిఎస్సీ బాధితులకు అండగా ఉంటాం




**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** డీఎస్సీ నియామక ప్రక్రియల్లో తమకు అన్యాయం జరిగిందంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన అభ్యర్థులకు ఆయన పూర్తి మద్దతు ప్రకటించారు. న్యాయపరంగా పోరాటం చేసే అభ్యర్థులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడమే కాకుండా లీగల్ ఖర్చులన్నింటినీ పార్టీ భరిస్తుందని హామీ ఇచ్చారు. అభ్యర్థులతో సమావేశమైన జగన్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనపై ఇప్పటికే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు.

ప్రస్తుతం అన్యాయం జరిగిందని ఆరోపణలు వస్తున్న ప్రతి కేసుపై భవిష్యత్తులో రీ-ఎంక్వైరీద నిర్వహిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపడతామని చెప్పారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై జగన్ ప్రశ్నలు లేవనెత్తారు. పరీక్షలు నిర్వహించకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వడానికి జీవో జారీ చేశారని, నియామకాలు పూర్తయ్యాక అదే జీవోను మార్చి కొత్త జీవో తీసుకువచ్చారని విమర్శించారు. మొదట తీసుకొచ్చిన జీవో ఎవరికోసం, ఎవరికి ప్రయోజం చేకూర్చడానికి అన్నది ప్రశ్నార్తకంగా మారిందన్నారు. కొందరికి మేలు చేసేలా వ్యవస్థను ఉపయోగించుకుని, పని పూర్తయిన తర్వాత జీవోను ఉపసంహరించకున్నారని ఆరోపించారు.

క్రీడా కోటా పోస్టుల భర్తీలో పారదర్శక కనిపించడం లేదని జగన్ వ్యాఖ్యానించారు. మొదటి ర్యాంకులు సాధించి అబ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వెరిఫికేషన్ హాజరు కాలేదనే కారణాలు చెబుతున్నప్పటికీ, అదే అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడం వెనుక కారణాలను ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరిక్షల నుంచి నియామకాల వరకు అనేక అంశాలు వివిదాస్పదంగా మారాయని జగన్ అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు నుంచి ఎంపికల వరకు అనేక అంశాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థుల గ్రీవెన్స్‌లకు కూడా సరైన సమాదానాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం చెబుతున్న వివరాల్లో స్పష్టత, పారదర్శకత లోపించాయని విమర్శించారు. ఇదిలా ఉండగా మీడియాతో మాట్లాడిన డీఎస్సీ అభ్యర్థులు కూడా నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

స్పోర్ట్స్ కోటాలో టెట్, బీఈడీ వంటి అర్హతలు లేకపోయిన కొందరికి ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. 1:1 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచినప్పటికీ తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని వాపోయారు. అలాగే కొందరు పేర్లు ఎంపికై వారి జాబితలోనూ తిరస్కరించిన వారి జాబితాలోనూ లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు జగన్. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే పోస్టులను స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు కేటాయించామని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు.

నేషనల్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన అభ్యర్థులను కూడా పక్కన పెట్టారని పేర్కొన్నారు. జరిగిన పరిణామాలు, అనుమానాలు, అవకతవకలపై పూర్తి వివరాలను జగన్ దృష్టికి తీసుకెళ్లామని అభ్యర్థులు తెలిపారు. తమ సమస్యలను ఆయన ఓపికగా విన్నారని అసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జగన్ భరోసా ఇచ్చారని వెల్లడించారు.

### పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ కోసం

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన వాక్-ఇన్ రిక్రూట్‌మెంట్ విజయవంతమైంది. డీఎంఈ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో నోటిపై చేసిన 8 పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డీవీఎల్ విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం 79 మంది హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియ అనంతరం ఖాళీలను భర్తీ చేశామని బోర్డు సెక్రటరీ తెలిపారు.

## మద్యం రవాణా వ్యవస్థనూ అక్రమ ఆదాయాలకు వాడినట్లు ఇడి గుర్తింపు

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిది:** ఏపీ మద్యం కుంభకోణం కేసు రోజుకో మలుపు తిరుగుతుంది, ఈ కేసులో మరో కీలక ఆర్థిక అంశాన్ని ఈడీ గుర్తించింది. మద్యం రవాణా వ్యవస్థనూ అక్రమ ఆదాయాలకు వాడినట్లు ఈడీ గుర్తించింది. పాలసీ అమల్లో వ్యక్తులు, సంస్థలు కలిసి సిండికేట్‌గా పనిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డిస్టిలరీల నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్స్ వసూలు చేసినట్లు గతంలో ఈడీ గుర్తించగా, ఇప్పటివరకు రూ.1,048 కోట్ల కిక్‌బ్యాక్ ట్రైల్‌ను ఈడీ గుర్తించింది. మద్యం రవాణా కాంట్రాక్టులూ సిండికేట్ నియంత్రణలో ఉన్నాయని గుర్తించడం గమనార్హం. ట్రాన్స్‌పోర్ట్ ద్వారా కూడా అక్రమ లాభాలు ఆర్జించినట్లు బయటపడిందని ఈడీ పేర్కొంది. లాజిస్టిక్స్, అధిక బిల్లులు, షెల్ కంపెనీలతో నిధుల మళ్లింపునూ పరిశీలిస్తోంది. రియల్‌ఎస్టేట్, బంగారం, షెల్ కంపెనీలు, ఫ్రంట్ ఎంటిటీలతో మనీలాండరింగ్ చేశారన్నారు. ఇప్పటికే సుమారు రూ.441 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది.

4skl13:4skl13.qxd 03-06-2026 20:46 Page 1



## మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన



**సంతకవిటి, జూన్ 3, ప్రభాతవార్త :**

మండలం మందరాడ, అక్కరాపల్లి గ్రామాల్లో బుధవారం ఎస్సై ఆర్.గోపారావు మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి గ్రామస్తులకు చెప్పారు. అలాగే అక్కడక్కడ సైబర్ మోసాలు బాగా జరుగుతున్నాయి. కాబట్టి జాగ్రత్తగా ఉండండి మొబైల్‌లో ఎటువంటి ఓటీపీలు కూడా చెప్పకండి. తెలియని లింకులపై క్లిక్ చేసి మీ డబ్బులను పోగొట్టుకోకండి. అలాగే ఎక్కడికక్కడ మహిళలపై అత్యాచారాలు, బంగారు దొంగతనాలు జరుగుతున్నాయి. కాబట్టి జాగ్రత్త వహించండి. రహదారి భద్రతా చర్యలు తప్పక పాటించండి. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాహనాల నడిపేటప్పుడు అతివేగంగా ప్రయాణించకుండా జాగ్రత్త వహించండి. హెల్మెట్ ధరించి వాహనాలు నడపండని ఎస్సై సూచించారు.

## ఐతం విద్యార్థులకు టిసిఎస్‌లో ఉద్యోగాలు



**టెక్కలి, జూన్ 3, ప్రభాతవార్త :**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల లో చేపడుతున్న ప్రాంగణ నియామకాలలో, 2026 గ్రాడ్యుయేషన్‌కు చెందిన సి ఎస్ ఈ, ఈ సి ఈ, మరియు ఈ ఈ ఈ. విభాగాలకు చెందిన 39మంది విద్యార్థులు టి సి ఎస్ సంస్థకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. వీరికి పి ఎ ఎన్ ఇండియా స్థాయిలో నియమిస్తూ, ప్రథమ వార్షిక వేతనంగా 3.46 నుండి 7 లక్షలు ప్యాకేజీ అందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు డైరెక్టర్‌తో పాటు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎమ్.సంతోష్ కుమార్, తదితరులు అభినందించారు.

## ఏరియా ఆసుపత్రిలో అందుబాటులోకి మార్చురీ ఫ్రీజర్



**సీతంపేట, జూన్ 3, ప్రభాతవార్త :**

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రెండు మార్చురీ ఫ్రీజర్లు అందుబాటులోకి వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు బుధవా రం తెలిపారు. గతంలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన మృతదేహాలను పాలకొండ ఏరియా ఆసుప్రత్రిలో శవ పరీక్షలు నిర్వహించే వారని ప్రస్తుతం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మార్చురీ అందుబాటులోకి తీసుకురావడం, శవపరీక్షలు ఇక్కడే నిర్వహిం చడానికి వీలుకలుగుతుందన్నారు. మార్చురీ ఫ్రీజర్‌ను ఆసుపత్రి ఆర్ఎంఒ డివి శ్రీనివాసరావు పరిశీలించారు.

## ఖరీఫ్‌లో రైతులకు అండగా ఉండండి

### ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్




**వీరఘట్టం, జూన్ 3, ప్రభాతవార్త:**

ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి అండగా ఉండాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ విషయంలో నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు సక్రమంగా విత్తనాలను పంపిణీ చేపట్టాలని ఆయన చెబుతూ, ఎరువులు కూడా కొరత లేకుండా కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న కాలువలను మరమ్మత్తులు జరిపించి ఖరీఫ్ సీజన్ నాటికి సకాలంలో సాగునీటిని పంపిణీ చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న పదం తన చెవిలో పడకూడదని ఆయన గట్టిగా నొక్కి వక్కాణించారు. గతంలో పనిచేసిన సర్పంచులకు రావలసిన గౌరవ జీతభత్యాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, తహశీ ల్దార్ ఏ.సాయి కామేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణ, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు...!

### బుక్ లెట్‌ను ఆవిష్కరించిన విక్రాంత్, కళావతి



**వీరఘట్టం, జూన్ 3, ప్రభాతవార్త :**

సీఎం చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు సందర్భంగా బుధవారం పాలకొండ నియోజక వర్గ కేంద్రంలో శాసన మండలి సభ్యులు వారి కార్యాలయంలో ఎమ్మెల్సీ, నియోజకవర్గ పరిశీల కులు పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతిల ఆధ్వర్యంలో నిరసనతో పాటు పోస్టర్‌ను, బాబు మోసాల మేనిఫెస్టో బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. జూన్ 4వ తేదీన మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్లలో టీడీపీ మ్యానిఫెస్టో, బాబు, పవన్ సంతకాలు చేసిన బాండ్లు, పత్రికా ప్రకటన కాపీలు దహన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జూన్ 8, 9 తేదీల్లో నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో టౌన్ హాల్ సదస్సులు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జూన్ 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనకు నిరసనగా బారీ ర్యాలీలు కార్యక్రమాలని చేపట్టాలన్నారు. పై తేదీల్లో పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీలో గల ముఖ్యనేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని పై నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయగలరని వారు ఈ సందర్భంగా కోరారు.

## గంటల వ్యవధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ నియామకం



**రాజాం, జూన్ 3 ప్రభాతవార్త:**

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస స్వర్ణ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ని నియమించాలని రాజాం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ బుధవారం స్థానిక ఎమ్మెల్యేని కోరారు. వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడంతో తల్లికి వందనం, కొత్త ఫించన్ల నమోదు వంటి వాటిపై ప్రజలకు సేవలు అందించలేక పోతున్నామని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌కి ఫోన్ చేసి తక్షణమే నియమించాలని కోరారు. దీంతో కమిషనర్ సైతం వెంటనే స్పందించి బుచ్చంపేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణిని వారంలో 3 రోజులు (మంగళవారం, గురువారం, శనివారం) పని చేయాలని లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసారు. కొన్ని గంటల వ్యవధిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ని తమ సచివాలయంకి నియమించినందుకు పొనుగుటివలస గ్రామస్తులు ఆనందంతో తమ నాయకుడు శాసపు రమేష్ కుమార్‌కి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావుకి కృతజ్ఞలు తెలిపారు.

## బూరాడకి శ్మశాన వాటిక స్థలాన్ని ఇప్పించరూ

### సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు పాండ్రంకి శ్రీనివాసరావు



**రాజాం, జూన్ 3, ప్రభాతవార్త:**

రాజాం మండలం దోసరి గ్రామంలో పర్యటించిన ఎస్సీ కమిషన్ మెంబర్ రావాడ సీతారాంను కలిసి రేగిడి మండలం బూరాడ గ్రామంలో దళితులకు స్మశాన వాటిక స్థలం లేక చాలా ఏళ్ళుగా ఇబ్బంది పడుతున్నారని దయచేసి వారికి సర్వే నెంబర్ 185/5 లో ఉన్న స్థలాన్ని ఇప్పిస్తారని విజయనగరం జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు పాండ్రంకి శ్రీనివాసరావు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రెయ్యి రామకృష్ణ, రేగిడి మండల దళిత జేఏసీ అధ్యక్షులు తేగల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం

**కోటబొమ్మాళి, జూన్ 3 , ప్రభాతవార్త :**

మండలంలోని చిన్నసాన గ్రామానికి చెందిన బోనేల శ్రీను కుమారుడు కూర్మారావు ఇటీవల క్యాన్సర్ వ్యాధితో బాదపడుతూ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెక్కలి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ బుధవారం రూ. 10వేలును మృతుడు తండ్రికి అందజేశారు. ఆయనతో పాటు బోనేల ఎల్లయ్య, రొక్కం శ్రీధర్, పినకాన వైకుంఠరావు, తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై బిఎల్‌వోలతో శిక్షణ



**ఇచ్ఛాపురం, జూన్ 3 ప్రభాతవార్త:**

ఇచ్చాపురం నియోజకవర్గ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా భాగంగా ఇచ్ఛాపురం రోటరీ క్లబ్‌లో నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అధ్యర్యంలో బూత్ లెవెల్ ఆఫీసర్‌ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చాపురం నియోజకవర్గం వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులుగా నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, పైల దేవదాసు రెడ్డి, ఉలాల భారతీ దివ్య, బోర పుష్ప తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు, బలివాడ ప్రకాశరావు పట్నాయక్, కారింగి మోహన్ రావు హాజరయ్యారు. ఏఈఆరఓలు, ఎన్యూమరేషన్ సూపర్వైజర్‌లు, నియోజకవర్గంలోని 299 బూత్‌ల బిఎలఓలు సాలిన గాంధీ, ఆశి కృష్ణారెడ్డి లోపింటి దీనబంధు రెడ్డి, దుక్క ధనలక్ష్మి, దుక్క ఆనంద్, మునకాల వీరాస్వామి రెడ్డి, దక్కత నూకయ్య రెడ్డి మద్దు వెంకటరావు, ఆశి పురుషోత్తం రెడ్డి, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.

## విత్తన గుళికలపై అవగాహన



**కంచిలి, జూన్ 3, ప్రభాతవార్త :**

కంచిలి మండలం కర్తలి గ్రామంలో ఎల్ నేనో ప్రభావానికి తగ్గట్టుగా రైతులు పంటలు వేసే విధంగా చేయాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ, మండల ఎంఏఓ కే.సురేష్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శివానందం, రైతులకు విత్తన గుళికలపై అవగాహన మరియు రైతులు సమక్షంలో విత్తన గుళికలు ఎలా తయారు చేయాలో చేసి చూపించారు. ముందుగా విత్తనాలకు బీజామృతంతో విత్తన శుద్ధిచేసి, ఒక మూడు లేయర్లుగా బంకమట్టిని విత్తనాలకు పట్టించాలి. మధ్య మధ్యలో మంచినీరు వేస్తూ బంకమట్టి పట్టించాలి. ఒక నాలుగు లేయర్లు ఘనజీవంతో పట్టించాలి. లాస్ట్ లేయర్‌గా బూడిదను ఒక లేయరు పట్టించాలి. దీనివలన విత్తనం నుంచే వచ్చే తెగుళ్లు భూమి నుంచి వచ్చే తెగుళ్లు బీజామృతం వలన నివారణ అవుతుంది. బంకమట్టి వలన భూమిలో వేడిని వాతావరణం, వేడికి విత్తనం పాడవకుండా కాపాడుతుంది. మొక్క కొద్ది రోజులు నీరు లేకపోయినా బ్రతకడానికి సహాయపడుతుంది. బూడిద వేసే నీరుని విత్తనం పాడవకుండా పీలుస్తుంది. రైతులకు ఏదో ఒక పంట నుండి సంవత్సరం మొత్తం ఆదాయం వస్తుందని అడిషనల్ డీపీఎం ధనుంజయ్, మార్కెట్ ఎనఎఫఏ శివాజీ రైతులకు వివరించారు. గ్రామ పెద్దలు, లీడ్ ఫార్మర్స్ ఐ సి ఆర్ పి బి పుష్ప, మీనా, మద్ది హేమలత, మద్ది జ్యోతి, శ్రీరంజిత, కళ్ళ రేవతి హాజరయ్యారు.

## నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యం



**పాతపట్నం, జూన్ 3 ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యత కలిగిన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించి, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ తిరుమ లరావు పిలుపునిచ్చారు. బుధవారం పాతపట్నంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండలంలోని అన్ని పాఠశాలల వంటకులు, సహాయకులకు (కుక్ కమ్ హెల్పర్స్) డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కృష్ణారావు, టీచర్లు యం.వి.రమణ, సీఆరఎంటీలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు టిడిపి పెద్దపీట



**ఆమదాలవలస, జూన్ 3 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్ పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి, ఎన్ని శ్రీదేవి, తదితరులు తెలిపారు. ఆమదాలవలస టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు మహానాడు వేదికగా మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహిళలకు చట్టసభల్లో గౌరవం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవకాశం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ మాజీ కౌన్సిలర్ సిహెచ్ భారతి, బండి లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడుల్లో 3,800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



**సీతంపేట, మే 3, ప్రభాతవార్త:**

నాటు సారా తయారీని అరికట్టే చర్యల్లో భాగంగా సీతంపేట మండలంలోని ఉమ్మిగడ్డ, కొత్తవలస గ్రామాల మధ్య ఉన్న గెడ్డ ప్రాంతంలో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 3,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమ సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని నిర్మూలించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్టీఎఫ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.వి.వి.ఎస్.శేఖర్ బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.చంద్రకాంత్, సిబ్బంది టి.శేషగిరి, సి.హెచ్.చిన్నారావు పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ హెచ్చరించారు.

## న్యూరాలజీలో గోల్డ్ మెడల్ సాధించిన చింతాడ




**ఆముదాలవలస, జూన్ 3 (ప్రభాతవార్త):**

మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు కృష్ణాపురానికి చెందిన యువ వైద్యురాలు డాక్టర్ చింతాడ మౌనిక న్యూరాలజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. చింతాడ రాజగోపాలరావు, భారతి దంపతుల కుమార్తె మౌనిక విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, అనంతరం అదే కళాశాలలో ఎండి (జనరల్ మెడిసిన్ )తో పాటు డీ.ఎం న్యూరాలజీలో సూపర్ స్పెషాలిటీ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. తండ్రి రాజగోపాలరావు రాజమహేంద్రవరం జిల్లా లోక్ అదాలత్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి భారతి గృహిణి. విజయవాడలో నిర్వహించిన వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మౌనిక గోల్డ్ మెడల్ అందుకున్నారు.

## ఎంపీ రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిరిపురం దంపతులు



**పాతపట్నం, జూన్ 3 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పాతపట్నం నియోజకవర్గం బీజేపీ బీఎలఏ-1 సిరిపురం త్రివేణి దంపతులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఈటల నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో బీజేపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు అనుసరించాల్సిన వివిధ వ్యూహాలపై ఈటల స్పందించారు. జిల్లాలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై సిరిపురం దంపతులకు ఆయన పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఈటల ను సిరిపురం దంపతులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏపీపీడీసీఎల్ ఎస్ఈగా త్రినాథరావు



**వీరఘట్టం, జూన్ 3 ప్రభాతవార్త :**

ఏపీపీడీసీఎల్ ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పార్వతీపురం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పెద్దిం టి త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయ నగరంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై పార్వతీపురం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం త్రినాథరావు పార్వతీపురం మన్యం కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిసింది. కాగా, ఇక్కడ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన కె.మల్లికార్జునరావు విశాఖపట్నంలో జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్ అండ్ కమర్షియల్)గా బదిలీపై వెళ్లారు. జిల్లాలో విద్యుత్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా ముగిసిన ఎన్ఈఆర్ ప్రీమియర్ లీగ్-మోదీ కప్

### -విజేతగా జేఆర్‌పురం టీమ్




**రణస్థలం, జూన్ 3, ప్రభాతవార్త :**

యువతలో క్రీడాస్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా గత 20 రోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన ఎన్ ఇ ఆర్ ప్రీమియర్ లీగ్-మోదీ కప' క్రికెట్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ఎనఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో అత్యంత వైభవంగా ముగిసింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కుమా రుడు, యువనాయకుడు ఎన్.తేజ బాబు ఆధ్వర్యంలో ఈ మెగా టోర్నీ విజయవంతంగా నిర్వహించబడింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి మొత్తం 72 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్ ఎంతో ఉత్కంఠగా సాగింది. సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగగా ఫైనల్ పోరులో అద్భుత ప్రదర్శన కనబరిచిన జేఆర్‌పురం జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎనఇఆర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి జేఆర్‌పురం జట్టు (రూ.1,00,000 నగదు, మెగా ట్రోఫీ గెలపొందగా, ద్వితీయ బహుమతి ముద్దాడ జట్టు రూ.50,000 నగదు, రన్నరప్ ట్రోఫీ, తృతీయ బహుమతి చిన్నయ్యపేట జట్టు రూ.25,000 నగదు, ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అల్లివలస జట్టుకు చెందిన ప్రతిభావంతుడైన క్రీడాకారుడు రాజు అందుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిషిణి జగన్నాథంనాయుడు, డిజిఎం ఆనందరావు, లంక శ్యామలరావు, దెయ్యం శ్రీనివాసరావు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామం సేవలపై ప్రజల ఫీడ్ బ్యాక్ సేకరణ

**పాతపట్నం, జూన్ 3 ప్రభాతవార్త :**

మండలంలోని సింగుపురం స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని మండల స్వర్ణ గ్రామాల నోడల్ అధికారి బి కృష్ణారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందుతున్న వివిధ రకాల సేవలు, సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం స్వర్ణగ్రామంలో పని చేస్తున్న సిబ్బంది పనితీరుపై ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## స్వచ్ఛతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి

### -ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎనఇఆర్ -రణస్థలంలో ఘనంగా 'స్వచ్ఛ పథం' కార్యక్రమం

### -రోడ్లను శుభ్రం చేసిన ఎమ్మెల్యే , కూటమి నాయకులు




**రణస్థలం, జూన్ 3 ప్రభాతవార్త:**

పరిశుభ్రమైన పల్లెలు, సురక్షితమైన ఆరోగ్యమే లక్ష్యంగా ప్రజలంతా స్వచ్ఛతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కమ్మసిగడాం జంక్షన్ వద్ద పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బృహత్తర పారిశుధ్య కార్యక్రమం 'స్వచ్ఛ పథం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సాధన కోసం ఈ 'స్వచ్ఛ పథం' అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని స్పష్టం చేశారు. పరిశుభ్రమైన పల్లెలు-సురక్షితమైన ఆరోగ్యం అనే ప్రధాన సంకల్పంతోనే ప్రభుత్వం ఈ బృహత్తర పారిశుద్ధ్య యజ్ఞాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిషిణి జగన్నాథంనాయుడు, వెలిచేటి చిన్న మౌళి, దన్నాన సత్తిబాబు, బొట్ల రాంబాబు, దన్నాన స్వామినాయుడు, జేని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## రోహిణా.... మజాకానా

### -భానుడి భగభగలతో జనం విలవిల.. రోడ్లన్నీ నిర్మానుష్యం



**కోటబొమ్మాళి, జూన్ 3 ప్రభాతవార్త :**

'రోహిణికర్తల్లో రోళ్ళు బద్దలవుతాయనే' నానుడి మాట నిజమే అని తెలుస్తోంది. రోహిణికార్తె ప్రారంభం కావడంతో బుధవారం కోటబొమ్మాళిలో - 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత విపరీతంగా ఉండడంతో ప్రజలు విలవిల్లాడారు. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో అధిక ఉష్ణోగ్రతతో ఇళ్ల నుంచి బయటలకు రాలేక, ఇంట్లో ఉండలేక ఎక్కపోతతో తీవ్ర అవస్థలు పడ్డారు. నిప్పులు కురిపించేలా ఎండ నెత్తిని మాడుస్తుంటే పాదచారులు రహదారులపై నడిచేందుకు నానా అవస్థలు పడ్డారు. తప్పని పరిస్థితుల్లో ఎండ నుంచి రక్షణగా మహిళలు చున్నీలు, గొడుగులు, పురుషులు రుమాళ్ళు, టోపీలు ధరించి రాకపోకలు సాగించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగిపోయింది. మధ్యాహ్నం 41 డిగ్రీలు నమోదైయ్యింది. సాయింత్రం 6 గంటల వరకు 36 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి ఏడు గంట వరకూ వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోయారు. వృద్ధులు, పిల్లలు నానా హైరానా పడ్డారు.

## ఇప్పిలి రాహుల్‌కు సన్మానం



**కంచిలి, జూన్ 3 ప్రభాతవార్త :**

కంచిలి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి అయిన ఇప్పిలి ప్రవీణ్ కుమార్ మరియు శ్రీలక్ష్మిల కుమారుడు ఇప్పిలి రాహుల్ దేశంలో అత్యున్నత విద్యా ప్రమాణాలు కలిగిన ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా కంచిలి హై స్కూల్ ఉపాధ్యాయులు మరియు బీపీ కాలనీ ప్రజలు దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## కార్మికుల పోరాటానికి మాజీ ఎమ్మెల్యే కిరణ్ సంఘీభావం

### -తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



**రణస్థలం, జూన్ 3 ప్రభాతవార్త :**

న్యాయమైన హక్కుల కోసం, యాజమాన్య వేధింపులకు వ్యతిరేకంగా శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 కార్మికులు చేస్తున్న నిరసనకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సమన్వయకర్త గొర్లె కిరణ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. మండలంలోని వరిశాం ప్లాంట్-2 వద్ద బుధవారం కార్మికులంతా కుటుంబాలతో కలసి చేస్తున్న 48 గంటల దీక్షకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని, వారికి తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. రాత్రింబవళ్లు కష్టపడి, చెమటోడ్చి సంస్థ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడే కార్మికులను యాజమాన్యం వేధించడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గొర్లె శ్రీనివాస రావు, మజ్జి రమేష్, సిఐటియూ నాయకులు, పి తేజేశ్వరరావు, అమ్మన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పకడ్బందీగా నిర్వహించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 3, ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ ఐ అర్) పకడ్బందీగా నిర్వహించాలని ఈఆరఓ బి.పద్మావతి బీఎలఓలకు ఆదేశించారు. నియోజక వర్గంలో గల నాలుగు మండలాలలో మ్యాపింగ్ శరవేగంగా పూర్తి చేయాలన్నారు. బుధవారం తాహశీల్దార్ ఎన్.వెంకటరావు అధ్యక్షతన స్థానిక రోటరీ హాల్‌లో నాలుగు మండలాల తాహశీల్దార్లు, బీఎలఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీఎలఓలకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎసఐఆర్)2026పై అవగహన కల్పించారు. నిర్లక్ష్యం వీడి పూర్తిస్థాయిలో ఇంటింటి మ్యాపింగ్ పూర్తి చేయాలని తెలియజేశారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(ఎసఐఆర్) అనేది భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పక్కాగా దోష రహితంగా తయారు చేయటానికి ఇంటింటికి నిర్వహించే సర్వే దీని ప్రధాన ఉద్దేశం కొత్త అర్హులైన ఓటర్లు నమోదు మరణించిన లేదా నకిలీ ఓటర్ల తొలగింపు, పాత వివరాలను సరి చేయటమే నన్నారు. కార్యక్ర మంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే వికృత చేష్టలు

**కోటబొమ్మాళి, జూన్ 3, ప్రభాతవార్త:**

మండలంలోని దంత పంచాయతీలో కూటమి ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్ర మాలు చూడలేక గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని అదే గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త చల్ల సింహాచలం అన్నారు. ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలు వ్యత్యించి రహదారుల నిర్మాణం, పదుల సంఖ్యలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేయడం, అవసరమున్న చోట సిమెంట్ రోడ్లు నిర్మాణం, వందలాది మంది ఉపాధి వేతనదా రులకు ఉపాధి కల్పించడం వంటివి ఉన్నాయన్నారు. ఇవన్నీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## దళితుల భూములను కాపాడిన ఎస్సీ కమిషన్ మెంబర్ రావాడ

**రాజాం, జూన్ 3, ప్రభాత వార్త:**

దళితుల భూముల విషయంలో గత రెండు రోజుల క్రితం ఇచ్చిన అర్జీకి తక్షణమే స్పందించి దోసరి రామినాయుడు వలస దళితులకు కేటాయించిన భూములను అప్పగించడం జరిగిందని సమత సైనిక దళ్ సభ్యులు పాండ్రంకి శ్రీనివాస రావు తెలిపారు. ముందుగా గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ రావాడ సీతారాం పోలీసులు,రెవెన్యూ సిబ్బందితో పా టు సందర్శించి 1985లో ఆ గ్రామ దళితులకు (ఎస్సీ మాల) ఇవ్వబడిన దాదాపు ఐదు ఎకరాల (డి పట్టా)భూమిని ఆ గ్రామ పెత్తందా రుల ఆక్రమణ నుండి కాపాడి తిరిగి దళితులకు ఇప్పించడం జరిగింది. ఈ క్రమంలో అలనాటి ప్రభుత్వం ఇచ్చి న పట్టాలు, రెవిన్యూ మ్యాప్ వగైరా ఆధారాల న్నింటిని రెవె న్యూ, పోలీసుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించారు.

**CHANGE OF NAME**

I, **PATNALA KRISHNAKUMARI,** W/o Late CHANDRAMOULEESWARA RAO R/o D.No. 00, Chinnabaratam Veedhi, Near Kalanikethan, Srikakulam Town and District, Pin -532001. Have changed my name from **KRISHNA KUMARI** (Old name) to **PATNALA KRISHNAKUMARI** (New name). Henceforth I will be called as **PATNALA KRISHNAKUMARI** (New name) for all purpose.

**CHANGE OF NAME**

I, **POTNURU KASTURI BAI,** W/o Late SURYA RAO R/O House No.448, Kumutisahi, Parlakhemundi, Gajapathi District,Odisha-761200. Have changed my name from **PATNUR KASTURI BAI** (Old name) to **POTNURU KASTURI BAI** (New name). Henceforth I will be called as **POTNURU KASTURI BAI** (New name) for all purpose.

**CHANGE OF NAME**

I, **RAMA KRISHNA POTNURU** S/o LATE SURYA RAO R/o House No. 448, Kumutisahi,Parlakhemundi, Gajapathi District, Odisha-761200Have changed my name from **PATNUR RAMA KRISHNA** ( Old name) to **RAMA KRISHNA POTNURU** (New name). Henceforth I will be called as **RAMA KRISHNA POTNURU** (New name) for all purpose.

**CHANGE OF NAME**

I, **POTNURU SWAPNA,** W/o RAMA KRISHNA POTNURU R/O House No. 448, Kumutisahi,Parlakhemundi, Gajapathi District, Odisha-761200. Have changed my name from **PATNUR SWAPNA** (Old name) to **POTNURU SWAPNA** (New name). Henceforth I will be called as **POTNURU SWAPNA** (New name) for all purpose.

4-6Pg9th cheli.qxd:4-6Pg9th cheli.qxd 1/1/02 6:26 AM Page 1



# దోసకాయ,కందిపప్పుతో మటన్ కర్రీ



సాధారణంగా దోసకాయను పప్పులో,రోటి పచ్చడిగా చేసుకోవడం అలవాటు ,ఒకసారి దోసకాయతో మటన్ కూర వండాను, కానీ గ్రేవీ లూస్‌గా ఉంది, అందుకే ప్రయోగంగా ఉడికించిన కందిపప్పు కలిపి ,చింతచిగురు పొడి కలిపి చూసా అదిరింది రుచి.

**కావలసినవి :** అరగంట ఫ్రిజ్‌లో మారినేట్ చేసి ఉంచిన మటన్ 1/2కిలో,దోసకాయముక్కలు 3కప్పులు, ఉడికించిన కందిపప్పు1కప్పు, చింతచిగురు పొడి3 టేబుల్స్పూన్లు, మటన్ మసాలాపొడి ఏ బ్రాండ్ అయినాసరే 2టేబుల్స్పూన్లు, 2తరిగిన 2టమాటలు ముక్కలు ,పచ్చిమిరపకాయలు 3,నిమ్మకాయ ఒకటి,తరిగినకొత్తిమీర, పుదీనా, కకరివేపాకు 1 కప్పు, ఉల్లిపాయ ముక్కలు 1కప్పు,పోపులోకి మసాలా దినుసులు :లవంగాలు 4,ఏలకులు 2,చెక్కముక్క 1",బిరంజి ఆకులు 2, జాపత్రి ఒకఆకు ,గరం మసాలా 1 టేబుల్ స్పూన్, నూనె 5టేబుల్ స్పూన్లు ,వినిగర్2 టేబుల్ స్పూన్లు.

**తయారుచేసే విధానం :** స్టవ్ వెలిగించి , కుక్కర్ పెట్టి ,వేడెక్కాక, నూనె వేసి,వేడెక్కాక మసాలా దినుసులు వేసి, వేగాక ఉల్లిపాయ ముక్కలు వేసి బ్రౌన్ కలర్‌కు తిరిగాక, వినిగర్,అల్లంవెల్లుల్లి ముద్ద ,ఉప్పు, పసుపు, కారం,పుదీనా, కొత్తిమీర,మటన్ మసాలా పొడి,నిమ్మకాయ చెక్కలురెండూ పిండాలి, పెరుగు 1/2 కప్పుతోమారినేట్ చేసిన మటన్ ముక్కలు వేసి, కొంచము సేపు మగ్గించి ఉడకడానికి సరిపడా నీళ్లు సుమారు 3కప్పులనీళ్లు పోసి మూత పెట్టి, కుక్కర్ 6,7విజిల్సు వచ్చేదాకా మీడియం మంటలో ఉంచి కట్టేయాలి స్టవ్. చల్లారాక మూత తీసి, ఉడికించి ఉంచుకున్న కంది పప్పు, తరిగి ఉంచుకున్న దోసకాయ ముక్కలు సైజు మీ ఇష్టం, పెద్ద స్క్వేర్ ముక్కలుగా కట్ చేసి వేసి ,కుక్కర్ మళ్ళీ మూతపెట్టి మీడియం మంటలోనే 3 విసిల్లు వచ్చాక స్టవ్ కట్టేసి, చల్లారాక మూత తీసి తరిగిన పుదీనా, కొత్తిమీర,కరివేపాకుతో బాటు గరం మసాలా పొడివేసి కలిపి,మరీ గట్టిగా కలిపకండి, దోస ముక్కలు చితికి పోకుండా చూడండి కుక్కర్‌లోనుండి డైరెక్ట్‌గా సర్వ్ చేసుకోవడం కన్నా పెద్ద పాత్రలోకి వంపి వడ్డించుకోండి, కందిపప్పుతో వండిన కర్రీ కదా చిక్కని గ్రేవీ రుచిగా అన్నము లోకానీ, సంకటిలోకానీ బహు యమ్మీగా నోరూరించే వంటకం రెడీ.

**- పరిమి శ్యామల రాధాకృష్ణ**

# న్యాయ పీఠంపై 'మోహన' రూపం



తమిళనాడులోని కోయంబత్తూరులో ఒక సాధారణ జూనియర్ న్యాయవాదిగా ప్రస్థానం మొదలెట్టిన వి.మోహన నేరుగా ఇప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగారు. బెంచి నుంచి సుప్రీం ధర్మాసనానికి ఎంపిక చేసే న్యాయమూర్తులు వృత్తి ధర్మానికి ఎంత విలువ ఇస్తారో ఎంత సంయనం పాటిస్తారో, న్యాయశాస్త్ర అంశాలపై క్షుణ్ణమైన అవగాహన ఉందో లేదో అన్న వాటిపై సుదీర్ఘ పరిశీలన చేసిన తర్వాతనే కొలీజియం ప్రతిపాదిస్తుంది. ఈ విధంగా నేరుగా బెంచినుంచి సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఎలివేట్ అయిన వారిలో మోహన అ'ద్వితీయులు. ఆమె కుటుంబ నేపథ్యం చూస్తే న్యాయ వారసత్యవాద కుటుంబం కాదు. జస్టిస్ ఇందూ మల్హోత్రా అడ్వొకేట్ ఆన్ రికార్డుగా ఉన్న సమయంలో జస్టిస్ మోహన ఆమెను సాన్నిహిత్యంతో దగ్గరనుండి గమనించిన సందర్భంగా స్ఫూర్తి పొందారని చెప్పాలి. బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన వారిలో ఇందూ మల్హోత్రా తర్వాత మోహన రెండవవారు. ఆమె ఢిల్లీలో ప్రాక్టీసుకు రాగానే 'అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్'లో కెక్కడానికి కఠోర శ్రమ చేశారు. ఆమె పదోన్నతి భారతీయ న్యాయ చరిత్రలో ఒక అరుదైన ఘట్టాన్ని ఆవిష్కరిస్తోంది. 2018 జస్టిస్ ఇందూ మల్హోత్రా వేసిన బాటలోనే ఆమెతో కలిసి పనిచేసిన వి.మోహన సుప్రీం ధర్మసనానికి చేరిన రెండోమ హిళాన్యాయవాదిగా ఆమె ఖ్యాతి గడించారు. దేశ స్వాతంత్ర్యం సాధించాక సర్వోన్నత న్యాయస్థానంలో పనిచేసిన మహిళా న్యాయ మూర్తుల్లో మోహన 12వ వారు. కఠోరశ్రమ, అంకిత భావం, పట్టుదల ఉన్నవారే జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోగలరని జస్టిస్ మోహన ప్రస్థానం చెబుతోంది. భారత సైన్యంలో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్లను సాధించి పెట్టిన కృషిలో మోహన ప్రధాన భాగస్వామి. మహిళలకు సమానత్వం సాధించడంలో ఆమె ఘనవిజయం సాధించింది. అంతేగాక వయోవృద్ధుల హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో హక్కుల పోరాటంలో ఆమె ఎన్నో సున్నితమైన అంశాలను స్పృశించింది. న్యాయవాద వృత్తిలో ప్రకాశించిన ప్రతి ఒక్కరూ జస్టిస్ మోహన స్థాయిలో పరిశ్రమ చేస్తే న్యాయ వృత్తి నైపుణ్యం, న్యాయ శాస్త్రాల కూలంకష అధ్యయనం చేయగలిగితే ఉన్నత శిఖరాల నధిరోహించడం అత్యంత సులభం.

**చిట్కా:** 40 సంవత్సరములవారికి జుట్టు నెరవడం సహజం. 14 నుంచి 40 మధ్యలో నెరిసే జట్టుకు విటమిన్‌లు, ప్రొటీన్ లు లోపం కూడా కావచ్చు. ఇన్‌ఫెక్షన్‌వల్ల కూడా జరుగుతుంది. తెల్ల వెంట్రుక తీసివేయదలచినపుడు 4 నుండి 5మి.మీ. మొదల్లో వదిలి మిగతాభాగం తుంచివేయాలి. ఎక్కువభాగం తెల్లవెంట్రుక లైతే వెజ్‌హెర్బల్‌హెయిర్ డై చేయడం తప్పనసరిసరి.

# బాధ్యతల తోటిదే భగవద్భక్తి

**ఒకసారి రామకృష్ణ** పరమహంస వద్దకు ఉన్నతోద్యోగి అయిన ఓ గృహస్థ భక్తుడు వచ్చాడు. అతడు గురువర్యా! నాకు కార్యాలయ ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతలు పెరిగిపోయాయి.ఆధ్యాత్మిక సాధన కొన సాగించలేకపోతున్నాను. సంసార కర్తవ్యం నిర్వర్తిస్తున్నప్పుడు భగవంతుడ పై ధ్యాస ఉండటం లేదు. ఆధ్యాత్మిక కార్యకలాపాల కారణంగా ఇంటి విషయా ల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతు న్నాను. రెంటికీ సమన్వయం కుదర్చటం ఎలా? అనడిగాడు అది విన్న రామకృష్ణ పరమహంస నాయనా! అదంత కష్టమైన దేం కాదు. మనసులో దేనికెంత చోటు ఇవ్వాలో తెలిస్తే.. అయోమయం, అల జడులు ఉండవు. ఉదాహరణకు వడ్లు దంచే స్త్రీలనే చూడు. ధాన్యం దంచు తుంటారు. రోట్లో గింజల్ని కదిలిస్తుం టారు. నలిగిన గింజల్ని పైకి తోడుతుం టారు. మరోవైపు పక్కనున్న చంటిబిడ్డని లాలిస్తుంటారు. అదే సమ యంలో అటుగా వచ్చిన కొను గోలు దారులతో బేరసారాలు సాగిస్తుంటారు. ఇన్ని పనులు చేస్తున్నా, రోకలి పోటుకు చేయి ఎక్కడ నలిగి పోతుందోనని మనసును ముప్పావు శాతం వేళ్ల మీదే ఉంచు తారు. అలాగే గృహస్థులు నాలుగో వంతు మనసుతో సంసార విధులు నిర్వహించాలి. మిగిలిన మూడొంతులా భగవంతుడి మీదుంచాలి అంటూ హితవు పలికారు.

# చిన్నారుల స్నేహం ..



**కొంతమంది పిల్లలు ఇంట్లో చలాకీగా ఉండి,** స్కూల్లో, బయట ఎవ్వరి తోనూ కలవకుండా ముభావంగా ఉంటారు. మీ చిన్నారుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తు న్నాయా? అయితే వారికి బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువులతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవుతుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడాలన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవుతుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సానుకూలంగా స్పందించాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయత్నించమని చెప్పాలి. చిన్న పిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలంగా నాటుకుపోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే భిన్న సంస్కృతులు, సంప్రదాయాల పట్ల వారికి అవగాహన ఏర్పడుతుంది. *

# వ్యథ: చికిత్స, కౌన్సెలింగ్ కలిపి చేయండి !

**ప్రశ్న :** మా అమ్మాయి వయస్సు 25 ఏళ్ళు. బిటెక్ పాల య్యింది కొన్నాళ్ళు చెన్నైలో ఉద్యోగం చేసింది. భయం, భయం అంటూ ఏడాది క్రితం ఇంటికి వచ్చేసింది. తరువాత దూరవిద్య ద్వారా ఎంబీఏలో చేరింది. అప్పుడప్పుడు దేవుని పూనకం వచ్చేది. ఒక సైకాలజిస్టు వద్దకు తీసుకుని వెళ్ళాము. ఆయన కౌన్సెలింగ్ చేయడం వల్ల కొంత మార్పు వచ్చింది. పూనకం రావడం తగ్గింది. గత రెండు నెలల నుంచి మళ్లీ భయం అంటోంది. ఒక్కోసారి తీవ్రమైన కోపం ప్రదర్శిస్తోంది. చేతిలో ఉన్న వస్తువులు విసురుతోంది. తాను చనిపోతే నన్ను బాగా చూసుకోమని మా వారికి చెపుతోంది. ఎప్పుడూ తన గదిలోనే ఉంటోంది. దీనితో సైకాలజిస్టును సంప్రదిస్తే సైకియాట్రిస్ట్‌కు చూపమన్నారు. సైకియాట్రిస్టు అన్ని పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. అవి వేడుకుంటే ఒక కాలు పట్టేసింది. బిపి తగ్గి పోయి బాత్ రూంలో పడి పోయింది. దీనితో మందులు మానేశాము. మందులు వాడకుండా కౌన్సెలింగ్ ద్వారా మా అమ్మాయిని మార్చడానికి వీలవుతుందా చెప్పగలరు. **- ఒక సోదరి, నెల్లూరు.అమ్మా,**

**జవాబు:** మీ అమ్మాయి పరిస్థితి చూస్తే ఇది కేవలం 'భయం' లేదా 'పూనకం" మాత్రమే కాదు; మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్య కావచ్చు. తీవ్రమైన భయం, ఒక్కసారిగా కోపం రావడం, వస్తువులు విసరడం, ఒంటరిగా ఉండటం, 'నేను చనిపోతే.."వంటి మాటలు చెప్పడం వంటి లక్షణాలను నిరక్ష్యం చేయకూడదు. ఇది ఆమె తప్పు కాదు, కుటుంబం తప్పు కాదు. 'దెయ్యం పట్టింది' వంటి అపోహలతో చూడాల్సిన అవసరం లేదు. కొన్ని మానసిక ఆరోగ్య సమస్యలు ఇలాంటి రూపంలో బయటపడవచ్చు. సరైన చికిత్స, కుటుంబ సహకారం ఉంటే చాలా మందిలో మంచి మార్పు కనిపిస్తుంది. ఇప్పటికే కౌన్సెలింగ్ వల్ల కొంత మార్పు వచ్చిందంటే అది మంచి సంకేతం. అయితే ప్రస్తుతం లక్షణాలు మళ్లీ ఎక్కువ వుతున్నందున, కేవలం కౌన్సెలింగ్ సరిపోతుందా లేదా మందులు కూడా అవసరమా అన్నది సైకియాట్రిస్టు నిర్ణ యించాలి. మందులు వేసుకున్న తర్వాత కాలు పట్టేయ డం, బీపీ తగ్గిపోవడం, బాత్‌రూమ్‌లో పడిపోవడం వంటి ఇబ్బందులు వచ్చినట్లయితే, మందులు పూర్తిగా ఆపేయ కుండా వెంటనే అదే సైకియాట్రిస్టుకు లేదా మరో అనుభవజ్ఞుడైన సైకియాట్రిస్టుకు వివరించడం మంచిది. కొన్నిసార్లు మందులు మోతాదు మార్చడం లేదా వేరే మందు ఇవ్వడం ద్వారా ఇలాంటి దుష్ప్రభావాలను తగ్గించ వచ్చు. ఆమెను ఒంటరిగా వదిలేయకుండా, విమర్శించ కుండా, ప్రశాంతంగా మాట్లాడండి. ఆమె మాట్లాడాలను కుంటే శ్రద్ధగా వినండి. నిద్ర, భోజనం, రోజువారీ అలవాట్లు సరిగ్గా ఉన్నాయో గమనించండి. 'చనిపోతాను' వంటి మాటలు చెబుతున్నందున కుటుంబ సభ్యులు మరింత జాగ్రత్తగా ఉండాలి.మంచి సైకియాట్రిస్టు చికిత్సతో పాటు సైకాలజిస్టు కౌన్సెలింగ్ కలిపి చేయడం ఉత్తమం. సహనం, ప్రేమ, సరైన వైద్య సహాయం ఉంటే ఈ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం చాలా మందిలో ఉంటుంది. మీరు త్వరగా సహాయం కోరడం చాలా మంచి విషయం. అదే ధైర్యంతో చికిత్స కొనసాగించండి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.
ఈ మెయిల్:Cheli@vaartha.com

# NBK111 బాలయ్య బర్త్‌డే స్పెషల్ ఎక్స్‌ప్లోజివ్ జూన్ 10న రిలీజ్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ యాక్షన్ స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం NBK111 ఇప్పటికే మ్యాసివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పవర్‌ఫుల్ యాక్షన్, భారీ స్థాయి మేకింగ్‌తో రూపొందు తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న ఈ చిత్రానికి సంబంధించిన ఓ భారీ అప్డేట్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. భారీ ఎన్‌బీకే అక్షరాలు ఇనుప గొలుసులతో బంధించినట్లుగా కనిపిస్తూ, బాలయ్య పవర్‌ను ప్రజెంట్ చేస్తున్నాయి. "No More Vintage, Only New Age" అనే ట్యాగ్‌లైన్ బాలకృష్ణను సరికొత్త అవతారంలో చూపించబోతున్న సంకేతాలు ఇస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ప్రధాన తారాగణం పాల్గొంటుండగా, కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవల మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కూడా ఈ చిత్రంలో భాగమవుతున్నట్లు ప్రకటించారు. కథలో కీలకమైన, పవర్‌ఫుల్ పాత్రలో మనోజ్ కనిపించనున్నారు. మాస్ ఎంటర్‌టైనర్లను తెరకెక్కించడంలో తనదైన ముద్ర వేసిన గోపీచంద్ మలినేని, మరోసారి హైవోల్టేజ్ యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలతో కూడిన కథను సిద్ధం చేశారు.

# 'సర్కారు బాయి' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



తెలంగాణ సామాజిక నేపథ్యంలో నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటాలను ప్రతిబింబించే కథాంశంతో తెరకెక్కుతున్న 'సర్కారు బాయి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్క రించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ్ నిమ్మల, వర్షిక జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి లారా దర్శకత్వం వహిస్తుండగా, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'నీటి సమస్య అనేది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి కీలకమైన అంశాన్ని కథాంశంగా తీసుకుని సినిమా రూపొందించడం ఆనందంగా ఉంది అన్నారు'. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ, 'సర్కారు బాయి' కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు' అన్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల మాట్లాడుతూ, 'తెలంగాణ సాయుధ పోరాటం, సామాజిక అంశాలతో కూడిన కథలంటే నాకు ఎంతోఇష్టం. అలాంటి కథలో నటించే అవకాశంరావడం నాఅదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. హీరోయిన్ వర్షిక మాట్లాడుతూ, 'నేను తెలుగమ్మాయిని. ఇలాంటి మంచి కథలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు'. అన్నారు. దర్శకుడు లారా మాట్లాడుతూ, 'చరిత్రలో మరుగున పడిపోయిన ఓ భావోద్వేగ కథను ఈ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. 'సర్కారు బాయి' వద్ద అణగారిన వర్గాలకు నీళ్లు ఇవ్వకుండా జరిగిన అన్యాయాలు, వారు ఎదుర్కొన్న కష్టాలు, కన్నీటి గాథ ఈ చిత్ర మూలకథ'అన్నారు. నిర్మాత తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ, 'నిజంగా జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సమాజానికి సందేశాన్ని అందించే ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను తాకుతుందని నమ్ముతున్నాను' అన్నారు.

# 'పెద్ది'లో చరణ్ పెర్ఫార్మెన్స్ మైండ్‌బ్లోయింగ్‌గా ఉంటుంది


## - దర్శకుడు బుచ్చిబాబు సానా

తెర



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. అద్భుతమైన గ్లింప్స్, చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. **పెద్ది జర్నీ గురించి చెప్పండి?** నా తొలి చిత్రం ఉప్పెన బ్లాక్‌బస్టర్ తర్వాత దాదాపు ఐదేళ్లకు పెద్దితో వస్తున్నాను. సాధారణంగా ఇండస్ట్రీలో ఒక బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత దర్శకుడికి ఐదేళ్ల సమయం పట్టడం జరగదు. కానీ నా విషయంలో అలా జరిగింది (నవ్వుతూ). మా గురువుగారు సుకుమార్ గారు నన్ను చరణ్ దగ్గరకు తీసుకెళ్లారు. నేను కథ చెప్పాను. చరణ్‌కు నచ్చింది. **ఇది స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండే సినిమా కదా. దీనికోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**క్రికెట్ మన అందరికీ తెలిసిన ఆటే. కానీ కుస్తీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. దంగల్ చిత్రంలో అమీర్ ఖాన్ గారికి కోచింగ్ ఇచ్చిన ట్రైనర్‌ను తీసుకొచ్చాం. **మీరు ఎన్టీఆర్‌తో అనుకున్న కథనే చరణ్‌తో చేశారనే వార్తలు వచ్చాయి. దీనిపై స్పష్టత ఇవ్వండి?** లేదు. ఎన్టీఆర్ కోసం అనుకున్న కథ వేరు. పెద్ది కథ వేరు. ఇది పూర్తిగా చరణ్ కోసం తయారు చేసిన కథ. **చరణ్‌ని అంత ఈజీగా ఎలా కన్విన్స్ చేశారు?** అంత ఈజీగా ఏమీ జరగలేదు. ఆయనకు కథ నచ్చింది కాబట్టే ఒప్పుకున్నారు. కథతోనే ఆయనను కన్విన్స్ చేశాను.చరణ్‌కి ఎప్పటినుంచో ఒక స్పోర్ట్స్ డ్రామా చేయాలనే ఆసక్తి ఉంది. ఆయనకు నచ్చేలా పెద్ది కథను సిద్ధం చేశాం. **పెద్ది సక్సెస్ ఇప్పుడు ఇండస్ట్రీకి చాలా అవసరం కదా?** ఏ సినిమా సక్సెస్ అయినా ఇండస్ట్రీకి, డైరెక్టర్లకు, హీరోలకు, సినిమాకు పనిచేసిన అందరికీ అవసరమే. అయితే ఇప్పుడు ఆ అవసరం కాస్త గట్టిగా ఉంది **శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ పాత్రల గురించి?** వీళ్లందరూ ఆ పాత్రలకు పర్ఫెక్ట్‌గా సరిపోతారు. శివన్న ఒక గురువుగా కనిపిస్తారు. **జాన్వి కపూర్ పాత్ర గురించి?** జాన్వి కపూర్ ఈ సినిమాకు ఒక ప్రత్యేకమైన కలర్ తీసుకొచ్చారు. లవ్ ట్రాక్‌లో చాలా బాగుంటారు. జాన్వి చాలా తెలివైన అమ్మాయి. చాలా డెడికేటెడ్ పర్సన్. సినిమాపై చాలా ప్యాషన్ ఉంది. చాలా వినయంగా ఉంటారు. **మీ తొలి సినిమాకు రూ.25 కోట్ల బడ్జెట్, రెండో సినిమాకు రూ.350 కోట్ల బడ్జెట్. ఎలా అనిపిస్తోంది?** ఇది చరణ్ వల్లే సాధ్యమైంది. హీరోని బట్టి సినిమా తయారయ్యే విధానం మారుతుంది. ఇదే కథను రూ.20 కోట్లలో తీయాలనుకుంటే కథకు కావాల్సినవి జరగకపోవచ్చు. **ఈ సినిమాలో 'అబ్బనీ తీయని దెబ్బ' పాటను రీక్రియేట్ చేశారని విన్నాం?** లేదు. అది రేడియోలో మాత్రమే వినిపిస్తుంది. **ఏఆర్ రెహమాన్ గురించి?** నాకు రోజా, బొంబాయి.. రెహమాన్ ఆల్బమ్స్ చాలా ఇష్టం. ఆయనతో పనిచేయాలని ఎప్పటినుంచో కల కన్నాను. ఈ సినిమా ద్వారా ఆ అవకాశం వచ్చింది. ఆయన పాటలను స్వయంగా పాడుతుంటే వింటూ చాలా ఎంజాయ్ చేశాను. అనంత శ్రీరామ్ చాలా చక్కని పాటలు రాశారు. అన్ని పాటల విషయంలోనూ ఎంతో సహకరించారు.

# 'ఇరుముడి' నుంచి గ్లింప్స్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ ఖిఇరుముడిఖి చిత్రంతో ప్రేక్షకులని ఆశ్చర్యపరచడానికి సిద్ధంగా ఉన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కమర్షియల్ యాక్షన్‌కు భావోద్వేగాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఖిది హార్ట్ ఆఫ్ ఇరుముడిఖి గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌లో ఒక కామన్ మ్యాన్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా చూపించారు. తన కూతురే అతని ప్రపంచం. ఆమె ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలే అతని జీవితాన్ని నడిపిస్తాయి. ఈ గ్లింప్స్‌లో మరో ప్రత్యేక ఆకర్షణ రవితేజ పాత్రలో కనిపించే ట్రాన్స్‌ఫర్మేషన్. అయ్యప్ప దీక్ష స్వీకరించిన తర్వాత ఆయన పాత్రలో చోటుచేసుకునే మార్పు ఎంతో హృద్యంగా చూపించారు. అది కేవలం ఒక త్యాగంలా కాకుండా, తన కూతురిపై ప్రేమతో, భక్తితో తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తుంది. చివర్లో కనిపించే ఇరుముడి విజువల్స్ భావోద్వేగాన్ని మరింత పెంచి ప్రేక్షకుల మనసులను తాకాయి.శివ నిర్వాణ మరోసారి తన బలమైన ఎమోషనల్ స్టోరీటెల్లింగ్‌తో ఆకట్టుకున్నారు. సహజమైన భావోద్వేగాలతో తండ్రీకూతుళ్ల బంధాన్ని కథకు ప్రధాన బలంగా మలిచారు. ఆ అనుబంధం ఎంతో సహజంగా అనిపించడం వల్ల ప్రేక్షకులు పాత్రలతో వెంటనే కనెక్ట్ అవుతున్నారు.రవితేజ తన మాస్ ఇమేజ్‌కు భిన్నంగా ఈ చిత్రంలో కనిపిస్తున్నారు. మాస్ స్వాగ్‌ను పక్కనపెట్టి, భావోద్వేగాలతో కూడిన పాత్రలో ఎంతో అద్భుతంగా నటించారు. బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో ఆకట్టుకుంది. ఆమె, రవితేజ మధ్య వచ్చే సన్నివేశాలు గ్లింప్స్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ విజువల్స్ కథలోని భావోద్వేగాలను అందంగా తెరపై ఆవిష్కరించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణంలా నిలిచి భావోద్వేగాలను మరింతగా ఎలివేట్ చేసింది. ఖిది హార్ట్ ఆఫ్ ఇరుముడిఖి గ్లింప్స్ ఒక తండ్రి ప్రపంచంలోకి తీసుకెళ్లే ఆహ్వానంలా ఆకట్టుకుంది. ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో కొత్త కోణాన్ని చూపించబోతుందని హింట్ ఇచ్చింది. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' నుంచి రెండో పాట విడుదల



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడు. వడ్డే నవీన్, రాశి సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా భాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. జూన్ 19న ఈ మూవీ గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. డైరెక్టర్ కమల్ తేజనార్లతో వడ్డే నవీన్‌కథ, స్క్రీన్ ప్లేలో భాగం కావటం విశేషం. రీసెంట్‌గా విడుదలైన టీజర్, టాటా అనే సాంగ్‌తో సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. కళ్యాణ్ నాయక్ సంగీత సారథ్యం వహిస్తోన్న సినిమాలోని ఈ పాటను భాస్కరభట్ల రాయగా.. పివిఎన్ఎస్ రోహిత్, హారిణి ఇవటూరి పాడారు. దినేష్ కుమార్ కొరియోగ్రఫీ అందించారు. గత కొన్ని సంవత్సరాలుగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన వడ్డే నవీన్, ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు చిత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. విజయ మాధవి కంబైన్స్ బ్యానర్‌పై నందమూరి తారక రామారావుతో బొబ్బిలిపులి, చిరంజీవితో లంకేశ్వరుడు, కృష్ణంరాజుతో కటకటాల రుద్రయ్య బ్లాక్ బస్టర్ చిత్రాలు సహా ఎఎన్ఆర్, కృష్ణ వంటి దిగ్గజ నటులతో ఎన్నో క్లాసిక్ చిత్రాలను రూపొందించిన సీనియర్ నిర్మాత వడ్డే రమేష్ తనయుడే వడ్డే నవీన్.

4vzm15:4vzm15.qxd 03-06-2026 22:28 Page 1



## చంద్రబాబు రెండేళ్ల పాలనలో దగాపడ్డ ప్రజలు : వైకాపా నేతలు ధ్వజం



గరివిడి, జూన్ 3, ప్రభాత వార్త

సీఎం చంద్రబాబు నాయుడు రెండేళ్ళ పాలనలో ప్రజలు దగా పడ్డారని వైకాపా నేతలు ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజలకి మోసం చేసిన ఘనమైన చరిత్ర బాబు సర్కారు దే నని వారు ఆక్షేపించారు. వెన్నుపోటు కు రెండేళ్ళు పేరుతో పోస్టర్ ని వారు ఆవిష్కరించి, ఈ నెల 4 నుండి 12 వరకు నియోజకవర్గ పరిధిలో వివిధ రూపాల్లో నిరశనలు చేపట్టనున్నట్లు వారు స్పష్టం చేశారు. గరివిడిలో గల శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయులు సమావేశంలో వైకాపా యువజన నాయకురాలు డాక్టర్ బొత్స అనూష, యువ నేత డాక్టర్ బొత్స సందీప్,నియోజకవర్గ సీనియర్ వైకాపా నాయకులు మీసాల విశ్వేశ్వర రావు, కోట్ల విశ్వేశ్వర రావు, వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, పొట్నూరు సన్యాసి నాయుడు ,కొనిసి కృష్ణం నాయుడు, తాడ్డే వేణుగోపాల్ నాయుడు, కె వి సూర్యనారాయణరాజు లు తో కలసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు చంద్రబాబు వెన్నుపోటు కు రెండేళ్ళు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రెండేళ్ళు బాబుపాలనలో విద్యార్థులకి అన్యాయం జరిగిందని అన్నారు. రైతులకు మోసం చేశారన్నారు. ప్రతీ మహిళకు1500 సాయం ఏమైందని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంతా సూపర్ మోసమని అనూష, సందీప్ ఆక్షేపించారు. బాబు సర్కారు మోసాలు పై వైకాపా నాయకులు వ్యతిరేక నినాదాలు చేశారు. వైకాపా నిరశన ర్యాలీలు విజయవంతం చేయాలని అనూష, సందీప్ పిలుపునిచ్చారు.

## రూ. 46.68 కోట్లతో మెగా రక్షిత నీటి పథకం

### - ఎమ్మెల్యే లోకం నాగ మాధవి వెల్లడి - లాంఛనంగా భూమి పూజ



నెల్లిమర్ల, జూన్ 3, ప్రభాతవార్త :

నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల జరజాపు పేట గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏ ఐ ఐ బి నిధులు రూ.46.68 కోట్ల రూపాయిలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి వెల్లడించారు. ఈ నిధులతో చేపట్టనున్న మెగా రక్షిత నీటి పథకం పనులకు మంగళవారం రాత్రి ఆమె శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.అంతకుముందు ఆమెకు పార్టీ నాయకులు, డైరెక్టర్ ఎం ఎం నాయుడు తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట వద్ద ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులతో సుమారు రూ.46 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని 23 వార్డుల ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపొందించామని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అదనపు నిధులను ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేయడం వల్ల పనులు వేగంగా ప్రారంభమయ్యాయని వెల్లడించారు. సుమారు 15 నెలల వ్యవధిలో పనులను పూర్తిచేసి ప్రతి ఇంటికీ పుష్కలంగా రక్షిత మంచినీరు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రధాన తాగునీటి పథకంతో పాటు కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ద్వారా పట్టణంలోని రెండు ప్రత్యేక కాలనీలకు అదనపు తాగునీటి సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు.నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగ మాధవి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, నెల్లిమర్లను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. నగర పంచాయతీ మాజీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, పూసపాటిరేగ ఏఎంసి డైరెక్టర్ ఎం.ఎం నాయుడు, కరుమజ్జి గోవిందరావు, పార్టీ నాయకులు గంటా సత్యనారాయణ (సతీష్ ), అవనాపు మురళీకృష్ణ, డొంక కృష్ణ, తుమ్ము వెంకటరమణ, మాత మురళీమోహన్, సుంకర ముత్యాల నాయుడు, ఎడ్ల గోవిందరావు, పతివాడ గోవిందరావు, అప్పికొండ రవికుమార్, కాళ్ల మహేష్, అవనాపు విజయ భాస్కర్, మద్దిల భరత్ కుమార్, తుమ్ము మనోహర్, దొరబాబు శంకర్, ప్రజారోగ్య శాఖ ఈఈ జ్యోతి, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కే. అప్పలరాజు పాల్గొన్నారు.

## పాచిపెంట ఎంఈఓ2గా కేవీ సత్యనారాయణ బాధ్యతలు



పాచిపెంట, జూన్ 3, ప్రభాతవార్త :

పాచిపెంట మండల విద్యాశాఖ అధికారిగా ( ఎఫ్ ఏ సి) కె.వి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు, ఎంఈఓ 2 పి సతీష్ కుమార్ ఎంఆర్పిలు దాసు మరియు కొంతమంది ఆహ్వానం పలికారు.గతంలో పనిచేసిన వి విజయకుమార్ మాతృ స్థానానికి వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో సాలూరు ప్రభుత్వ బాయ్స్ ఉన్నత పాఠశాల లో సైన్స్ టీచరుగా విధులు నిర్వహిస్తుండగా ఆయనకు అదనపు బాధ్యతలు పాచిపెంట మండల విద్యాశాఖ అధికారి వన్నగా,జిల్లా విద్యా శాఖ అధికారి నుండి ఆదేశాలు జారీ కావడంతో బుధవారం ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ తమ తమ విధులు సక్రంగా నిర్వహించి ప్రభుత్వ ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ఉపాధ్యాయులు పని చేసి మంచి సత్ఫలితాలు వచ్చే విధంగా రాష్ట్రానికి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు.

## తాగునీటికి ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వం ముందంజ



పాచిపెంట, జూన్ 3, ప్రభాతవార్త:

ప్రాణవాయువుల్లో ఒకటైన తాగునీరు కొరత లేకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేయదంలో సీఎం చంద్రబాబు నాయుడు ముందంజలో ఉన్నారని మండల టిడిపి అధ్యక్షులు జి. యుగంధర్, ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. కేసలి గ్రామంలో 5000 లీటర్లు పరిమాణం గల మినీ రక్షిత పథకానికి 15వ ఆర్థిక వనరుల నుండి రెండు లక్షల 50 వేలు రూపాయలతో వ్యయముతో నిర్మించినరక్షిత పథకంను బుధవారం ఏఎంసీ చైర్మన్ ముఖి. సూర్య నారాయణ మరియు మండల టిడిపి అధ్యక్షులు యుగంధర్ గ్రామ దేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. మినీ రక్షిత పథకం నిర్మాణం వలన కేసలి గ్రామానికి తాగునీటి యద్దడి నివారించవచ్చని ఆ గ్రామ టిడిపి నాయకులు పంటల భాస్కరరావు ఆకుల శ్రీనివాసరావు, ఆకుల సాయి, మీసల మోహన తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పూసర్ల నరసింహ రావు పాచి పెంట,ఎంపీటీసీ సభ్యులు పి ఉమా మహేశ్వరరావు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మెహర్ బాబా, కార్యదర్శి కేసువ నాయుడు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం



పాచిపెంట, జూన్ 3 ప్రభాతవార్త :

మండలం కేసలి, సురగడవలస, మోసురు, మంచడవలస, కోస్టువలసలో “”అంగన్వాడీ పిలుస్తోంది “” కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఇందిరా మాట్లాడుతూ 3 సంవత్సరాలు నిండిన పిల్లలు అందరికీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించలని తల్లిదండ్రులను కోరారు. పూర్వప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకత ని తల్లులు లకి ఆయా గ్రామాల్లో తల్లుల సమావేశాలు ఏర్పాటు చేసి పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతను వివరించారు. వివిధ క్లస్టర్ క్లస్టర్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఎండిఎం నిర్వాహకులు రుచికరమైన ఆహారం అందించాలి



నెల్లిమర్ల, జూన్ 3, ప్రభాతవార్త:

పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులు రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని ఎంఈఓలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, సిద్ధాంతం త్రినాథరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలియజేశారు. నిర్వాహకులు వండి తెచ్చినటువంటి వంటలను రుచి చూసారు. రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసిన వారిని ఎంపిక చేసి పిచ్చుక స్వాతి దేవికి, మరో ముగ్గురికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని శారద , ఉపాధ్యాయులు కడలి సత్యసాయి గణేష్, తాలాడ మహేష్, మధ్యాహ్నం భోజన పథకం మహిళలు పాల్గొన్నారు రిసోర్స్ పర్సన్స్‌గా కే. గణేష్, ఎం. రాకేష్ పాల్గొన్నారు. వీరితో పాటు సీఆర్పీలు మొయిద అచ్చింనాయుడు, రేవతి, లక్ష్మణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



రామభద్రపురం, జూన్ 3, ప్రభాత వార్త:

రామభద్రపురం మండలం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు చాకచక్యంగా రికవరీ చేసి, బుధవారం బాధితులకు అందజేశారు. రామభద్రపురం సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.గతంలో తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆ ఫోన్ల జాడను కనుగొన్నారు. రికవరీ చేసిన రెండు స్మార్ట్‌ఫోన్లను ఈరోజు (బుధవారం) రామభద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ రావు చేతుల మీదుగా బాధితులకు సురక్షితంగా అందజేయడం జరిగింది. తమ విలువైన ఫోన్లను అతి తక్కువ కాలంలోనే వెతికి పట్టుకున్నందుకు బాధితులు ఎస్ఐ జ్ఞానప్రసాద్ రావు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఫైలేరియా ఉచిత మందులు పంపిణీ

### టీడీపీ మండల అధ్యక్షులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో

గరుగుబిల్లి, జూన్ 3, ప్రభాత వార్త:

ఈ రోజు కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మరాడన నారాయణ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఫైలేరియా కి సంబంధించి మందులను సొంత నిధులతో సుమారుగా 20 మంది వ్యాధి గ్రస్తులకు పంపిణీ చేయటం జరిగింది ఈ కార్యక్రమం వలన 20మంది భాదిత కుటుంబాలకు సహకారం అందించటం వలన బాధిత కుటుంబాలు ఆనందాని వ్యక్తం చేశారు.మండల అధ్యక్షులు నారాయణస్వామి నాయుడు మాట్లాడుతూ ఫైలేరియా లాంటి సమస్యలు ప్రభలం కాకుండా తమ వంతు సహకారం అందించటం సంతోషంగా ఉందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యంత్రి పర్యలు నారాచంద్రబాబు నాయుడు గారు పిలుపు మేరకు పేద ప్రజలకు అండగా ఉండాలని పిలుపుని నేను ఒక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ లో మరెన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో జనాభా గణన సర్వే .. 2027 వాహనంతో అవగాహన



సాలూరు ,జూన్ 3 ,ప్రభాతవార్త :

సాలూరు మండలం చంద్రప్పవలస ఇంకా బోరబంద అలాగే వల్లాపురంలో ఖచ్చితమైన సమగ్రమైన సమాచార సేకరణను నిర్ధారిస్తూ,జనాభా గణనసర్వే కోసం సమాచారం వాహనంతో రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 2027 సెన్సస్ ప్రక్రియలో భాగంగ గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటికి వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఆర్.ఐ ఇంకా విఆర్ఓ పలు సూచనలు చేసారు. అంతేకాకుండా ఇన్యూరేటర్లు సమన్వయంతో జనాభ గణన సర్వే తగిన సమాచారం సేకరించాలని క్లారిటీ ఇచ్చారు. రెవెన్యూ శాఖ ఆర్ఐ మౌలాల, విఆర్ఓ టి.రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలి

### కలెక్టర్ రామ సుందర్ రెడ్డి



నెల్లిమర్ల, జూన్ 3, ప్రభాతవార్త : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బుధవారం పూసపాటిరేగ, నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయాల్లో జరుగుతున్న పనితీరును పరిశీలించిన కలెక్టర్, నమోదు ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. సిబ్బంది పని విధానాన్ని పరిశీలిస్తూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు.అదేవిధంగా సంబంధిత యాప్‌ను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, యాప్‌ను ఎలా సమర్థవంతంగా వినియోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై అధికారులకు, సిబ్బందికి వివరించారు. ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.నెల్లిమర్ల మండలంలో రివిజన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, అధికారులు క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని దిశ, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పూసపాటి రేగ, నెల్లిమర్ల తహసిల్దార్లు వెంకటరమణ, కే. శ్రీకాంత్ లతోపాటు డిప్యూటీ తాసిల్దార్లు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుకి అడ్డంగా పడ్డ చెట్లను తొలగించిన పోలీసులు



గరివిడి, జూన్ 3, ప్రభాత వార్త

పెనుగాలులకు నేలకొరిగిన చెట్లను గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు ,సిబ్బంది, ప్రజల సహకారం తో తొలగించారు. కాపు శంబాం, బొండపల్లి ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వీచిన గాలికి పలు చెట్లు విజయనగరం, పాలకొండ ప్రధాన రహదారికి అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానికులు యువత సహకారంతో ఎస్ఐ, సిబ్బంది చెట్లను తొలగించారు. ట్రా ఫిక్‌కి అంతరాయం లేకుండా మార్గాన్ని సుగమం చేశారు. పోలీసులకి, స్థానిక యువకులకు అభినందించారు.

## సేవలను ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



భోగాపురం, జూన్ 3,(ప్రభాతవార్త) :

ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు సచివాలయ వ్యవస్థ కీలకంగా పనిచేస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పేర్కొన్నారు. మండలంలోని చెరుకుపల్లి పంచాయితీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలు చిన్న చిన్న అవసరాల కోసం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అవస్థలు పడకుండా, గ్రామస్థాయిలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య ఆశయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వందనాల రమణ, మట్టా అయ్యప్ప రామకృష్ణారెడ్డి, పల్లంట్ల జగదీష్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమర్థవంతంగా స్వచ్ఛభారత్ మిషన్ అమలు పరచాలి



దత్తిరాజేరు , జూన్ 3 ప్రభాతవార్త :

స్వచ్ఛభారత్ మిషన్ అన్ని గ్రామాల్లో సమర్థవంతంగా అధికారులుఅమలు చేయాలని ఎంపీడీవో కిషోర్ కుమార్ అన్నారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీ రింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ తరగతుల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మలవిసర్జన రహిత ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ఓడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాలను పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతూ ఆదర్శవంతమైన గ్రామాలుగా మార్చాలని శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులకు ఆయన సూచించారు ఏఓ శివాజీ డిప్యూటీ ఎంపీడీవో తాత ఎం సి ఓ గోవింద్ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల, జూన్ 3, ప్రభాతవార్త



పీజీ సెట్ ఫలితాలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారు. జువాలజీ విభాగంలో ఐదుగురు విద్యార్థినులు బడారి కృష్ణవేణి (46), షేక్ షహనాజ్ (226) , కెల్ల దేవి (226), పల్ల రూప (544), బైటపల్లి కీర్తిక(943) ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.కె. రేఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ విభాగంలో 5, కెమిస్ట్రీ విభాగంలో 8 మందికి ప్లేస్మెంట్‌లు వచ్చాయని, అదేవిధంగా జువాలజీ విభాగంలో ఐదుమందికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామి నేషన్ ( పీజీ సెట్ ) లో ర్యాంకులు వచ్చాయని, ఈ ర్యాంకులు రావడంలో జువాలజీ విభాగాధిపతి డాక్టర్.పి. రూపవాణి కృషి అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ రేఖ తెలిపారు. కామర్స్ విభాగపు గెస్ట్ ఫ్యాకల్టీ, కస్తూరి ఇటీవల నిర్వహించిన ఏపీ సెట్ నందు క్వాలిఫై అయ్యారని అన్నారు.ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థినిలకు, కస్తూరికి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులు అభినందనలు తెలిపారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## భూసేకరణపై రైతుల ఆందోళన తీవ్రం



భోగాపురం, జూన్ 3, ప్రభాత వార్త :

భూసేకరణ అంశంపై రైతులు నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతుల అవగాహన, సమ్మతి లేకుండా వ్యవసాయ భూములను సేకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, రైతుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే న్యాయపోరాటం చేపట్టాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.సమావేశంలో భూసేకరణ ప్రక్రియలో అనుసరించాల్సిన నిబంధనలు, రైతులకు కలిగే నష్టాలు, భవిష్యత్తులో జీవనాధారాలపై పడే ప్రభావం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రైతుల అనుమతి లేకుండా భూములు తీసుకోవడం సరికాదని, ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు.భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించే అవకాశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. రైతుల తరపున తీర్మానం చేసి, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో పలువురు పర్యావరణ పరిరక్షణ అధికారులు , రైతు నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భూముల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ : ప్రభుత్వ విప్



కురుపాం, జూన్ 3, ప్రభాతవార్త :

రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్రను కలిగి ఉన్న నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేసి రైతుల గౌరవాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరింత పెంచారని ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం నియోజకవర్గ గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఎల్విన్ పేట సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఫోటోతో జారీ చేసిన భూమి పాస్ పుస్తకాలను రద్దు చేసి, కూటమి ప్రభుత్వం రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్ కలిగిన నూతన పాస్ పుస్తకాలను జారీ చేయడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి బిడ్డిక పద్మావతి, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ఎంపిడిఓ యల్.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్.శేఖరం కూటమి నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా 'జలధార' పనులు పూర్తి కావాలి



పార్వతీపురం, జూన్ 3, ప్రభాతవార్త:

జిల్లాలో చేపడుతున్న 'జలధార' పనులన్నింటినీ ఈ నెలాఖరు నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి సంబంధిత శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు తదితర అంశాలపై ఆరా తీసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార పనులన్నీ 100 రోజుల్లోగా పూర్తిచేయాల్సి ఉందని, ఇప్పటికే 60 రోజుల గడువు ముగిసిందని గుర్తుచేశారు. మిగిలిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఇంకా ప్రారంభం కాని పనులన్నింటినీ తక్షణమే ప్రారంభించాలని, మంజూరైన పనులన్నీ శత శాతం పూర్తి కావాలని తేల్చి చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, డ్వామా, అటవీ శాఖ, భూగర్భ జల శాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఎఫ్ఆర్ఓలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్, జనగణన పురోగతి పరిశీలన

దెంకాడ, జూన్ 3, ప్రభాతవార్త:

దెంకాడ మండలంలోని పార్ట్ నం. 182 పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ మరియు జనగణన ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ స్థాయిలో నమోదవుతున్న వివరాలు, పురోగతిని సమీక్షించారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి డేటా నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ మ్యాపింగ్ మరియు జనగణన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సమన్వయంతో పని చేసి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**కొత్తవలస బ్రాంచ్**

PML కాంప్లెక్స్, విజయనగరం రోడ్డు, కొత్తవలస, విజయనగరం-535 183. ఫోన్ : 08966-264888, బ్రాంచ్ ఇ-మెయిల్ ఐడి : ubin0814571@unionbankofindia.bank

**డిమాండ్ నోటీసు**

సర్ఫేసీ చట్టము, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడినది

టు,

ఋణగ్రహీత: 1) M/s శ్రీ జ్యోతి టైల్ డిపో (ప్రొప్రయిటర్: శ్రీమతి బొత్స జ్యోతి), అదుపాలెం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర, తుమ్మికాపల్లి, కొత్తవలస, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535 183.

2) శ్రీమతి బొత్స జ్యోతి, భర్త: బెల్లాన శ్రీరామమూర్తి, డి నెం.4-130, 2వ అంతస్తు, పోలమరశెట్టి ట్రాన్స్, మంగళపాలెం, కొత్తవలస, విజయనగరం, ఆం.ప్ర-535 183 & 8-5 రాజీవ్ నగర్, కొత్తవలస, విజయనగరం, ఆం.ప్ర-535183.

హామీదారు: 3) శ్రీ బెల్లాన శ్రీరామమూర్తి, తండ్రి: సూర్యనారాయణ, డి నెం.1-61, S C కాలనీ, కోనమశివాని పాలెం, దేవాడ, తామరపల్లె, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535 183.

డియర్ సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13 (3)తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద నోటీసు జారీచేయబడినది.

పైన తెలిపిన చిరునామాదారులు నెం.1 & 2 అయిన మీరు మా కొత్తవలస బ్రాంచ్ లో దిగువ తెలిపిన ఋణసౌకర్యాలను పొందినారు మరియు చెల్లించవలసిన బకాయి/వడ్డీ/వాయిదా మొత్తములు తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఆదాయ గుర్తింపు మరియు ప్రుడెన్షియల్ అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించి ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం మీ ఋణఖాతాను తేది.09.04.2026 న నిరర్థక ఆస్తి (NPA) ఖాతాగా వర్గీకరించబడినది. మీ నుండి క్రింద చూపిన విధముగా ఖాతా/లు నందు తేది.14.05.2026 నాటికి రూ.36,21,545.22/- (అక్షరాల ముప్పై ఆరు లక్షల ఇరవై ఒక్క వేల ఐదు వందల నలభై ఐదు రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) మా బ్యాంక్‌కు బకాయి పడి ఉన్నది.

పైన పేర్కొన్న చిరునామాదారు నెం.1 & 2 వారికి సంబంధించి బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి వివరములు దిగువున తెలుపబడినవి:

| ఋణ సౌకర్యం | అకౌంట్ నెంబరు | బకాయి మొత్తం రూ.లలో | వర్తించని వడ్డీ రూ.లలో | బ్యాంకు విధించిన ఖర్చు/ఛార్జీలు | మొత్తం బకాయిలు (రూ.లలో) |
|---|---|---|---|---|---|
| OCC GEN | 145713100000584 | 34,93,697.22 | 1,27,848.00 | 0.00 | 36,21,545.22 |
| మొత్తం బకాయి | | | | | 36,21,545.22 |

బకాయి పడిన సొమ్ములు లేదా బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును తిరిగి చెల్లించేందుకు శ్రీమతి బొత్స జ్యోతి & శ్రీ బెల్లాన శ్రీరామమూర్తి వారు తేది.24.05.2024 న దిగువ పేర్కొన్న ఆస్తిని యూనియన్ బ్యాంక్ ఇండియా వారికి సాధారణ తనఖా పెట్టడం జరిగింది.

**స్థిరాస్తి వివరములు**

ప్రైమరీ సెక్యూరిటీ: ఫర్మ్ యొక్క నిల్వలు, పుస్తక ఋణములు మరియు మొత్తం ప్రస్తుత ఆస్తులు తనఖా ఉంచబడినవి.

కొల్లేటరల్ సెక్యూరిటీ: ఐటమ్-1: విజయనగరం జిల్లా, లక్కవరపుకోట మండలం, తమరపల్లి పంచాయితీ మరియు తమరపల్లి రెవెన్యూ గ్రామం, సర్వే నెం.192-6-A-1-B భాగం, పట్టా నెం.751 నందు విస్తీర్ణం 968 చ॥గ॥లు లేదా 813.12 చ॥మీ॥లులోని మొత్తం భూమి శ్రీమతి బొత్స జ్యోతి గారి పేరున కలదు. హద్దులు: ఉత్తరం: బెల్లాన అవతారం గారి మెట్ట భూమి, తూర్పు: బెల్లాన శ్రీరామమూర్తి గారి మెట్ట భూమి, దక్షిణం: బెల్లాన నరసమ్మ మరియు ఇతరుల మెట్ట భూమి, పడమర: బెల్లాన నరసమ్మ మరియు ఇతరుల మెట్ట భూమి.

ఐటమ్-2: విజయనగరం జిల్లా, లక్కవరపుకోట మండలం, తమరపల్లి పంచాయతీ మరియు తమరపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం.192-6-A-1-B భాగం, పట్టా నెం.609 నందు విస్తీర్ణం 968 చ॥గ॥లు లేదా 813.12 చ॥మీ॥లులోని మొత్తం భూమి శ్రీ బెల్లాన శ్రీరామమూర్తి గారి పేరున కలదు. హద్దులు: ఉత్తరం: పులిబంటి వెంకటేశ్వర్లు గారి మెట్ట భూమి మరియు బెల్లాన అప్పయ్య కుటుంబం వారి రాస్తా, తూర్పు: బెల్లాన చంద్రి రావు మరియు బెల్లాన శ్రీరామమూర్తి గార్ల మెట్ట భూమి, దక్షిణం: బెల్లాన జ్యోతి గారి మెట్ట భూమి, పడమర: బెల్లాన చంద్ర రావు గారి మెట్ట భూమి.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13(2) పరిధిలో మీరు చెల్లించవలసిన రూ.36,21,545.22/- (అక్షరాల ముప్పై ఆరు లక్షల ఇరవై ఒక్క వేల ఐదు వందల నలభై ఐదు రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) తో పాటు మీరు లోన్ డాక్యుమెంట్ల నందు నిర్వర్తించిన నియమ నిబంధనల ప్రకారం ఒప్పందపు రేటు వడ్డీని కలిపి ఈ నోటీసు తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగాను మరియు మీ బాధ్యతలు నిర్వర్తించవలసినదిగాను అట్లు చేయుటలో విఫలమైనచో, మీరు బ్యాంకు పేరున సెక్యూరిటీలుగా ఇచ్చిన ఈ క్రింది ఆస్తులు సదరు చట్టంలోని ఏదైనా లేదా అన్ని హక్కులు వినియోగించుకుని బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

సదరు చట్టం నందలి సెక్షన్ 13(13) ప్రకారం, ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి పైన సూచించిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ వారి సమ్మతి లేకుండా అమ్మకం లేదా లావాదేవీలు జరుపుట నుండి మిమ్మల్ని నిరోధించటమైనది / నివారించడమైనది. సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై మీరు SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

తేది: 14.05.2026, స్థలం: కొత్తవలస — సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

4-6pg10.qxd:4-6pg10.qxd 1/1/02 6:29 AM Page 1



# నార్వే చెస్‌లో ప్రజ్ఞానంద గెలుపు

## దివ్య, గుకేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్ 2026 యొక్క ఎనిమిదవ రౌండ్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు మరోసారి మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించి, టైటిల్ రేసుకు మరో ముఖ్యమైన ఫలితాన్ని సాధించాడు. గత వారం తెల్ల పావులతో కార్ల్‌సెన్‌ను ఓడించిన ఈ 20 ఏళ్ల ఆటగాడు, 8వ రౌండ్‌లో నల్ల పావులతో తన విజయాన్ని పునరావృతం చేసి, అదే టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ 1 ఆటగాడిపై తన రెండవ క్లాసికల్ విజయాన్ని నమోదు చేశాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజుపై అలీరెజా ఫిరౌజ్జా విజయాన్ని సాధించాడు. తెల్ల పావులతో ఆడుతూ, ఉత్కంఠభరితమైన ఎండ్‌గేమ్‌లో ఫిరౌజ్జా కీలకమైన విజయాన్ని దక్కించుకున్నాడు. ఇక నార్వే చెస్ మహిళల 8వ రౌండ్‌లో రెండు నిర్ణయాత్మక క్లాసికల్ గేమ్‌లు, ఒక ఆర్మాగెడాన్ టైబ్రేకర్ జరిగాయి, ఇందులో బిబిసారా అసౌబాయేవా తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. దివ్య దేశ్‌ముఖ్‌పై అసౌబాయేవా ఒక ముఖ్యమైన క్లాసికల్ విజయాన్ని సాధించింది. నల్ల పావులతో ఆడుతూ, ఆమె ఒత్తిడిని తట్టుకుని, దివ్యకు సమయం తక్కువగా ఉన్నప్పుడు ఆధిక్యాన్ని సంపాదించి, చివరికి పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుంది. అన్నా ముజిచుక్ మరియు హంపీ కోనేరుల ఆట క్లాసికల్ డ్రాగా ముగిసింది. ఆర్మాగెడాన్ టైబ్రేక్ కూడా హోరాహోరీగా సాగింది, కానీ చివరకు హంపీ కోనేరు నల్ల పావులతో గెలిచి, అదనపు పాయింట్లను సంపాదించారు.

# సెమీస్‌కు భారత్ హాకీ మహిళా జట్టు

## 25-0 తో సింగపూర్ చిత్తు



**న్యూఢిల్లీ:** హాకీ అండర్18 ఆసియా కప్‌లోని పూల్ ఎ చివరి గేమ్‌లో భారత మహిళల జట్టు సింగపూర్‌ను 25-0 తేడాతో చిత్తుగా ఓడించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో నౌషీన్ నాజ్ ఏడు గోల్స్ (8, 13, 17, 18, 40, 52, 58) చేసి అగ్రస్థానంలో నిలిచింది. గీతాశ్రీ నమ్మి ఐదు గోల్స్ (13, 28, 47, 48, 60) సాధించగా, కెప్టెన్ స్వీటీ కుజుర్ నాలుగు గోల్స్ (2, 24, 38, 45) జోడించింది. ప్రియాంక మింజ్ హ్యాట్రిక్ (22, 37, 53), దియా (27), నాన్సీ సరోహా (36), శ్రుతి కుమారి (40), పుష్పా మాంఝీ (47), రష్మీన్ కౌర్ (47), సందీప్ కుమారి (47) సందీప్ కుమారి 5 గోల్స్ చేశారు. ఆట ఆరంభంలోనే భారత్ దూకుడును ప్రదర్శించింది. రెండవ నిమిషంలో కెప్టెన్ స్వీటీ గోల్ చేసింది. ఆ తర్వాత ఎనిమిదవ నిమిషంలో నౌషీన్ ఆధిక్యాన్ని పెంచగా, గీతాశ్రీ, నౌషీన్ ఇద్దరూ (13) స్కోరును సమం చేసి, భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. రెండవ క్వార్టర్‌లో నౌషీన్ 2 గోల్స్ చేయడంతో భారత తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆ తర్వాత ప్రియాంక, స్వీటీ భారత్ ఆధిక్యాన్ని పెంచడంలో సహాయపడ్డారు. మూడో క్వార్టర్ ఆరంభంలోనే దియా, గీతాశ్రీ గోల్స్ చేయగా, నాన్సీ, ప్రియాంక, స్వీటీ, నౌషీన్, శృతి గోల్స్ సాధించడంతో భారత్ సింగపూర్ రక్షణ శ్రేణిని ఛిన్నాభిన్నం చేసింది. ఆఖరి క్వార్టర్‌లో కూడా భారత్ అదే తీవ్రతను కొనసాగించి, అదనంగా 10 గోల్స్ సాధించింది. స్వీటీ తన 4 గోల్స్, గీతాశ్రీ మరో 3 గోల్స్‌తో మొత్తం 5 గోల్స్ సాధించింది. అలాగే, నౌషీన్ 7 గోల్స్‌తో అద్భుతమైన ప్రదర్శనచేసింది. పుష్ప, రష్మీన్, సందీప, ప్రియాంక కూడా గోల్స్ సాధించారు.

# బరిలో సిరాజ్, తిలక్ వర్మ

## 7న టిజి 20 ప్లేయర్ల వేలం

### 21నుంచి ఉప్పల్ వేదికగా మ్యాచ్‌లు

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేస్తూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్లేయర్ల వేలానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఫ్రాంచైజీ ఆధారిత పద్ధతిలో జరగనున్న ఈ లీగ్ ప్రారంభ ఎడిషన్ వేలం పాటను ఆదివారం రామోజీఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్లోనిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు తలపడనుండగా.. 21 రోజుల పాటు ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మొత్తం 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. 1,300 మంది ఆటగాళ్లు.. వేలంలో స్టార్లు హెచ్‌సీఏలో రిజిస్టర్ అయిన 1,300 మందికి పైగా క్రికెటర్లు ఈ వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాళ్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మల ఈ వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. వీరితో పాటు రోహిత్ రాయుడు, రాహుల్ బుద్ధి, సి.వి. మిలింద్, తన్మయ్ అగర్వాల్ వంటి సీనియర్ దేశవాళీ ప్లేయర్లు ఫ్రాంచైజీల హాట్ కేక్‌లుగా మారే అవకాశం ఉంది. అండర్-19ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆరోన్ జార్జ్, ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీ గెలిచిన హైదరాబాద్ యువ జట్టు సభ్యులు కూడా వేలం పూల్‌లో ఉన్నారు. బరిలో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొననుండగా.. 1.హైదరాబాద్ ఈఛాంపియన్స్ 2.ప్రణవ రంగారెడ్డి రైజర్స్ 3.వరంగల్ వారియర్స్ 4.మెదక్ ఫాల్కన్స్ 5.అనురాగ్ నల్గొండ నైట్స్ 6.కరీంనగర్ డైమండ్స్ 7.పాలమూరు స్ట్రైకర్స్ 8.అన్విత ఖమ్మం ఏసెస్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ప్రతి ఫ్రాంచైజీ తమ 20 మంది సభ్యుల జట్టులో కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను చేర్చుకోవాలి. అలాగే తుది జట్టులో కనీసం ఇద్దరు జిల్లా ప్లేయర్లు ఆడటం తప్పనిసరి. టీమిండియా మాజీ ఆటగాడు, హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ చైర్మన్ అంబటి రాయుడు నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఓపెన్ ట్రయల్స్ ద్వారా ఈ యువ ప్రతిభను వేలం వరకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మెగా లీగ్ మ్యాచ్‌లు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని మ్యాచులు ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయి.







# అత్యంత క్లిష్టంగా టీమిండియా ఫైనల్

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో 7 మ్యాచ్‌లు తప్పక గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరాలనే భారత క్రికెట్ జట్టు కల ఇప్పుడు అత్యంత క్లిష్టమైన దశకు చేరుకుంది. ప్రస్తుత పాయింట్ల పట్టిక సమీకరణాల ప్రకారం టీమ్ ఇండియా కేవలం అద్భుత విజయాలు సాధించడమే కాకుండా, ప్రత్యర్థి జట్ల ఓటములపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత జట్టు పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. కేవలం 48.15 శాతం పాయింట్లతో టీమ్ ఇండియా ప్రస్తుతం ఆరో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ జట్ల కంటే మాత్రమే భారత్ ముందుంది. ప్రతిష్టాత్మక ఫైనల్ పోరుకు అర్హత సాధించాలంటే, భారత్ తన ముగింపు దశలో ఆడబోయే 9 టెస్ట్ మ్యాచ్‌లలో కనీసం 7 మ్యాచ్‌ల్లో ఖచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ఇందులో ఏ ఒక్క మ్యాచ్ చేజారినా ఫైనల్ ఆశలు దాదాపు గల్లంతైనట్లే. భారత జట్టు రాబోయే రోజుల్లో మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవలసి ఉంది. ముందుగా టీమ్ ఇండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది, అక్కడ రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ వెంటనే న్యూజిలాండ్ గడ్డపై మరో రెండు టెస్టుల కఠినమైన సవాలు ఎదురుకానుంది. ఈ రెండు విదేశీ పర్యటనలు ముగిసిన తర్వాత, 2027 ప్రారంభంలో ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనకు రానుంది. భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే క్రమంలో దాదాపు 64 నుంచి 68 శాతం పాయింట్లను సొంతం చేసుకోవాలంటే ఈ సిరీస్ భారత్‌కు జీవన్మరణ సమస్యగా మారనుంది. టీమ్ ఇండియా కేవలం తన మ్యాచ్‌లలో గెలిస్తేనే సరిపోదు. పాయింట్ల పట్టికలో మొదటి వరుసలో ఉన్న శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల పరాజయాలపై కూడా మన అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

# భారత్‌కు ఘోర పరాజయం!

## 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు



**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ముందు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. నేడు జరిగిన మూడో టీ20లో సమష్టిగా రాణించిన ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(40 బంతుల్లో 7 ఫోర్లతో 56 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా, యస్తిక భాటియా(32), దీప్తి శర్మ(32), జెమీమా రోడ్రిగ్స్(29) పర్వాలేదనిపించారు. ఓపెనర్లు స్మృతి మంధాన(8), షెఫాలీ వర్మ(11) తీవ్రంగా నిరాశపర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్ 2 వికెట్లు తీయగా, స్మిత్, చార్లీ డెన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 184 పరుగులు చేసి గెలుపొందింది. అలిస్ క్యాప్సే(43 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులతో 82), హీథర్ నైట్(42 బంతుల్లో 10 ఫోర్లతో 70 నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్ రెండేసి వికెట్లు తీసారు. ఈ నెల 12 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుండగా, భారత్ తమ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో ఈ నెల 14న ఆడనుంది. టీ20 ప్రపంచకప్ ముందు ఇంగ్లండ్‌తో జూన్ 10న వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆస్ట్రేలియాపై పాకిస్థాన్ ఓటమి

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై పాకిస్థాన్‌కు పరాభవం ఎదురైంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లాహోర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సమష్టిగా విఫలమైన పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దాంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 231 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్ (51), కామెరూన్ గ్రీన్ (53) హాఫ్ సెంచరీలతో రాణించగా, మ్యాట్ రేన్‌షా (43) పర్వాలేదనిపించాడు. పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది 3 వికెట్లు తీయగా, హారిస్ రౌఫ్, మిన్‌హాస్, అబ్రార్ అహ్మద్, రెండేసి వికెట్లు పడగొట్టారు. ఇక 232 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 44 ఓవర్లలో 190 పరుగులకు కుప్పకూలింది. షాదాబ్ ఖాన్ (71) అరఫత్ మిన్హాస్ (33), ఘాజి ఘోరి (37) పోరాడినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ (4/33), మాథ్యూ షార్ట్ (3/36) పాక్ పతనాన్ని శాసించగా, మాథ్యూ కుహ్నెమన్, ఆడమ్ జంపా, తన్వీ సంగా తలో వికెట్ తీసారు. టాప్3 బ్యాటర్లు షాహిబ్‌జాద ఫర్హాన్(3), మాజ్ సదాకత్(0), బాబర్ ఆజామ్(16) తీవ్రంగా నిరాశపర్చారు. సల్మాన్ అఘా(7), అబ్దుల్ సమద్(2) వరుసగా పెవిలియన్ చేరడంతో పాక్ 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆ కాసేపటికే ఘాజీ ఘోరి కూడా ఔటవ్వడంతో ఆ జట్టు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కెప్టెన్ షాహిన్ షా అఫ్రిది(0), హారిస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్(0) విఫలమవడంతో పాకిస్థాన్ 190 పరుగులకే పరిమితమైంది.

# నష్టాలబాటలో సెన్సెక్స్, నిఫ్టీ

## మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే ఎఫెక్ట్




**ముంబయి, జూన్ 3:** దేశీయ ఈక్విటీ మార్కెట్‌సూచీలు మరోసారి నష్టాలబారిన పడ్డాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 303.67 పాయింట్లు క్షీణించి 74,346.17 పాయింట్లకు చేరగా నిఫ్టీ 50 సూచీ 77.95 పాయింట్లు నష్టపోయి 23,405.60 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటిఎఫ్ఎంసిజి స్టాక్స్ నీరసించడంతో నష్టాలు తప్పలేదు. టిసిఎస్ 8.39శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 5.19, ఇన్ఫోసిస్ 3.79శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.50 నష్టపోగా స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం స్వల్పలాభం నమోదుచేసింది. మార్కెట్లపరంగా ప్రతికూలంగానే ఉంది. బిఎస్ఇలో 1573 షేర్లుపెరిగితే 2732 షేర్లు పతనం చెందాయి. 217 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68 వద్ద నమోదుకాగా ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌ఐదు సెటిల్‌మెంట్‌ధరలు 0.93శాతం క్షీణించి రూ.1,54,100గా నడిచింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్‌ధరలు 2.35 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 98.35 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్‌షేర్లు దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా 60 దేశాలపై విధించతలపెట్టిన సుంకాలకు ప్రతికూలంగా మార్కెట్లు కొనసాగాయి. ఆసియా సూచీలు బుధవారం ఎగువకు నమోదయ్యాయి. వాల్‌స్ట్రీట్ షేర్లు రాత్రికిరాత్రే రికార్డుగరిష్టాలను నమోదుచేసాయి. ఎస్అండ్‌పి 500 0.13శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 228.91 పాయింట్లు లాభపడింది. ఇక నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 0.03శాతం పెరిగినట్లు తేలింది. ఇక దేశీయ మార్కెట్ల పరంగాచూస్తే ఇండస్ ఇండ్‌బ్యాంకు 1.38శాతం క్షీణించింది. టిసిఎస్ కూడా 8.39శాతం దిగజారింది. జాన్ కాక్‌ఎరిల్ ఇండియా 20శాతంపెరిగింది. వార్రాక్ ఇంజినీరింగ్ 3.36శాతం, ఎన్ఎండిసి 0.77శాతంచొప్పున పెరిగాయి. కాంకార్డ్ బయోటెక్ 3.03శాతంపెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.16శాతం దిగజారింది. ఇక డైమండ్ పవర్ ఇన్‌ఫ్రా 3.07శాతం, మార్సన్స్ 7.32శాతం, కపాసైట్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ 0.65శాతం, ఆర్ఐఆర్ పవర్ ఎలక్ట్రానిక్స్ 0.46శాతం క్షీణించాయి.

# 59.8 పాయింట్లకు పెరిగిన సేవలరంగ పిఎంఐ సూచీ




**న్యూఢిల్లీ,జూన్ 3:** భారత్‌సేవలరంగ పిఎంఐ సూచీ మేనెలలో స్వల్పంగా పెరిగింది ఏప్రిల్‌లో 58.8పాయింట్లుకు రాగా మేనెలలో 59.8 పాయింట్లకు పెరిగింది. భారత్‌లోసేవలరంగ పిఎంఐ కేవలం బిజినెస్ కార్యకలాపాలు విస్తరణవల్లనే పెరిగిందని అంచనా. మొత్తం 400 సేవలరంగ కంపెనీల స్పందనను క్రోడీకరించి పిఎంఐ సూచీని రూపొందించినట్లు నిపుణులు వెల్లడించారు. 50 పాయింట్లకుపైన ఉంటే పెరుగుతున్నట్లు దిగవకు వెళితే క్షీణించినట్లు పరిగణిస్తారు. రవాణారంగం, సమాచార వ్యవస్థ, ఇన్‌ఫర్మేషన్, ఫైనాన్స్, బీమా, రియల్‌ఎస్టేట్ ఇతర బిజినెస్ సేవల కంపెనీలనుంచి గణాంకాలను సేకరించి సర్వేచేసింది. ఎస్అండ్‌పి గ్లోబల్ పరంగాచూస్తే రవాణా, డిజిటల్‌పరిష్కారాలు, ఈకామర్స్, వినోదరంగం, ఐటి వంటిరంగాలు పిఎంఐకు మద్దతుగా ఉన్నాయి. పేరోల్స్ గణాంకాలపైనా సానుకూల స్పందన లభించింది. ఉపాది సృష్టిపరంగాచూస్తే ఏడాదిలోనే స్వల్పంగా మెరుగుపడినట్లు అంచనావేసింది. ప్యానలిస్టుల్లో ఏడుశాతం మంది నియామకాలు పెరుగుతాయని, కంపెనీల ఉద్యోగులసంఖ్య గణనీయంగా పెరగవచ్చని తెలిపారు. సేవలరంగంలో రికవరీ కనిపిస్తే ఉత్పత్తిరంగంపై ప్రభావం పడుతుంది. 54.7నుంచి మేనెలలో 55శాతానికి ఉత్పత్తిరంగ పిఎంఐ నమోదుకావడం గమనార్హం. హెచ్ఎస్‌బిసి ఇండియా కాంపోజిట్ పిఎంఐ ఉత్పత్తిసూచీ, సర్వీసెస్ బిజినెస్ కార్యకలాపాల సూచీలు ఆరునెలల గరిష్టానికి నమోదయ్యాయి. 58.2నుంచి 59.3పాయింట్లకు పెరిగినట్లు ప్యానల్ నిపుణులు తెలిపారు. కొత్త ఆర్డర్లు రావడం భారత సేవలరంగ సంస్థలకు ఊతం ఇచ్చింది.

# గిటార్‌విజ్ యాప్‌కు యాపిల్ డిజైన్ అవార్డు




**న్యూఢిల్లీ, జూన్ 3:** టెక్ దిగ్గజం యాపిల్ నుంచి భారతీయ యాప్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇండియాకు చెందిన గిటార్ విజ్ యాప్, 2026 సంవత్సరానికి గాను ప్రతిష్మాత్మకమైన యాపిల్ డిజైన్ అవార్డును గెలుచుకుంది. విభిన్న సామర్థ్యాలు గల వినియోగదారులకు సంగీతాన్ని అందుబాటు లోకి తీసుకురావడంలో చేసిన కృషికి గాను ఇన్‌క్లూజివిటీ (సమ్మిళిత) కేటగిరీలో ఈ పురస్కారం దక్కింది. భారతీయ డెవలపర్ బిజోయ్ తంగరాజ్ ఈ అద్భుతమైన యాప్‌ను రూపొందించారు. గిటార్ నేర్చుకునే కొత్తవారికి, ఇప్పటికే అనుభవం ఉన్నవారికి ఒక సమగ్రమైన టూల్‌కిట్‌గా ఈ యాప్ ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా స్వరాలు, కార్డ్స్, వేళ్ల స్థానం వంటి అంశాలపై మాటల ద్వారా సూచనలు ఇవ్వడం దీని ప్రత్యేకత. దీనివల్ల సంగీతకారులు ఎలాంటి సహాయం లేకుండా స్వతంత్రంగా గిటార్ వాయించడం నేర్చుకోవచ్చు. విభిన్న నేపథ్యాలు, సామర్థ్యాలు, భాషలకు చెందిన ప్రతీ ఒక్కరికీ సంగీతాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు యాపిల్ ప్రశంసించింది. ఈ యాప్‌లో ఆపిల్‌కు చెందిన డైనమిక్ టైప్, ఇంక్రీజ్డ్ కాంట్రాస్ట్, డిఫరెన్షియేట్ వితౌట్ కలర్ వంటి అనేక యాక్సెసిబిలిటీ ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ప్రతీ ఏటా యాపిల్ సంస్థ ఇన్నోవేషన్, సోషల్ ఇంపాక్ట్, విజువల్స్ వంటి పలు విభాగాల్లో అత్యుత్తమ యాప్స్, గేమ్స్‌కు ఈ డిజైన్ అవార్డులనుఅందిస్తుంటుంది. గతంలోనూ లూమీ, డెనిమ్,ఎవాల్వ్, మెడిటేట్‌వంటి భారతీయ యాప్‌లు ఈ అవార్డుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇప్పుడు గిటార్ విజ్ సాధించిన ఈ విజయం, ప్రపంచ వేదికపై భారతీయ డెవలపర్ల నైపుణ్యానికి, సృజనాత్మకతకు లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనంగా నిలిచింది.

# వెండి దిగుమతులపై మరింత కఠిన కార్యాచరణ

## పరిమితి దిగుమతుల కేటగిరీలోకి గుళికలు, పొడి



**ముంబయి,జూన్ 3:** వెండి దిగుమతులు రికార్డు స్థాయిలో పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. వెండి దిగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పరిమితులు లేని వెండి గుళికలు, పొడి రూపాలను కూడా పరిమిత దిగుమతుల కేటగిరీలోకి చేర్చింది. ఇకపై ఈ రకమైన వెండిని దిగుమతి చేసుకోవాలంటే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల భారీగా పెరిగిన వెండి దిగుమతి కేంద్రం కఠిన నిర్ణయం ప్రపంచంలోనే అత్యధికంగా వెండిని వినియోగించే దేశంగా ఉన్న భారత్, ఇటీవలి కాలంలో భారీగా వెండిని దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గత నెలలో 99.9 స్వచ్ఛత కలిగిన వెండి కడ్డీలు, ఇతర పాక్షికంగా తయారు చేసిన వెండి ఉత్పత్తుల దిగుమతిని కూడా పరిమిత కేటగిరీలో చేర్చిన విషయం తెలిసిందే. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 నుంచి 15 కి పెంచింది. అధిక చమురు ధరల కారణంగా విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గణాంకాలను పరిశీలిస్తే 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్ల విలువైన వెండిని దిగుమతి చేసుకుంది. అంతకుముందు ఏడాది ఈ దిగుమతుల విలువ కేవలం 4.8 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ యేడాది ఏప్రిల్‌లోనూ వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరాయి. ప్రభుత్వం వెండి దిగుమతులను మరింత కష్టతరం చేసింది. ఇప్పుడు దిగుమతిదారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే ఆ అనుమతి వస్తుందో రాదో, ఎంత సమయం పడుతుందో స్పష్టత లేదని ముంబైకి చెందిన ఓ బులియన్ డీలర్ వ్యాఖ్యానించారు. భారత్‌లో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలతో పాటు సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాలకు కూడా విరివిగా వాడతారు. గత ఏడాది కాలంగా సంప్రదాయ వినియోగం కంటే పెట్టుబడుల రూపంలో వెండికి డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా సిల్వర్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.